


ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 12-1-2019 శనివారం సిటీ సంపుటి 45 సంచిక 153

రూ. 6-50. పేజీలు 18+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఆలోక్‌వర్మ గుడ్‌బై

వాదన వినకుండానే బదిలీ చేశారు

- సహజ న్యాయ సూత్రాలను విస్మరించారు
- దర్యాప్తు ఎదుర్కొంటున్న వ్యక్తి ఫిర్యాదు ఆధారంగా చర్యలా?
- సీబీఐ మాజీ డైరెక్టర్ ఆక్రోశం
- పదవీ విరమణ పొందినట్లు పరిగణించాలని కేంద్రానికి లేఖ

దిల్లీ: సీబీఐ మాజీ డైరెక్టర్ ఆలోక్ వర్మ తాను ఇక ప్రభుత్వ సర్వీసులో కొనసాగబోనని తేల్చిచెప్పారు. తనను తప్పించిన తీరును ఆయన తప్పుబట్టారు. ప్రభుత్వం అనుసరించిన ప్రక్రియను విమర్శిస్తూ కేంద్రానికి లేఖ రాశారు. అత్యున్నత స్థాయి కమిటీ తీరును అందులో ఆక్షేపించారు. ప్రభుత్వం బదిలీ చేసిన విధంగా అగ్నిమాపక సేవలు, పౌర రక్షణ, హోంగార్డుల విభాగం డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలను స్వీకరించేందుకు ఆయన నిరాకరించారు. తాను పదవీ విరమణ పొందినట్లుగా పరిగణించాలని కోరారు. దీన్ని తక్షణం అమల్లోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

1979 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన వర్మది అరుణాచల్ ప్రదేశ్-గోవా-మిజోరాం కేంద్ర పాలిత ప్రాంత (ఏజీఎంయూటీ) క్యాడర్. సీబీఐ డైరెక్టర్‌గా ఆయన పదవీకాలం ఈ నెల 31తో ముగియాల్సి ఉంది.

ఆలోక్ వర్మ, సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాలు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకున్న నేపథ్యంలో ఇద్దరు అధికారులను గత అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం బలవంతపు సెలవుపై పంపిన సంగతి తెలిసిందే. అయితే సీబీఐ డైరెక్టర్‌ను బదిలీ చేసే అధికారం ప్రభుత్వానికి లేదని, ప్రధాని, విపక్ష నేత, సుప్రీం

...మిగతా 2లో

> సహజ న్యాయ సూత్రాలను విస్మరించారు. సీబీఐ డైరెక్టర్ హోదా నుంచి నన్ను తప్పించడం కోసం ప్రక్రియ మొత్తాన్ని తలకిందులు చేశారు. సీబీఐ దర్యాప్తు ఎదుర్కొంటున్న ఒక ఫిర్యాదుదారుడు (అస్థానా) చేసిన ఆరోపణల ఆధారంగా నాకు వ్యతిరేకంగా సీవీసీ నివేదిక తయారైంది. అత్యున్నత స్థాయి కమిటీ ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. సీవీసీ విచారణను పర్యవేక్షిస్తున్న మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.పట్నాయక్ ఎదుట ఆ ఫిర్యాదుదారుడు హాజరు కాలేదు. పైగా సీవీసీ నివేదికలోని నిర్ధారణలు తనవి కావని జస్టిస్ పట్నాయక్ కూడా స్పష్టం చేశారు.
>
> –కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శికి లేఖలో వర్మ



లోక్‌సభ ఎన్నికల తర్వాతే

పూర్తిస్థాయి బడ్జెట్

- అందులోనే గ్రామ పంచాయతీలకు నిధుల కేటాయింపు
- కొత్తగా ఎన్నికయ్యే సర్పంచులకు శిక్షణ
- నూతన చట్టంపై అవగాహన
- సమీక్షలో సీఎం కేసీఆర్ వెల్లడి



ఈనాడు, హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందున రాష్ట్రంలోనూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. వచ్చే ఏప్రిల్, మే మాసాల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయని, ఆ తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతామని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, ఉప సర్పంచులకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని, గ్రామాలను అద్భుతంగా తీర్చిదిద్దే విషయంలో వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచడం లక్ష్యంగా కొత్తగా రూపొందించిన చట్టంపై సర్పంచులకు తెలియజేయాలని, ప్రతి గ్రామ పంచాయతీకి కొత్త చట్టం తెలుగు ప్రతులను పంపించాలని చెప్పారు. కొత్తగా నియామకమయ్యే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కలసికట్టుగా పనిచేయడానికి అవసరమైన అవగాహన కల్పించాలని, సర్పంచులు మూస పద్ధతిలో కాకుండా, గ్రామాల సమగ్ర వికాసానికి పాటుపడే ఉద్యమకారులుగా మారాలని పేర్కొన్నారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్.. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు

...మిగతా 2లో



అస్థానాపై ఎఫ్‌ఐఆర్ కొట్టివేతకు నిరాకరణ

- ఆయనపై చర్యలు తీసుకోకుండా ఇచ్చిన తాత్కాలిక ఉత్తర్వును రద్దు చేసిన దిల్లీ హైకోర్టు
- పది వారాల్లోగా దర్యాప్తు పూర్తిచేయాలని సీబీఐకి ఆదేశం

దిల్లీ: అవినీతి కేసులో సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి దిల్లీ హైకోర్టు శుక్రవారం నిరాకరించింది. ఆయనపై క్రిమినల్ చర్యలు చేపట్టకుండా రక్షణ కల్పిస్తూ తాను ఇచ్చిన తాత్కాలిక ఉత్తర్వును కూడా రద్దు చేసింది. అంటే.. ఆయనను అరెస్టు చేయాలనుకుంటే ఎలాంటి అడ్డంకులు ఉండవు. అస్థానాపై వచ్చిన ఆరోపణలను ఈ దశలో 'నిర్ధారణగా కొట్టిపారేయలేమని' కూడా కోర్టు పేర్కొంది. ఇదే కేసులో సీబీఐ డీఎస్పీ దేవేందర్ కుమార్, మధ్యవర్తి మనోజ్ ప్రసాద్‌పై దాఖలైన ఎఫ్ఐఆర్‌లను కొట్టేయడానికీ ఒప్పుకోలేదు. ఈ కేసులోని అంశాలను పరిగణనలోకి తీసుకుంటే అస్థానా, దేవేందర్‌లను ప్రాసిక్యూట్ చేయడానికి ముందస్తు అనుమతి అవసరం లేదని న్యాయమూర్తి జస్టిస్ నజ్మీ వజీరీ చెప్పారు. ఈ కేసు దర్యాప్తును పది వారాల్లోగా పూర్తి చేయాలని సీబీఐని ఆదేశించారు. నాటి సీబీఐ డైరెక్టర్ ఆలోక్ వర్మ తనపై దురుద్దేశంతోనే అభియోగాలు మోపారన్న అస్థానా వాదన నిర్ధారణ కాలేదన్నారు.

ఆలోక్ వర్మ, అస్థానాలు కొద్ది నెలలుగా తీవ్రస్థాయిలో ఘర్షణ పడుతూ పరస్పరం

...మిగతా 2లో

తెలంగాణ హైకోర్టుకు కొత్త సీజే

- జస్టిస్ రాధాకృష్ణన్ కోల్‌కతాకు బదిలీ
- ఆయన స్థానంలో జస్టిస్ చౌహాన్!



జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్

ఈనాడు, దిల్లీ

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ కలకత్తా హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఈమేరకు సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకుంది. ఆయన స్థానంలో జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. సీనియారిటీలో రెండో స్థానంలో ఉన్నట్లు సమాచారం. గురువారం సుప్రీంకోర్టు

...మిగతా 2లో



'లేవండి.. మేల్కోండి.. ఇక నిద్ర చాలించండి.. సమస్యలన్నీ అధిగమించే అద్భుత శక్తి ప్రతి ఒక్కరిలోనూ ఉంది' అంటూ యువతను జాగృత పరచిన స్వామి వివేకానంద ప్రతి వాక్కులోనూ ప్రచండ శక్తి దాగి ఉంది. ఆత్మన్యూనతతో బాధపడుతున్నవారికి ఆత్మస్థైర్యాన్ని ఇస్తాయి ఆయన మాటలు. ఆత్మహత్య అంచు వరకూ వెళ్లిన వారికి కొండంత మనోనిబ్బరం కలిగించి అసామాన్యులుగా మలిచేదీ ఆయన సూక్తులే. వివేకానంద ఉపదేశాలు యువతరానికి ఎప్పటికీ స్ఫూర్తి మంత్రాలే. ఏ విజయాన్ని పరికించినా.. దాని వెనుక అంతర్లీనంగా ఆయన స్ఫూర్తి దాగి ఉంటుంది. సర్వమత సమ్మేళనంలో భారతీయ సాంస్కృతిక ఔన్నత్యాన్ని చాటిన ఆయన ప్రతి అక్షరం.. నేటి యువతకు తక్షణావసరం. వివేకానంద జయంతి రోజున మనం ఏటేటా నిర్వహించుకొంటున్న యువజన దినోత్సవం సందర్భంగా స్ఫూర్తిదాయక కథనాలు

ఈతరం లో..


ఓ యువతా మేలుకో! అంతర్యామి కథనం 4వ పేజీలో


పొలమే ప్రయోగశాల

- పరిశోధన ఫలాన్ని రైతులకు క్షేత్రంలో ప్రత్యక్షంగా చూపాలి
- అప్పుడే దాన్ని అందిపుచ్చుకుంటారు
- శాస్త్రవేత్తల్లో క్రమశిక్షణ, పని సంస్కృతి పెరిగితే సత్ఫలితాలు
- నగరాలు, పట్టణాలకు సమీపంలో వరి సాగు చేయనివ్వకూడదు
- శివార్లలో పండ్లు, కూరగాయలే పండించాలి
- తృణధాన్యాల సాగు పెరిగితే ప్రజలకు పోషకాహారం

'ఈనాడు'తో ముఖాముఖిలో ఫ్లోరిడా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త కె.రమేశ్‌రెడ్డి

...పూర్తి వివరాలు 2లో





గగన్‌యాన్ ఊహా చిత్రం

ఏప్రిల్‌లో చంద్రయాన్-2

- మరికొన్ని పరీక్షలు నిర్వహించాల్సి ఉంది
- గడువులోగానే గగన్‌యాన్
- మహిళా వ్యోమగామికీ అవకాశం
- ఇస్రో ఛైర్మన్ ప్రకటన

2లో



రాహుల్



హార్దిక్

నోరు జారారు.. వేటు పడింది

ఒక టీవీ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లపై సస్పెన్షన్ వేటు పడింది. వీరి వ్యాఖ్యలపై విచారణకు ఆదేశించిన బీసీసీఐ.. అది పూర్తయ్యే వరకు మ్యాచ్‌లు ఆడకుండా సస్పెన్షన్ విధించింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న పాండ్య, రాహుల్‌లను వెంటనే స్వదేశానికి రప్పించాలని కూడా బీసీసీఐ నిర్ణయించింది. శనివారం నుంచి ఆసీస్‌తో ఆరంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌కు వీళ్లిద్దరూ దూరమయ్యారు.

...వివరాలు ఛాంపియన్ లో





లెక్కల కష్టానికి సీబీఎస్ఈ విరుగుడు

- పదో తరగతి గణితంలో రెండు రకాల పరీక్షలు
- ఒకటి సులువు, మరోటి కఠినం
- నిర్ణయం విద్యార్థులదే
- 2020 నుంచి అమలు

ఈనాడు, అమరావతి: గణితం అంటే భయపడిపోయే విద్యార్థులకు కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) శుభవార్త చెప్పింది. 2020 నుంచి సీబీఎస్ఈ పదో తరగతి గణిత పరీక్షను రెండు రకాలుగా నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతమున్న కఠినత్వంతో ప్రామాణిక (స్టాండర్డ్) పరీక్షను, సులువుగా ఉండేలా ప్రాథమిక (బేసిక్) పరీక్షను నిర్వహించనున్నారు. ఉన్నత విద్యలో గణిత సంబంధ కోర్సులు అభ్యసించాలనుకునే విద్యార్థులు ప్రామాణిక పరీక్ష ఉత్తీర్ణులు కావాల్సిందే. ఇతర కోర్సులు చేయాలనుకునే వారు ప్రాథమిక స్థాయి పరీక్ష ఉత్తీర్ణులయితే చాలు. పాఠ్య ప్రణాళిక, బోధనల్లో ఎలాంటి మార్పులూ ఉండవు. విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు

...మిగతా 2లో

హెచ్-1బి వీసాదారులూ నిశ్చింతగా ఉండండి

- ఉద్యోగాల్లో కొనసాగేలా నిబంధనలను సరళీకరిస్తాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భరోసా
- పౌరసత్వం పొందడానికీ మార్గం సుగమం
- ప్రతిభావంతులను ప్రోత్సహించేలా మార్పులు



వాషింగ్టన్: అమెరికాలో భారతీయ నిపుణులకు తీపి కబురు! ట్రంప్ వైఖరితో ఉద్యోగాల్లో కొనసాగిస్తారా, అమెరికాలో ఉండనిస్తారా అని ఆందోళన చెందుతున్న వారికి ఆయనే ఉపశమనం కలిగించే వార్త చెప్పారు. ఉద్యోగాల్లో కొనసాగడంతో పాటు... అగ్రరాజ్య పౌరసత్వాన్ని కూడా పొందడానికి మార్గం సుగమం చేసేలా హెచ్-1బీ వీసా నిబంధనల్లో త్వరలోనే భారీ

...మిగతా 2లో

TG

పొలమే ప్రయోగశాల

- 'ఈనాడు'తో ముఖాముఖిలో ఫ్లోరిడా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త రమేశ్‌రెడ్డి

ఈనాడు - హైదరాబాద్



కె.రమేశ్‌రెడ్డి

'మనదేశంలో వరి అన్నం తినేవారి సంఖ్య చాలా ఎక్కువ. ఇది ఎందుకు తినాలని ఆలోచించడం మొదలుపెడితే వరి సాగును సులభంగా తగ్గించవచ్చు. అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి పంటను నగరాలు, పట్టణాల సమీపంలో సాగు చేయనివ్వకూడదు. అక్కడి ప్రజలకు నిత్యావసరాలైన పండ్లు, కూరగాయలను వరికన్నా చాలా తక్కువ నీటితో పండించవచ్చు' అని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త కె.రమేశ్‌రెడ్డి చెప్పారు. అమెరికాలోని ఫ్లోరిడా విశ్వవిద్యాలయంలో గత 40 ఏళ్లుగా శాస్త్రవేత్తగా పనిచేస్తున్న ఆయన హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీకి వచ్చిన సందర్భంగా 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ముఖాముఖి సారాంశమిదీ..

దీర్ఘకాలంగా అమెరికా వర్సిటీల్లో వ్యవసాయ పరిశోధనల్లో ఉన్నారు. అక్కడికి, మనదేశంలో సాగుకు స్పష్టమైన తేడా ఏమిటి?

మనకు ఏం కావాలో తెలిస్తే మన రైతులు ఏం పండించాలనేదీ అర్థమవుతుంది. మన ఆలోచనా విధానం మారాలి. నేను గత 30 ఏళ్లుగా వరి అన్నం తినడం లేదు. అయినా 7 పదుల వయసు దాటినా ఇప్పటికీ రోజూ 5 మైళ్లు నడుస్తున్నా. ఆరోగ్యంగానే ఉన్నా. పోషకాహారం తినాలనే ధ్యాస అందరిలోనూ పెరిగితే మనం సాగు చేసే పంటల విషయంలో పూర్తిగా మార్పులు వస్తాయి. వరి అన్నంకన్నా తృణధాన్యాల పంటలు తినడం అలవాటైతే మరిన్ని పోషకాలు ప్రజలకు అందుతాయి.

భారత్‌లో పేదరికం, చిన్న కమతాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే.. పంటల సాగులో ఎలాంటి మార్పులు తేవాలి?

పంటల కాలనీలు ఏర్పడాలి. ఒక ప్రాంత వాతావరణానికి అనుకూలం, డిమాండు ఉన్న పంట అక్కడ పండించాలి. ఉదాహరణకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాలకు దగ్గరలో వరి సాగు ఎందుకు చేయనిస్తున్నారో చెప్పండి. నగరాలకు ప్రతిరోజూ పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు చాలా అవసరం. వాటిని వరికన్నా తక్కువ నీటితో పట్టణాలకు సమీపంలో పండించే విధానం రావాలి. ఇలా చేయడానికి కమతాలు, పేదరికం వంటివి అడ్డుకావని నా ఉద్దేశం.

ఇక్కడ వ్యవసాయ పరిశోధనల ఫలితాలు రైతులకు సులభంగా ఎందుకు అందడం లేదు?

వ్యవసాయ శాస్త్రవేత్తల్లో క్రమశిక్షణ, పని సంస్కృతి పెరిగితే సత్ఫలితాలు కనిపిస్తాయి. ప్రయోగశాలలో ఏం సాధించారనేది రైతుల పొలాల్లో నేరుగా చేసి, ఫలితాలను ప్రత్యక్షంగా చూపాలి. అప్పుడు రైతులు వాటిని అందిపుచ్చుకుంటారు. శాస్త్రవేత్తలు రైతులతో కలసి పని చేస్తే పరిజ్ఞానాన్ని వారే చూసి తెలుసుకుంటారు. అమెరికాలో అదే జరుగుతోంది. ప్రదర్శనా క్షేత్రాల్లో ప్రయోగాలను ప్రత్యక్షంగా చేసి చూపుతారు. వ్యవసాయ పరిశోధనల ఫలితాలను రైతులకు చేరవేసేందుకు విస్తరణ విభాగం పటిష్ఠంగా పనిచేయాలి.

మీరు ఏ రంగంలో పరిశోధనలు చేస్తున్నారు? రైతులకు ఎలా అందిస్తున్నారు ?

ఫ్లోరిడా వర్సిటీలో భూసార, నీటి పరిరక్షణ విభాగం ఛైర్మన్‌గా పనిచేస్తున్నా. మెట్టభూముల్లో సాగుపై పరిశోధనలు చేశాను. భూసారాన్ని రక్షించుకుని, నీటిని పొదుపుగా వాడుకుంటే పంటల దిగుబడి ఎలా పెంచవచ్చనేది అక్కడి రైతులకు మా పరిశోధనల ద్వారా నేరుగా వివరిస్తుంటాం.

చిన్న కమతాల రైతుల ఆదాయం ఎలా పెంచాలి?

చిన్న రైతులను సంఘటిత సాగు వైపు ప్రోత్సహించాలి. ఎక్కువ ధరకు అమ్ముకునే వ్యవస్థ ఏర్పాటుకావాలి. ఒక్కో రైతు విడివిడిగా చేసే సాగుకన్నా సంఘంగా పెద్ద కమతం మాదిరిగా ఒకే పంటను పండిస్తే అనేక లాభాలున్నాయి.

అమెరికాలో నీటి పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

అక్కడ చెరువుల పరిరక్షణ, నీటి పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యముంటుంది. ఓర్లాండో ప్రాంతంలో ఒక చెరువు ఉంది. దాని చుట్టుపక్కల 40 వేల ఎకరాల్లో క్యాబేజీ, క్యారెట్ వంటి పంటలు పండించేవారు, ఆ పంటల సాగు తరవాత వ్యర్థాలు, మురుగునీరంతా చెరువులోకి వస్తున్నందున అది కలుషితమవుతోందని పరిశోధనల్లో గుర్తించాం. ప్రభుత్వం వెంటనేరంగంలోకి దిగి, 10 కోట్ల డాలర్లను పరిహారంగా చెల్లించి ఆ భూమిని కొనేసింది. అక్కడ చెట్లు పెంచి చెరువులోకి మురుగు నీరు చేరకుండా గట్టి చర్యలు తీసుకుంది. సహజ వనరులు కలుషితం కాకుండా ఇంత తీవ్రమైన చర్యలుంటాయి.

నదీ పరీవాహక ప్రాంతాల్లో అలా చేయడం సాధ్యమేనా?

నదుల నీటి నమూనాలనూ పరీక్షించి వాటి శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి. హైదరాబాద్‌లో మూసీ నది చాలా తీవ్రంగా కలుషితమైంది. అలాంటి నీటితో పంటల సాగు ఎందుకని అందరూ ఆలోచించాలి. నీటి నాణ్యత సరిగా లేకపోతే నాణ్యమైన పంటలు పండవని మా పరిశోధనల్లో గుర్తించాం. నీటి నమూనాలనూ ఎప్పటికప్పుడు పరీక్షించి పంటల సాగుకు అవి పనికొస్తాయో లేదో రైతులకు చెప్పాలి.

అమెరికాలోనూ రసాయన ఎరువులు, పురుగుమందులు ఎక్కువగా వాడుతున్నారు. వీటి వాడకంతో భూసార పరిరక్షణ ఎలా సాధ్యం?

అక్కడ వేల ఎకరాల్లో సగటు దిగుబడి ఎక్కువ. ఆ నిష్పత్తితో పోలిస్తే ఇక్కడ చిన్న కమతాల్లో తక్కువ దిగుబడికి వాడే రసాయనాలు అధికం. మనం ఆరోగ్యాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటామో, నేలతల్లినీ అలాగే కాపాడుకోవాలి. భూసారంలో కర్బన పదార్థం (ఆర్గానిక్ మేటర్) చాలా ముఖ్యం. అది తగ్గితే భూమి నిస్సారమై పంటలు పండవు. దాన్ని కాపాడుకోవడానికి అమెరికా శాస్త్రవేత్తలు, రైతులు ఎక్కువ శ్రద్ధ చూపుతారు. ఏయే పోషకాలు తక్కువుంటే వాటిని సులభంగా అందించే సేంద్రియ ఎరువులు వాడితే భూసారం పెరుగుతుంది.

వ్యవసాయ శాస్త్రవేత్తగా ఇక్కడా, అమెరికాలో పనిచేశారు, పని విధానంలో మీరు గమనించిన తేడా ఏమిటి?

అమెరికాలోని 3 పెద్ద వర్సిటీల్లో నేను మొత్తం 45 ఏళ్లుగా పనిచేస్తున్నా. అక్కడ ప్రతి ఏడాదీ నేనేం చేస్తున్నానో నిరూపించుకోవాలి. ఈ ఏడాది నేను మంచి ఫలితాలు చూపకపోతే.. వచ్చే ఏడాది సక్రమంగా పనిచేయాలని హెచ్చరిస్తారు. అప్పుడూ ఫలితాలు రాకపోతే ఉద్యోగం ఉండదు. ఇక్కడా అలాంటి పనివిధానం రావాలి. ప్రతి ఒక్కరూ తానేం చేయాలనుకుంటున్నాను, దాని వల్ల ఏం ఫలితాలు రైతులకు అందుతాయనే కోణంలో అంకితభావంతో పనిచేస్తేనే వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుంది. అక్కడ ఒక వర్సిటీలో చదివి, పీహెచ్‌డీలు తీసుకున్నవారికి అక్కడే ఉద్యోగం ఇవ్వడానికి ఇష్టపడరు. బయటివారిని తీసుకోవడానికి ప్రాధాన్యమిస్తారు. ఇతర ప్రాంతాల వారిలో కొత్త ఆలోచనలు ఉంటాయనేది వ్యూహం. మనదేశంలో ఒకే వర్సిటీలో డిగ్రీలన్నీ చదివి, అక్కడే ఉద్యోగం, ప్రమోషన్లు పొంది, అక్కడే రిటైర్ కావాలనుకుంటారు.

కుగ్రామం నుంచి అగ్రదేశానికి..

తెలంగాణ రాష్ట్రంలోని ఓ కుగ్రామానికి చెందిన కె.రమేశ్‌రెడ్డి.. అగ్రదేశంలో కీలక పదవుల్లో పనిచేసే స్థాయికి ఎదిగారు. ఆయనది మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట గ్రామం. తిరుపతి వ్యవసాయ కాలేజీలో ఏజీ బీఎస్సీ, హైదరాబాద్‌లోని ఒకప్పటి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీలో 1967లో అగ్రికల్చరల్ ఎంఎస్సీ పూర్తిచేశారు. ఆ తరువాత అక్కడే వ్యవసాయ అధ్యాపకుడిగా మూడేళ్లు పనిచేశారు. 1971-76 మధ్యకాలంలో అమెరికాలోని లూసియానా వర్సిటీలో రిసెర్చ్ అసోసియేట్‌గా చేరి వ్యవసాయంలో పీహెచ్‌డీ చేశారు. 1976-79లో నార్త్ కరోలినా వర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్ అసోసియేట్‌గా పనిచేశారు. 1979లో ఫ్లోరిడా వర్సిటీలో సహాయ శాస్త్రవేత్తగా చేరి.. ప్రస్తుతం అక్కడే భూసార, నీటి శాస్త్ర విభాగం ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు. పలు అంశాల్లో పురస్కారాలు అందుకున్నారు. గతేడాది మెట్టభూముల బయోకెమిస్ట్రీ విభాగంలో జీవిత కాల సాఫల్య గోల్డెన్ కట్టెల్ పురస్కారం, 2016లో అమెరికా జాతీయ మెట్టభూముల పరిశోధనా పురస్కారం అందుకున్నారు.

ఏప్రిల్‌లో చంద్రయాన్-2

- ఇస్రో ఛైర్మన్ ప్రకటన



శుక్రవారం బెంగళూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్ శివన్

ఈనాడు డిజిటల్, బెంగళూరు: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విధించిన గడువులోగా 2021 డిసెంబర్‌లోనే మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'ను చేపట్టనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ కె.శివన్ ప్రకటించారు. చంద్రుడిపై పరిశోధనల నిమిత్తం చేపట్టే చంద్రయాన్-2ను ముందుగా ప్రకటించినట్లు జనవరి- ఫిబ్రవరిలో కాకుండా ఏప్రిల్ మూడో వారంలో ప్రయోగిస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి మరిన్ని పరీక్షలు చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని శుక్రవారం ఇక్కడ విలేఖరులతో పేర్కొన్నారు.

మహిళా వ్యోమగామికి అవకాశం!

గగన్‌యాన్ ప్రాజెక్టు తుది ప్రయోగానికి ముందుగా 2020 డిసెంబరు, 2021 జులైలో మానవ రహిత ప్రయోగాలు చేపడతామని శివన్ తెలిపారు. 2021 డిసెంబరు చివరన లేదా 2022 జనవరి తొలివారంలో మానవసహిత యాత్రను చేపడతామన్నారు. ఈ యాత్రలో ముగ్గురు వ్యోమగాములు ప్రయాణిస్తారని, వారిలో ఓ మహిళ కూడా ఉండొచ్చని తెలిపారు. వైమానిక దళం, ఇస్రో, సాధారణ పౌరుల్లో ఒకరు ఈ ప్రతిష్ఠాత్మక యాత్రలో పాల్గొనబోతున్నారు. అది ఎవరన్నది ప్రాజెక్టు పూర్తయిన తర్వాతే వెల్లడిస్తామన్నారు. గగన్‌యాన్.. ఇస్రోకు ఒక కీలక మలుపని చెప్పారు. "గగన్‌యాన్‌లో రెండు అంశాలు ఉంటాయి. ఒకటి ఇంజినీరింగ్, రెండోది జీవ శాస్త్రం. ఇంజినీరింగ్ అంశంలో వాహకనౌక, వ్యోమగాములను మోసుకెళ్లే క్రూ మాడ్యూల్, సర్వీసు మాడ్యూల్ ఉంటాయి. ఇందులో ఇస్రోకు నైపుణ్యం ఉంది. అయితే వ్యోమగాముల ఎంపిక, శిక్షణ, వారికి అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడం వంటివి జీవశాస్త్ర విభాగంలో ఉంటాయి. ఇవి ఇస్రోకు కొత్త. గగన్‌యాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి మేం కొత్తగా ఇస్రోలో 'హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నాం. దీనికి డైరెక్టర్‌గా ఉన్నికృష్ణన్‌ను ఎంపిక చేశాం. గగన్‌యాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆర్.హట్టన్ వ్యవహరిస్తారు" అని తెలిపారు. వ్యోమగాములకు ప్రాథమిక శిక్షణను భారత్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్‌లోను తదుపరి శిక్షణ రష్యాలో ఉండొచ్చన్నారు.

చంద్రయాన్-2 ఆలస్యం

జనవరి-ఫిబ్రవరిలో ప్రయోగించాల్సి ఉన్న చంద్రయాన్-2ను ఏప్రిల్‌లో ప్రయోగిస్తామని డాక్టర్ కె.శివన్ తెలిపారు. పదేళ్ల కిందట ప్రయోగించిన చంద్రయాన్-1 కంటే ఎంతో మెరుగైన సాంకేతికతతో చంద్రయాన్-2 రూపుదిద్దుకుంటోంది. రూ.800 కోట్ల వ్యయంతో తయారవుతున్న చంద్రయాన్-2లోని రోవర్ చంద్రునిపై వాతారవణ పరీక్షలను సమర్థవంతంగా చేపడుతుంది. ల్యాండర్, రోవర్‌లు 14 రోజుల పాటు పని చేస్తాయని శివన్ వివరించారు. చంద్రునిపై 500 మీటర్ల పాటు చలించే రోవర్‌లను కొత్త ప్రాజెక్టులో రూపొందించామన్నారు.

ఆరు చోట్ల పరిశోధన కేంద్రాలు

దేశవ్యాప్తంగా ఆరు చోట్ల అంతరిక్ష సాంకేతిక ప్రోత్సాహక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు శివన్ తెలిపారు. ఉత్తర, దక్షిణ, తూర్పు, ఈశాన్య, పశ్చిమ, మధ్య భారత్‌లో ఇవి సిద్ధమవుతాయని చెప్పారు. అంతరిక్ష పరిజ్ఞాన ఫలాలను అన్ని ప్రాంతాల ఔత్సాహికులకు అందేలా చూడటం ఈ కేంద్రాల ఏర్పాటు ఉద్దేశమన్నారు. "ఈ అంకుర సంస్థలకు ఇస్రోనే పలు ప్రాజెక్టుల ఆలోచనలను అందిస్తుంది. వీటిపై అవి రూపొందించిన డిజైన్లను అభివృద్ధి చేసేందుకు ఇస్రో సాంకేతిక సహకారాన్ని ఇస్తుంది" అని తెలిపారు. చిన్న ప్రయోగంగా పిలిచే ఎస్ఎస్ఎల్‌వీ, జీశాట్-20, ఆదిత్య ఎల్-1 వంటివి ఈ ఏడాదిలో ప్రయోగించే ప్రాజెక్టుల్లో ముఖ్యమైనవని వివరించారు.

తెలంగాణ హైకోర్టుకు కొత్త సీజే

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ అరుణ్ మిశ్రాలతో కూడిన కొలీజియం సమావేశమై జస్టిస్ రాధాకృష్ణన్ బదిలీపై కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు పంపింది. దీనిపై నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ దామా శేషాద్రినాయుడు బాంబే హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఝార్ఖండ్ హైకోర్టులో సేవలందిస్తున్న జస్టిస్ ప్రథమ్ పట్నాయక్‌ను ఆయన అభ్యర్థన మేరకు ఒడిశా హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం నిర్ణయించింది.

సుప్రీంకు ఇద్దరు న్యాయమూర్తులు

సుప్రీం కోర్టు న్యాయమూర్తి పదవులకు కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దినేష్ మహేశ్వరి, దిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ సంజీవ్‌ఖన్నాల పేర్లను కొలీజియం సిఫార్సు చేసింది. 31 మంది న్యాయమూర్తులు ఉండాల్సిన సుప్రీంలో ప్రస్తుతం 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేసే క్రమంలో కొలీజియం వీరిద్దరి పేర్లను సిఫార్సు చేసింది.

నాటి నిర్ణయాల్లో మార్పులు

కొలీజియం డిసెంబరు 12న సమావేశమైనప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకుంది. అయితే వాటిపై అవసరమైన సంప్రదింపులు పూర్తికాలేదు. శీతాకాల సెలవుల అనంతరం కోర్టు పునఃప్రారంభమయ్యేనాటికి కొలీజియంలో మార్పులు వచ్చాయి. కొత్తగా ఏర్పడిన కొలీజియం సభ్యులు ఈనెల 5, 6 తేదీల్లో సమావేశమై పూర్తిస్థాయిలో చర్చించినప్పుడు అన్ని విషయాలను కొత్తగా అందుబాటులోకి వచ్చిన సమాచారం ఆధారంగా పరిశీలించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే సుప్రీం కోర్టులో ఉన్న ఖాళీల్లో రెండింటిని భర్తీ చేయాలని కొలీజియం తీర్మానించింది.

తెలంగాణలో పొడి వాతావరణం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడిందని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు. కర్ణాటక కోస్తా నుంచి తెలంగాణ పక్క నుంచి విదర్భ మీదుగా మధ్యప్రదేశ్ వరకూ 900 మీటర్ల ఎత్తున ఉపరితల ద్రోణి ఏర్పడిందని వివరించారు. తూర్పు, ఆగ్నేయ భారతం నుంచి తెలంగాణ వైపు వీస్తున్న తేమ గాలులు ఈ ద్రోణి వల్ల భూమి మీదకు వస్తున్నాయి. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నందున చలి తీవ్రత తగ్గినట్లు పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో ఇదే వాతావరణం ఉంటుందని చెప్పారు. పగటిపూట పలు ప్రాంతాల్లో సాధారణం కన్నా 3 డిగ్రీలు పెరిగి 33 డిగ్రీలుగా ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రిపూట ఆదిలాబాద్‌లో అత్యల్పంగా 9 డిగ్రీలుంది.

లోక్‌సభ ఎన్నికల తర్వాతే పూర్తిస్థాయి బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

శిక్షణ ఇచ్చే అంశంపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, కాలె యాదయ్య, సీఎం కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "రాష్ట్రంలో ప్రస్తుతం గ్రామ పంచాయతీల ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రతి గ్రామానికి పంచాయతీ కార్యదర్శి ఉండేలా నియామకాలు చేపడుతున్నాం. గ్రామాభివృద్ధిలో సర్పంచి, కార్యదర్శి పాత్ర చాలా కీలకం. ప్రతి గ్రామానికి విధులు, బాధ్యతలు అప్పగించే విషయంలో కొంత జాప్యం అనివార్యంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతుంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడతాం. అందులోనే పంచాయతీలకు నిధులు కేటాయించడం సాధ్యమవుతుంది. ఆలోగా సర్పంచులు, కార్యదర్శులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చి, గ్రామాభివృద్ధి కోసం పాటుపడే కార్యకర్తలుగా తీర్చిదిద్దాలి. తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ, ఎంసీహెచ్‌ఆర్డీ, ఆస్కి తదితర సంస్థల ద్వారా శిక్షణ ఇప్పించాలి" అని సీఎం ఆదేశించారు.

లెక్కల కష్టానికి సీబీఎస్ఈ విరుగుడు

(మొదటి పేజీ తరువాయి)

సీబీఎస్ఈ తెలిపింది. వారి వారి ఆసక్తి, సామర్థ్యాలను బట్టి ఏ రకమైన పరీక్ష రాయాలన్న విషయాన్ని విద్యార్థులే నిర్ణయించుకోవచ్చు. ప్రాథమిక స్థాయి పరీక్ష రాసి ఉత్తీర్ణులైనా, కాకపోయినా విద్యార్థులు కంపార్ట్‌మెంట్ పరీక్షలప్పుడు ప్రామాణిక పరీక్షను రాయొచ్చు. ప్రామాణిక పరీక్ష ఉత్తీర్ణత సాధించలేనివారు కూడా కంపార్ట్‌మెంట్ పరీక్షలప్పుడు ప్రాథమిక స్థాయి పరీక్షకు మారొచ్చు.

హెచ్-1బి వీసాదారులూ నిశ్చింతగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

మార్పులు తీసుకురానున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అమెరికాలోని ఐటీ నిపుణుల్లో అత్యధిక మంది భారతీయులే. దశాబ్ద కాలంగా వారు అక్కడే పనిచేస్తున్నా... శాశ్వత నివాసం/పౌరసత్వం లేవు. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత తొలి రెండేళ్లలో ప్రభుత్వం వీరిపై ఆంక్షలు విధించింది. వీసా గడువు పొడిగింపును, కొత్త హెచ్-1బి వీసాల జారీని కఠినతరం చేసింది. అయితే... అత్యంత ప్రతిభావంతులను ప్రోత్సహించి, వారు అమెరికాలోనే ఉండేలా నిబంధనల్లో మార్పులు తీసుకురావాలని ట్రంప్ కొంతకాలంగా యోచిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా 'ప్రతిభ ఆధార వలస విధానం (మెరిట్-బేస్డ్ ఇమిగ్రేషన్ సిస్టం)' గురించి ఇటీవల ఆయన పదేపదే ప్రస్తావించారు కూడా. గత నెల చట్టసభ్యులతో సమావేశం సందర్భంగా హోంలాండ్ సెక్యూరిటీ సెక్రటరీ కిస్టెన్ నీల్సెన్ మాట్లాడుతూ- వర్క్ వీసాల నిమిత్తం విదేశాల నుంచి పరిమితికి మించి దరఖాస్తులు వస్తున్నాయని, వాటన్నింటిని నిశితంగా పరిశీలించి, అత్యంత ప్రతిభావంతులైన నిపుణులను ఎంపిక చేసుకోవాల్సి ఉందన్నారు. మరోవైపు అత్యధిక వేతనాలతో పనిచేయదలచిన ప్రతిభావంతులకు హెచ్-1బి వీసాల జారీలో ప్రాధాన్యం ఇవ్వాలని అమెరికా పౌరసత్వ, వలస విభాగం 'యూఎస్‌సీఐఎస్' కూడా గత నవంబరులో ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే వీసా నిబంధనలను సడలించనున్నట్టు ట్రంప్ వెల్లడించడం విశేషం. ఆయన నిర్ణయం పట్ల పలువురు భారతీయ నిపుణులు హర్షం వ్యక్తం చేశారు. అయితే ట్రంప్ మాటలను అంత త్వరగా నమ్మలేమని, అనవసరంగా అత్యాశలు పెట్టుకోవద్దని ఒబామా హయాంలో అధికారిగా పనిచేసి, ప్రస్తుతం హెచ్1-బి వీసా వ్యవహారాలను చూస్తున్న లియోన్ ఫ్రెస్కో ట్విట్టర్‌లో స్పందించారు.

ఇక్కడే నిశ్చింతగా ఉండొచ్చు

అమెరికాలోని హెచ్1-బి వీసాదారులు ఇక నిశ్చింతగా ఉండొచ్చు. వారు ఉద్యోగాల్లో కొనసాగేందుకు కచ్చితమైన భరోసానిచ్చేలా సులభతర నిబంధనలు రాబోతున్నాయి. అమెరికా పౌరసత్వం పొందడానికి కూడా ఇవి దోహదపడతాయి. ప్రతిభావంతులనూ; అత్యంత సమర్థులైన నిపుణులను ప్రోత్సహించాలనుకుంటున్నాం. వారు అమెరికాలోనే తమ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చు.

– ట్విట్టర్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

ఆలోక్‌వర్మ గుడ్‌బై

(మొదటి పేజీ తరువాయి)

కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన అత్యున్నత స్థాయి కమిటీ మాత్రమే ఆయన భవితవ్యాన్ని తేల్చాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో సీబీఐ డైరెక్టర్ పదవిని వర్మ మళ్లీ చేపట్టారు. అయితే ఆయనను తప్పించాలని అత్యున్నత స్థాయి కమిటీ గురువారం నిర్ణయించింది. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని అగ్నిమాపక సేవలు, పౌర రక్షణ, హోంగార్డుల విభాగానికి డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేసింది. కొత్త బాధ్యతలు చేపట్టకుండానే వైదొలగాలని నిర్ణయించుకున్న వర్మ ఈమేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శికి లేఖ రాశారు.

ప్రభుత్వ తీరుకు ఇది తార్కాణం

వ్యవస్థలే ప్రజాస్వామ్యానికి బలమైన చిహ్నాలని వర్మ పేర్కొన్నారు. భారత్‌లో నేడున్న అత్యంత ముఖ్యమైన సంస్థల్లో సీబీఐ కూడా ఒకటన్నారు. "గురువారం అత్యున్నత స్థాయి కమిటీ తీసుకున్న నిర్ణయం సీబీఐతో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిదర్శనం. ఇది అందరూ ఆత్మావలోకనం చేసుకోవాల్సిన సమయం" అని చెప్పారు. నాలుగు దశాబ్దాల సర్వీసులో తనది మచ్చలేని రికార్డన్నారు. తాను 2017 జులై 31నే పదవీ విరమణ పొందినట్లు వర్మ తెలిపారు. సీబీఐ డైరెక్టర్‌కు రెండేళ్ల స్థిర పదవీకాలం ఉన్నందువల్లే తాను సర్వీసులో కొనసాగుతున్నట్లు చెప్పారు. ఈ నెల 31న ఆ పదవీకాలం ముగుస్తుందన్నారు. అయితే తాను సీబీఐ డైరెక్టర్ పదవిలో లేనని, అగ్నిమాపక సేవలు, పౌర రక్షణ, హోంగార్డుల విభాగానికి డైరెక్టర్ పదవి చేపట్టడానికి ఇప్పటికే పదవీ విరమణ వయసును దాటిపోయినట్లు చెప్పారు. 'అందువల్ల శుక్రవారం నుంచి నేను పదవీ విరమణ చెందినట్లు భావించండి' అని కేంద్రాన్ని కోరారు. తన పట్ల శత్రుభావన ప్రదర్శిస్తున్న ఒక వ్యక్తి చేసిన తప్పుడు, నిరాధార ఆరోపణల ఆధారంగా తనను బదిలీ చేశారని వర్మ అంతకుముందు ఒక వార్తా సంస్థతో అన్నారు. అత్యున్నత స్థాయి వ్యక్తుల అవినీతి కేసులను పర్యవేక్షించే సీబీఐ స్వతంత్రతను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. "వెలుపలి ప్రభావాలు లేకుండా అది పనిచేయాలి. సంస్థ నిబద్ధతను కాపాడేందుకు నేను కృషి చేయగా, దాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. నన్ను సెలవుపై పంపుతూ అక్టోబర్ 23న కేంద్రం, సీవీసీ జారీ చేసిన ఉత్తర్వులే దీనికి నిదర్శనం" అని ఆరోపించారు.

వర్మ చేసిన బదిలీలు రద్దు

దిల్లీ: సీబీఐ డైరెక్టర్‌గా పునర్‌నియామకం పొందాక ఆలోక్ వర్మ చేపట్టిన బదిలీలను ఆ దర్యాప్తు సంస్థ తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు రద్దు చేశారు. బదిలీలకు సంబంధించి ఈ నెల 8వ తేదీ నాటి స్థితిని పునరుద్ధరిస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వర్మ.. అంతకు ముందు నాగేశ్వరరావు చేసిన అన్ని బదిలీలను రద్దు చేశారు. మరోవైపు సంస్థలో జాయింట్ డైరెక్టర్ హోదా కలిగిన నలుగురు అధికారులను కూడా ఆయన బదిలీ చేశారు. సీబీఐ అధికార ప్రతినిధిగా నితిన్ వాకాంకర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న అభిషేక్ దయాళ్.. ప్రచురణ విభాగానికి బదిలీ అయ్యారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల తుది జాబితా ప్రకటించాలి

నాంపల్లి, న్యూస్‌టుడే: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైనవారి తుది జాబితాను విడుదల చేయాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న పలువురు అభ్యర్థులు హైదరాబాద్‌లోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. కొందరు కార్యాలయంలోకి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని గేటు వద్దనే అడ్డుకున్నారు.

ఎఫ్ఆర్ఐకు మరిన్ని నిధులు కేటాయించండి

భాజపా నేతల విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని అటవీ పరిశోధన కేంద్రం(ఎఫ్ఆర్ఐ)కు బడ్జెట్‌లో మరిన్ని నిధులు కేటాయించాలని కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌కు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎమ్మెల్యే రాజాసింగ్‌లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం దిల్లీలో కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. కేంద్రానికి కేటాయిస్తున్న నిధులు సరిపోవడం లేదని ఈ బడ్జెట్‌లో వాటిని పెంచాలని కోరారు. హైదరాబాద్‌లో ఏవియేషన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి సురేశ్‌ప్రభుకు లక్ష్మణ్ బృందం వినతి పత్రం అందజేసింది. కేంద్ర పర్యాటక మంత్రి అల్ఫోన్స్‌ను కలిసి రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మీ దరికే రశీదు

పండుగవేళ తీరు మారిన టోల్ వసూలు



పంతంగి టోల్‌గేట్ వద్ద వాహన చోదకుడి వద్దకే వచ్చి టోల్ వసూలుచేస్తున్న ఉద్యోగి

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగ రోజుల్లో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై పలు వాహనాలు బారులుతీరి కనిపిస్తున్నాయి. టోల్‌గేట్ల వద్ద కిలో మీటర్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. టోల్ చెల్లింపులకు ఎక్కువ సమయం పట్టడమే ఈ పరిస్థితికి మూలమని గుర్తించిన గుత్తేదారు సంస్థ 'జీఎమ్మార్' కొత్త పద్ధతి అమలు చేస్తోంది. టోల్ బూత్ వద్దకు వాహన చోదకుడు వెళ్లినప్పుడు కాకుండా... సిబ్బందే నేరుగా వచ్చి వసూలు చేస్తున్నారు. రశీదు పొందిన చోదకులు వెంటనే వెళ్లిపోతుండటంతో, బూత్ వద్ద రశీదు, చిల్లర కోసం వేచిచూడాల్సిన పని తప్పింది. వాహనాల రద్దీ దృష్ట్యా, సంస్థ ఇప్పటికే తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద 16, కొర్లపహాడ్‌లో 12 యంత్రాలను ఏర్పాటుబ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట ప్రాంతం చిల్లకల్లు వద్ద 12 యంత్రాలు అమర్చి చోదకుల దరికే వచ్చి టోల్ వసూలు చేసేందుకు శ్రీకారం చుట్టింది.

యువత బాధ్యత

బాధ్యత తెలియటమన్నది యువతను చాలా మార్చివేస్తుంది. వారిని నెమ్మదింపజేసి.. వారిలోని శక్తిని మృదువుగా ఒక దారిలోకి తెచ్చి.. రేపటి రోజున నిర్వర్తించాల్సిన కర్తవ్యాలకు వాళ్లను సిద్ధం చేస్తుంది!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

12-1-2019 శనివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత ఋతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
షష్ఠి: సా. 5.39 తదుపరి సప్తమి
ఉత్తరాభాద్ర నక్షత్రం: పూర్తి
అమృత ఘడియలు: రా. 2.08 నుంచి 3.52 వరకు
వర్జ్యం: మ. 3.45 నుంచి 5.29 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6.38 నుంచి 8.06 వరకు
రాహుకాలం: ఉ. 9.00 నుంచి 10.30 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-39

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	08.8	28.8
మెదక్	10.9	34.6
రామగుండం	11.6	29.4
హన్మకొండ	14.0	28.0
నిజామాబాద్	14.4	30.2
సూర్యాపేట	16.0	26.0
నల్గొండ	16.0	28.0
కరీంనగర్	16.0	30.0
హైదరాబాద్	16.3	29.4
మహబూబ్‌నగర్	16.7	31.5
తిరుపతి	17.0	30.6
ఖమ్మం	17.0	33.0

అస్థానాపై ఎఫ్ఐఆర్ కొట్టివేతకు నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి ఆరోపణలు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అస్థానాపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఒక కేసులో ఉపశమనం పొందేందుకు అస్థానాకు తాను ముడుపులు చెల్లించానని హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త సతీశ్ సాన చేసిన ఆరోపణల ఆధారంగా దీన్ని నమోదు చేశారు. ఈ కేసులో దేవేందర్ గత అక్టోబర్ 22న అరెస్టయ్యారు. అదే నెల 31న బెయిలుపై విడుదలయ్యారు. నిందితులు అస్థానా, దేవేందర్, మనోజ్ ప్రసాద్‌లకు వ్యతిరేకంగా అనేక పత్రాలు, ఆధారాలు ఉన్నాయని ఆలోక్ వర్మ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మరోవైపు హైకోర్టు తాజా తీర్పును అస్థానా.. సుప్రీం కోర్టులో సవాల్ చేసే అవకాశం ఉంది.

పదిరెట్లు పెరిగిన టమాటా ధర

- మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి అధికంగా రాక
- రవాణా వ్యయం, నిల్వ నష్టంతో పెరుగుతున్న ధర
- వర్షాభావం, చలితో దెబ్బతిన్న స్థానిక పంటలు

ఈనాడు - హైదరాబాద్

కూరగాయల ధరలు మండుతున్నాయి. గత నెలరోజుల వ్యవధిలోనే టమాటా ధర ఏకంగా పదిరెట్లు పెరిగింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్, నాసిక్, కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్, కోలార్ తదితర ప్రాంతాల నుంచి టమాటా, వంకాయలు వంటి సాధారణ కూరగాయలు సైతం వస్తున్నాయి. వాస్తవానికి వీటి టోకు ధరలు ఆయా రాష్ట్రాల్లో తక్కువగా ఉన్నా ఇక్కడికి తేవడానికి రవాణా వ్యయం, తరలింపులో పాడవటం వంటి కారణాలతో ఇక్కడ ధర అమాంతం పెరుగుతోంది. సరిగ్గా నెలక్రితం స్థానిక రైతులు టమాటాలు అధికంగా తెచ్చినప్పుడు ధర లేక నష్టపోయారు. ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి అధిక ధరలకు అమ్ముతుంటే సామాన్యులు నష్టపోతున్నారు.

ఎందుకిలా...

కూరగాయ పంటల సాగు, దిగుబడి తెలంగాణ జిల్లాల్లో బాగా తగ్గడం వల్లే ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నాయని మార్కెటింగ్ శాఖ వర్గాలు తెలిపాయి. తెలంగాణలో గత జూన్ నుంచి ఇప్పటివరకు 18 జిల్లాల్లో వర్షపాతం లోటు 20 నుంచి 49 శాతం దాకా ఉంది. కూరగాయల సాగు ఎక్కువగా బోర్లు, బావుల కింద ఉంటుంది. వీటిలో భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలకు నీరందించడం కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. పంటలు అంతంతమాత్రమే ఉంటే మరోవైపు గత నెలరోజులుగా చలి తీవ్రత బాగా పెరిగింది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు 5 డిగ్రీలలోపు పడిపోతున్నాయి. చలికి కొన్ని పంటల ఎదుగుదల చాలా తక్కువగా ఉంది. మంచు కురుస్తున్నందున కూరగాయలపై మచ్చలు ఏర్పడి దెబ్బతింటున్నాయి. రాష్ట్రంలో దిగుబడి అంతంతమాత్రంగా ఉండటం, అందులోనూ నాణ్యత లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాటికి డిమాండ్ పెరిగింది. హైదరాబాద్‌లోని అన్ని మార్కెట్లకు బోయిన్‌పల్లి టోకు మార్కెట్‌కు రోజూ వచ్చే కూరగాయలే కీలకం. ఉదాహరణకు ఈ మార్కెట్‌కు గతేడాది(2018) జనవరి 11న 2,208 క్వింటాళ్ల టమాటాలు అమ్మకానికి రాగా ఈ ఏడాది సరిగ్గా అదేరోజున శుక్రవారం అంతకన్నా 37.72 శాతం తగ్గి 1,375 క్వింటాళ్లే వచ్చాయి. 'నగరంలో జనాభా, వినియోగానికి తగ్గట్టుగా ఏటా కూరగాయల రాక పెరిగితేనే ధరల నియంత్రణ కష్టం. కానీ గతేడాది వచ్చినవాటికన్నా 37 శాతం తక్కువగా వస్తే ఇక ధరల నియంత్రణ అసాధ్యం' అని మార్కెటింగ్ అధికారి ఒకరు 'ఈనాడు'కు చెప్పారు. నెలక్రితం టమాటా టోకు ధర కిలో రూ. 3కు పడిపోగా ఇప్పుడు పది రెట్లు పెరిగి రూ. 30కి చేరినట్లు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం తెలంగాణకు సరిపడా రావడం లేదని వివరించారు.



హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి మార్కెట్‌కు ఇతర రాష్ట్రాల నుంచి లారీల్లో వచ్చిన కూరగాయలు

బోయిన్‌పల్లి టోకు మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరిగిన తీరు (కిలోకు రూ.లు)

రకం	జనవరి 11, 2018	జనవరి 11, 2019
టమాటా	5	32
వంకాయ	10	20
పచ్చిమిరప	25	26
ఆలుగడ్డ	14	18
బీరకాయ(దేశీ రకం)	20	60
బీరకాయ(సంకరజాతి)	10	30
బెండకాయ	25	40
దొండకాయ	12	20

గమనిక : ఇవన్నీ టోకు ధరలు. వీటికి అదనంగా రూ.5 నుంచి రూ.10 దాకా పెంచి చిల్లర మార్కెట్లలో అమ్ముతున్నారు.

రాయితీలకు మంగళం..

కూరగాయల రైతులకు రాష్ట్రంలో ప్రోత్సాహకాలు లేవు. ఉద్యానశాఖ నుంచి కూరగాయల పంటల విత్తనాలకు రాయితీలు ఇవ్వడం లేదు. గతంలో ఇచ్చిన రాయితీలకు నిధులు రానందున ఇప్పుడు ప్రైవేటు కంపెనీలు రైతులకు రాయితీపై ఇవ్వడం లేదని ఉద్యాన అధికారి ఒకరు చెప్పారు. సాగునీటి కొరత, విత్తనాల ధరలు పెరగడం, దిగుబడి పెరిగినప్పుడు కనీస గిట్టుబాటు ధర రాకపోవడం వల్ల రాష్ట్రంలో కూరగాయల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు ఆయన వివరించారు.

గిన్నిస్ రికార్డు అట్టు!

82 అడుగుల దోశ వేసిన శరవణ భవన్ వంట మాస్టర్లు

ఈనాడు డిజిటల్, చెన్నై: అతి పొడవైన దోశ వేసి రికార్డు సృష్టించారు చెన్నైకు చెందిన హోటల్ శరవణ భవన్ వంట మాస్టర్లు. మద్రాస్ ఐఐటీ ప్రాంగణం దీనికి వేదికైంది. 62 మంది చెఫ్‌లు, ఇతర సిబ్బంది కలిసి శుక్రవారం 105 అడుగుల దోశ వేసేందుకు ప్రయత్నించి రెండుసార్లు విఫలమయ్యారు. మూడోసారి 82 అడుగుల దోశని విజయవంతంగా సిద్ధం చేశారు. హైదరాబాద్‌లో 2014లో వేసిన 54 అడుగుల దోశ గిన్నిస్‌లో చోటు దక్కించుకుందని, ప్రస్తుతం దాన్ని అధిగమించామని నిర్వాహకులు చెప్పారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులకు వివరాలు పంపినట్లు తెలిపారు. దీనిని ఏషియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేశారు.



పరిగిలో 'ధరణి' సేవలు షురూ

- ప్రారంభించిన సీఎస్ జోషి

పరిగి, నవాబుపేట, న్యూస్‌టుడే: భూ సంస్కరణల్లో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం 'ధరణి' వెబ్‌సైట్ సేవలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ప్రభుత్వ సలహాదారు నర్సింగరావు, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ ప్రారంభించారు. సేవలను తహసీల్దార్ కార్యాలయానికి అనుసంధానించారు. అనంతరం వారు నవాబుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి వెబ్‌సైట్ పనితీరు, రెవెన్యూ రికార్డులను వెబ్‌సైట్‌లో అనుసంధానం చేసే విషయమై చర్చించారు. కార్యక్రమంలో సీసీఎల్ఏ ప్రిన్సిపల్ కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, ధరణి రాష్ట్ర డైరెక్టర్ వాకాటి కరుణ, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ చిరంజీవులు, ఏఐజీ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఒమర్ జలీల్, జేసీ అరుణకుమారి పాల్గొన్నారు.

పోలీసు నియామకాలు మరింత జాప్యం

- దేహదారుఢ్య పరీక్షలపై రాని స్పష్టత
- మెరిట్ జాబితా కొత్తగా రూపొందించాలన్న హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: పోలీసు ఉద్యోగాల నియామకాలు జాప్యం కానున్నాయి. కానిస్టేబుల్, ఎస్సై పోస్టులకు నిర్వహించిన ప్రాథమిక పరీక్ష ఫలితాలు వెల్లడించి మూడు నెలలు కావొస్తున్నా తదుపరి నిర్వహించాల్సిన దేహదారుఢ్య పరీక్షలపై ఇంకా స్పష్టత రాలేదు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రకటించిన మెరిట్ జాబితాలో సవరణలు చేసి కొత్తది రూపొందించాల్సి ఉంది. ఇదంతా పూర్తయ్యేలోపు పార్లమెంటు ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. ఈ ఎన్నికలు ముగిసేవరకు తదుపరి ప్రక్రియ పూర్తిచేయడం అసాధ్యంగా మారింది. దీంతో పోలీసు నియామకాల ప్రక్రియ జాప్యమయ్యేలా ఉంది. రాష్ట్రంలో 16,925 కానిస్టేబుల్, 1217 ఎస్సై పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర స్థాయి నియామక మండలి గతేడాది మే 31న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. వీటికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన అధికారులు ఫలితాలూ వెల్లడించారు. వీటిలో అర్హత సాధించిన అభ్యర్థులకు డిసెంబరు 17 నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికనూ సిద్ధం చేశారు. అయితే ప్రాథమిక పరీక్షలో కొన్ని ప్రశ్నలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీన్ని విచారించిన న్యాయస్థానం ఆరు ప్రశ్నలపై స్పష్టత లేదని, వాటిని తొలగించి కొత్తగా మరో మెరిట్ జాబితా తయారు చేయాలని ఆదేశించింది. కొత్త జాబితా తయారీకి కనీసం 20 రోజులైనా పడుతుంది. తర్వాతే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఫిబ్రవరి చివరి వారంలో పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ రావచ్చని భావిస్తున్నారు. పోలీసుశాఖ ఇప్పటికే ఎన్నికల సన్నాహాలు మొదలుపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా దేహదారుఢ్య పరీక్షలు పూర్తిచేయడానికి కనీసం 40రోజులు పడుతుంది. ఇందుకోసం పెద్దసంఖ్యలో పోలీసు సిబ్బంది పనిచేయాల్సి ఉంటుంది. ఎన్నికల తరుణంలో ఇంతమంది సిబ్బందిని దేహదారుఢ్య పరీక్షల కోసం కేటాయించడం సాధ్యంకాదు. న్యాయస్థానం తీర్పు ప్రకారం కొత్త మెరిట్ జాబితా ప్రకటించినా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే పరిస్థితి కనిపించడంలేదు. పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిశాకే చేపట్టే అవకాశముంది. అంటే ఏప్రిల్ నెలాఖరు వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించడం కష్టమే. కారణాలేవైనా పోలీసు నియామకాల్లో తీవ్రజాప్యంపై నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు.

నాలుగు ప్రవేశ పరీక్షలకు కొత్త కన్వీనర్లు

- పీజీ ఈసెట్ కన్వీనర్‌గా కుమార్ నియామకం
- ఎంసెట్ కన్వీనర్‌గా మళ్లీ యాదయ్య

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో వివిధ ప్రవేశ పరీక్షలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి శుక్రవారం కన్వీనర్లను ఖరారు చేసింది. మొత్తం 7 ప్రవేశ పరీక్షలకు కన్వీనర్ల పేర్లను ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ప్రకటించారు. ఎంసెట్, ఈసెట్, పీఈసెట్‌లకు పాతవారినే నియమించారు. మిగిలిన నాలుగు సెట్లకు కొత్తవారిని కన్వీనర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వరుసగా నాలుగోసారి ఎంసెట్‌కు యాదయ్యనే కన్వీనర్‌గా నియమించగా, పీజీ ఈసెట్‌కు కన్వీనర్‌గా ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యులుగా పనిచేస్తున్న కుమార్‌ను నియమించారు. ఎడ్‌సెట్‌కు రెండోసారీ మహిళనే నియమించడం విశేషం.

ప్రవేశ పరీక్ష	కన్వీనర్
ఎంసెట్	ఎన్. యాదయ్య(జేఎన్‌టీయూ హెచ్)
ఈసెట్	ఎ. గోవర్ధన్(జేఎన్‌టీయూ హెచ్)
పీఈసెట్	వి. సత్యనారాయణ(కేయూ)
ఐసెట్	సీహెచ్. రాజేశం(కేయూ)
లాసెట్, పీజీఎల్‌సెట్	జి. బి. రెడ్డి(ఉస్మానియా)
పీజీఈసెట్	ఎం. కుమార్(ఉస్మానియా)
ఎడ్‌సెట్	టి. మృణాళిని(ఉస్మానియా)

భూవిక్రయం కేసులో ఇన్‌స్పెక్టర్‌కు మూడేళ్ల జైలు

- మరో నలుగురికీ శిక్ష, జరిమానా

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యతాయుతమైన ఓ పోలీస్ ఇన్‌స్పెక్టరే ఖాళీ జాగాపై కన్నేశాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తన మిత్రుడి సహకారంతో నకిలీ దస్తావేజులు సృష్టించి రూ. 17 లక్షలకు అమ్మేశాడు. స్థలం కొన్న వ్యక్తి మోసపోయానని గ్రహించి కోర్టును ఆశ్రయించాడు. వాస్తవాలు పరిశీలించిన మల్కాజిగిరి కోర్టు ఆ ఇద్దరితోపాటు మరో ఇద్దరికి మూడేళ్లు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఉంటున్న శక్కర శ్రీనివాస్ సైబరాబాద్ పరిధిలో ఇన్‌స్పెక్టర్. 2009లో నేరేడ్‌మెట్‌లోని కాకతీయనగర్‌లో 300 గజాల స్థలంపై కన్నేశాడు. ఈ స్థలం సికింద్రాబాద్ వారాసిగూడలో ఉంటున్న రామయ్యది. శ్రీనివాస్ ఈ స్థలం తనదని నకిలీ దస్తావేజు సృష్టించి మహబూబ్‌నగర్ జిల్లా కొత్తూరుకు చెందిన బి.జనార్దన్, రెడ్డి చిత్ర అనే మహిళ పేరిట జీపీఏ రిజిస్టర్ చేశాడు. జడ్చర్లలో ఉండే మిత్రుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొంగరి బాలరాజ్‌కు స్థలం విక్రయించే బాధ్యత అప్పగించాడు. ఆ స్థలానికి సమీపంలో ఉంటున్న వ్యాపారి జరుపుల శ్రీను రూ.21 లక్షలకు కొనడానికి ముందుకొచ్చాడు. 2009 జులైలో ముందుగా రూ. 17 లక్షలు ఇచ్చి ఒప్పంద పత్రం రాయించుకున్నాడు. జనార్దన్, రెడ్డిచిత్ర సంతకాలు చేశారు. అసలు లింకు దస్తావేజు రిజిస్ట్రేషన్ సమయంలో ఇస్తామని నమ్మించారు. పది రోజుల తరువాత రిజిస్ట్రేషన్ చేసినా దస్తావేజు ఇవ్వలేదు. మోసపోయినట్లు తెలుసుకున్న శ్రీను డబ్బు తిరిగివ్వమని నిలదీశాడు. డబ్బు ఇవ్వకపోగా బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితుడు నేరేడ్‌మెట్ పోలీసులను ఆశ్రయించగా వారు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మల్కాజిగిరి కోర్టు జనార్దన్, రెడ్డిచిత్ర, బాలరాజ్‌లకు మూడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 8 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చింది.

తెలంగాణలోని రైతుబంధు భేష్

- దిల్లీ ప్రైవేటు పరిశోధన సంస్థ ప్రశంస

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతుబంధు పథకం బాగుందని, దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని దిల్లీ కేంద్రంగా ఉన్న ప్రైవేటు పరిశోధన సంస్థ 'ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్' (ఇక్రి) ప్రశంసించినట్లు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి తెలిపారు. ఈ సంస్థ ప్రతినిధులు శుక్రవారం సచివాలయానికి వచ్చి పథకం అమలు తీరు గురించి ఆయనను అడిగి తెలుసుకున్నారు. దేశమంతా దీనిని అమలు చేయాలని కేంద్రం యోచిస్తున్న నేపథ్యంలో అధ్యయనానికి వచ్చినట్లు వారు తెలిపారు.

ఈనాడు

వాయుగండం గడిచేదెలా?

దేశంలో ఏటా లక్షలాది ప్రాణదీపాల్ని కర్కశంగా ఆర్పేస్తున్న తీవ్ర వాయుకాలుష్యంపై కదనకాహళి మోగిస్తూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ, నగరాలకు ఉద్దేశించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకొచ్చింది. అయిదేళ్లలో 102 భారతీయ నగరాల్లో గాలిలోని అతిసూక్ష్మ ధూళికణాల బెడదను 20-30 శాతం మేర తగ్గించడానికి రూ.300కోట్ల వ్యయంతో జాతీయ వాయు శుద్ధి కార్యక్రమం (ఎన్‌క్యాప్) చేపడతామంటోంది. ప్రాణాంతక కశ్మలంపై పోరు నిమిత్తం కేంద్రానికి, రాష్ట్రాలకు ఇదమిత్థ కార్యసరళిని పర్యావరణశాఖ సూచిస్తోంది. గాలి కలుషితం కాకుండా నివారించడం, పరిస్థితి చేయిదాటకుండా నియంత్రించడం, దేశవ్యాప్తంగా వాయునాణ్యత పర్యవేక్షణ కేంద్రాల్ని జనచేతనం బలోపేతం చేయడమే 'ఎన్‌క్యాప్' ప్రధాన లక్ష్యాలంటున్నారు. వివిధ కేంద్ర మంత్రిత్వశాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు ఇతరుల క్రియాశీల భాగస్వామ్యంతో ఎన్నిరోజుల వ్యవధిలో ఎక్కడెక్కడ ఏమేమి చేయాలో నిర్దేశించుకుని పురోగమిస్తామనడం వినసొంపుగా ఉంది! వాస్తవానికి మూడేళ్లలో వంద నగరాల్లో 35 శాతం మేర కశ్మల నియంత్రణ ప్రతిపాదనలు నిరుడు వెలుగు చూశాయి. తరవాతి అయిదేళ్లలో 50శాతందాకా వాయుకాలుష్యాన్ని కట్టడి చేయదలచినట్లు కేంద్రం అప్పట్లో ప్రకటించింది. గత రెండేళ్లుగా దేశరాజధాని దిల్లీలో విస్తృతచర్యలు చేపట్టి ఎనిమిది శాతం మేర వాయుకాలుష్య తీవ్రతకు పగ్గాలు వేసిన నేపథ్యంలో, బహుశా అంచనాలు మారి ఉండాలి! అయిదేళ్ల తరవాత సమీక్షించి అవసరమైతే వాయుశుద్ధి కార్యక్రమాన్ని పొడిగిస్తామంటున్నారు. వార్షిక సమీక్షలతో ఎప్పటికప్పుడు దిద్దుబాటు చర్యలు చేపట్టడంతోపాటు, ప్రణాళిక పరిధిని చురుగ్గా మరిన్ని నగరాలకు విస్తరించాల్సిన ఆవశ్యకతనూ కేంద్రం విస్మరించజాలదు.

వాయునాణ్యతకు తూట్లు పడటమన్నది కేవలం వందనూటయాభై నగరాలకే పరిమితమైన ఉత్పాతం కాదు. దేశంలోని మూడొంతులకు పైగా నగరాలు, పట్టణాలు గ్యాస్ ఛాంబర్లుగా భ్రష్టుపట్టిన కఠోర యథార్థాన్ని ఎవ్వరూ కప్పిపుచ్చలేరు. భారత వైద్య పరిశోధన మండలి సహా వివిధ సంస్థల ఇటీవలి నిర్ధారణ ప్రకారం- 2017 సంవత్సరంలో దేశవ్యాప్తంగా సంభవించిన ప్రతి ఎనిమిది మరణాల్లో ఒకటి వాయు కాలుష్యం కారణంగా చోటు చేసుకున్నదే. ఒక్క ఏడాదిలో ఏకాయెకి 12 లక్షల 40 వేలమంది పౌరుల పాలిట, పీల్చే గాలే విషపూరితమైన దేశం మనది! నిరుడు ప్రపంచంలోని 15 అత్యంత కలుషిత నగరాల జాబితాను క్రోడీకరించగా, అందులో 14 ఇక్కడివే! అతి సూక్ష్మ ధూళి కణాల తీవ్రత ప్రాతిపదికన దిల్లీతో కాన్పూర్, ఫరీదాబాద్, గయ, వారణాసి వంటివి పోటీపడుతుండగా- వరంగల్, కర్నూలు లాంటి చోట్ల గాలిలో నికెల్, సీసం, ఆర్సెనిక్ శాతాలు ఇంతలింతలవుతున్నాయి. చైనా రాజధాని బీజింగ్‌లో అయిదేళ్ల కాలావధిలో 40 శాతం దాకా మెరుగుదల సాధించగలిగారు. శాంటియాగో (చిలీ) 22 సంవత్సరాల్లో 61 శాతం, మెక్సికో నగరం సుమారు పాతికేళ్లలో 73 శాతం మేర వాయుకశ్మలాన్ని నియంత్రించగలిగాయి. అత్యంత వాయుకాలుష్య భరిత నగరాల జాబితాలో 'బలాధిక్యం', కశ్మలం కాటుకు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న అభాగ్యుల సంఖ్యాపరంగా చైనాను తలదన్నిన 'రికార్డు' కలిగిన భారత్- హుటాహుటిన విస్తృత కార్యాచరణకు ఉద్యుక్తం కావాల్సింది. అందుకనుగుణంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, స్థానిక సంస్థలు అర్థవంతమైన సమన్వయంతో సత్ఫలితాల సాధనకు నిబద్ధం కావాలి. కాలుష్య నియంత్రణ మండళ్లను సాకల్యంగా ప్రక్షాళించి వివిధ అంచెల్లో యంత్రాంగాన్ని ఉరకలెత్తించాలి. ఇది ఉమ్మడిగా పోరాడి, తప్పనిసరిగా నెగ్గి తీరాల్సిన యుద్ధం!

లక్ష్యం బృహత్తరమైనదైనప్పుడు కృషి దీటుగానే ఉండాలి. అగ్రరాజ్యం అమెరికా పుష్కరకాలంలో సాధించగలిగిన ఫలితాలను చైనా నాలుగేళ్లలోనే నమోదు చేసిందని ఆ మధ్య షికాగో విశ్వవిద్యాలయ అధ్యయనం ధ్రువీకరించింది. వాయు కాలుష్య నియంత్రణ నిమిత్తం ఒక్క బీజింగ్ నగరంలోనే ఏడున్నర లక్షల కోట్ల రూపాయలకు పైగా వెచ్చించిన పాలకులు- కశ్మల కారక పరిశ్రమలు, సంస్థల విషయంలో నిష్కర్షగా వ్యవహరించింది. పదేళ్లుగా చైనాలో వాయుకాలుష్య మరణాలు మూడు శాతం తగ్గాయి. అదే, ఇండియాలో దాదాపు 23 శాతం మేర పెరిగాయి! అటువంటిచోట, అయిదేళ్లపాటు 102 నగరాల్లో వెచ్చించడానికి రూ.300 కోట్లు ఏ మూలకు? సమధికంగా నిధుల కేటాయింపుతో కాదు- ఈ ఆరోగ్య అత్యయిక స్థితిలో శీఘ్ర, సమగ్ర, బహుముఖ కార్యాచరణ అత్యావశ్యకతనూ ప్రభుత్వాలు ఉపేక్షించే వీల్లేదు. పర్యావరణ పరిరక్షణకు, పరిసరాల పరిశుభ్రతకు సంస్థాగతంగా అలవరిచి పౌర భాగస్వామ్యానికి పెద్దపీట వేసిన ఆస్ట్రేలియా, బార్సిలోనా, కెనడా తదితర దేశాల వాయు నాణ్యతకు నెలవులై మన్ననలందుకొంటున్నాయి. ఈ ఒరవడికి యోజనాల దూరాన వెనకబడిన భారత్- వాయు నాణ్యత, కర్బన ఉద్గారాల పరిమాణాలను మదింపు వేసి వెలువరించే 180 దేశాల పర్యావరణ పనితీరు సూచీలో 177వ స్థానాన అలమటిస్తోంది. ఇందుకు సరైన విరుగుడు లేదా అంటే, కచ్చితంగా ఉంది. అవినీతి మడుగులో మునకలేస్తూ విద్రోహులకు తెగబడుతున్న కాలుష్య నియంత్రణ మండళ్ల భరతం పట్టేలా సర్కారీ కార్యాచరణతో పాటు పౌర నిఘానేత్రం విచ్చుకోవాలి. పౌరసమాజంలో పర్యావరణ స్పృహ ఇనుమడింపజేసే కార్యక్రమాల నిర్వహణ మొదలు విస్తృత ప్రజారవాణా వ్యవస్థను జనావళికి చేరువ చేసేందుకు ప్రభుత్వాలూ కంకణబద్ధం కావాలి. ప్రాణాలు తోడేసే వాయు గండం ముప్పు ముమ్మరిస్తున్నప్పుడు, ఏకోన్ముఖ పరిణత వ్యూహాలు పదునుతేలితేనే- జాతికి సాంత్వన దక్కుతుంది!

ఆదమరిస్తే... అనేక సమస్యలు

కంటికి రెప్పలా సరిహద్దుల కాపలా



బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతరులకు (హిందువులు, జైనులు, బౌద్ధులు, క్రైస్తవులు, పార్సీలు) పౌరసత్వం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకువస్తున్న పౌరసత్వ సవరణ బిల్లు ఈశాన్య భారతంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్యసభలో నెగ్గాల్సి ఉంది. ఈ బిల్లుతో ఈశాన్య ప్రాంతం, ముఖ్యంగా అసోమ్‌లో ఉద్రిక్తతలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ దేశాలతో భారత్ సరిహద్దుల స్థితిగతులపై సమీక్ష ఇది...

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు సరిహద్దుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాయి. ఎత్తయిన ఇనుప కంచెలు, గోడల నిర్మాణం ద్వారా సరిహద్దులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాయి. పశ్చిమాసియా దేశమైన ఇజ్రాయెల్ ఈ విషయంలో ఇతర దేశాలకన్నా ఎంతో ముందంజలో ఉంది. తన చుట్టూ ఈజిప్టు, లెబనాన్, సిరియా, జోర్డాన్ వంటి శత్రురాజ్యాలున్న ఈ యూదు దేశం అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ చీమ చిటుక్కుమన్నా పసిగట్టే ఎలక్ట్రానిక్ నిఘా పరికరాలను అమర్చి భద్రతను పటిష్ఠపరచింది. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెక్సికో సరిహద్దు వెంట గోడ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ, భారత్ పరిస్థితి భిన్నంగా ఉంది. సరిహద్దుల్లో కంచె నిర్మాణం దశాబ్దాల తరబడి కొనసాగుతున్నా ఇప్పటికీ కొలిక్కి రాకపోవడం ప్రభుత్వాల చిత్తశుద్ధిని సందేహాస్పదం చేస్తోంది. ఫలితంగా బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలతో ఈశాన్య భారతం ముఖ్యంగా అసోం సతమతమవుతోంది. పాకిస్థాన్ నుంచి ఉగ్రవాదుల చొరబాట్లతో జమ్ము-కశ్మీర్‌లో ఉద్రిక్తతలు ఏర్పడుతున్నాయి. చైనా సరిహద్దుల్లో ఏకంగా ఆ దేశ సైన్యమే తరచూ అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిముల్లోకి చొరబడుతూ చికాకులు సృష్టిస్తోంది.

కొలిక్కిరాని కంచె నిర్మాణం

దేశంలోని 17 రాష్ట్రాలు ఇరుగు పొరుగు దేశాలతో సరిహద్దులను కలిగి ఉన్నాయి. ఈశాన్య భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్, అసోమ్, నాగాలాండ్, మిజోరం, మణిపూర్, త్రిపుర, మేఘాలయ; పశ్చిమాన రాజస్థాన్, గుజరాత్; ఉత్తర్ ప్రదేశ్, బిహార్, పశ్చిమ్ బంగ, సిక్కిం, జమ్ము-కశ్మీర్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు వివిధ దేశాలతో సరిహద్దులను పంచుకుంటున్నాయి. భారత్ మొత్తం పదిహేను వేల కిలోమీటర్లకుపైగా భూ సరిహద్దుతో పాటు శ్రీలంక, మాల్దీవులు, ఇండొనేసియా, థాయ్‌లాండ్, పాక్, బంగ్లాదేశ్, మియన్మార్‌లతో సుమారు 7,516 కిలోమీటర్ల తీరప్రాంత సరిహద్దు కలిగి ఉంది. భూ సరిహద్దుల్లో బంగ్లాదేశ్ సరిహద్దు అత్యంత కీలమైనది. 4,096 కిలోమీటర్లు గల ఇది ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద అంతర్జాతీయ సరిహద్దు. ఇందులో దాదాపు 3,326 కిలోమీటర్ల మేరకు కంచె నిర్మాణం జరిగింది. ఈ ఏడాది ఆఖరు కల్లా మిగిలినదాన్ని పూర్తి చేయాలన్నది లక్ష్యం. అసోం, త్రిపుర, మిజోరం, మేఘాలయ, పశ్చిమ్ బంగ రాష్ట్రాలు బంగ్లాతో సరిహద్దు కలిగిఉన్నప్పటికీ, అసోమ్‌తో గల 262 కిలోమీటర్లు, పశ్చిమ్ బంగతో గల 2,217 కిలోమీటర్ల సరిహద్దు కీలకమైనది. దశాబ్దాల తరబడి కొనసాగుతున్న కంచె నిర్మాణం నేటికీ ఓ కొలిక్కి రాకపోవడం ప్రభుత్వాల వైఫల్యాన్ని చాటుతోంది. సరిహద్దుల్లో కొంత ప్రాంతం కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, పిల్ల కాల్వలు, నదులతో నిండి ఉండటం కంచె నిర్మాణానికి అడ్డంకిగా ఉంది. వరదల తాకిడికి కొన్ని పాత కట్టడాలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల భూసేకరణ సమస్యాత్మకంగా ఉంది. సరిహద్దుల్లో 802 బీవోపీ (బోర్డర్ అవుట్ పోస్ట్)లను నెలకొల్పి సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) కాపలా కాస్తోంది. అసోమ్‌లో 40 లక్షల మంది బంగ్లాదేశ్ అక్రమ వలసదారులు ఉన్నట్లు నిరుడు జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ) ద్వారా గుర్తించారు. అసోమ్‌లోని ధూబ్రి, కరీంగంజ్ జిల్లాలు బంగ్లా అక్రమ వలసదారుల కేంద్రాలుగా మారాయి. దేశవ్యాప్తంగా రెండు కోట్లకు పైగా బంగ్లాదేశ్ అక్రమ వలసదారులు ఉన్నట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిరణ్ రిజిజు 2016 నవంబరులో రాజ్యసభకు వెల్లడించారు. అయితే ఈ సంఖ్య ఇంకా ఎక్కువేనని, అనధికారికంగా మూడు కోట్ల మంది వరకు ఉంటారన్న అంచనాలున్నాయి. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల్లో కొంతమంది కేరళ వెళుతున్నారు. అక్కడ కార్మికులకు ఉపాధి అవకాశాలు ఉండటం ఇందుకు కారణం.

బంగ్లాదేశ్‌తో గల పశ్చిమ్ బంగ సరిహద్దులో ఇంకా సుమారు 631 కిలోమీటర్ల ప్రాంతంలో కంచె నిర్మాణం జరగాల్సి ఉంది. ఇందుకు భూసేకరణ ప్రధాన అడ్డంకిగా ఉంది. మమతా బెనర్జీ ప్రభుత్వం భూసేకరణ విషయంలో కేంద్రానికి సహకరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రాష్ట్రంలోని మాల్దా, ముర్షిదాబాద్, ఉత్తర 24 పరగణాల జిల్లాల్లో బంగ్లా వలసదారులదే పైచేయిగా మారింది. బంగ్లా నుంచి వచ్చిన ముస్లిం వలసదారులు కాంగ్రెస్‌కు ఓటుబ్యాంకుగా మారారన్న పేరుంది. వీరి మద్దతుతోనే గతంలో దివంగత కాంగ్రెస్ నేత అబ్దుల్ ఘనీఖాన్ చౌదరి 1980 నుంచి మరణించేంతవరకు (2006) వరకు మాల్దా నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. కొంతకాలం కేంద్రమంత్రిగానూ పనిచేశారు. ఇప్పుడు ఆయన సోదరుడు అబూ హసేమ్‌ఖాన్ చౌదరి కాంగ్రెస్ నుంచి మాల్దా ఎంపీగా ఉన్నారు. బంగ్లాదేశ్ తరవాత భారత్‌లోకి ఎక్కువమంది వలస వచ్చేది నేపాల్ నుంచే. అయితే బతుకుతెరువు కోసం వలస వచ్చే నేపాలీలతో శాంతిభద్రతల సమస్య లేదు. హిమాలయ పర్వత రాజ్యంతో గల 1,751 కిలోమీటర్ల సరిహద్దుల్లో ఎటువంటి కంచె నిర్మాణం లేదు. కేవలం సరిహద్దులను గుర్తించే రాతి స్తంభాలు (పిల్లర్లు) మాత్రమే ఉన్నాయి. సహస్ర సీమాబల్ (ఎస్ఎస్‌బీ) 455 బోర్డర్ అవుట్ పోస్టు (బీవోపీ)ల ద్వారా గస్తీ కాస్తోంది. రెండు దేశాల మధ్య రాకపోకలకు సంబంధించి పాస్‌పోర్టు, వీసా వంటి ఆంక్షలూ లేవు. గుర్తింపు కార్డుల ఆధారంగా నేపాలీలు, భారతీయులు ఇరు దేశాలను సందర్శించవచ్చు. సరిహద్దుల్లో ఆంక్షలు లేకపోవడం అవాంఛనీయ ఘటనలకు ఆస్కారమిస్తోంది. మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా కొనసాగుతోంది. గతంలో నేపాల్ కేంద్రంగా ఉన్న ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేవారు. భద్రత పెంపులో భాగంగా మొదటి దశలో బిహారులోని రక్సౌల్, జొగబని, రెండోదశలో ఉత్తర్ ప్రదేశ్‌లోని సునౌల్, రుపైదిహల్లో ఏకీకృత చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నారు.

డ్రాగన్ బుసలు



చైనాతో సరిహద్దు ప్రత్యేకమైనది. మెక్‌మహన్ రేఖ రెండు దేశాలనూ విడదీస్తోంది. దీన్ని చైనా గుర్తించడం లేదు. జమ్ము-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఉత్తరాఖండ్, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు చైనాతో 3,488 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటున్నాయి. 142 బోర్డర్ అవుట్ పోస్టు (బీవోపీ)ల ద్వారా సైన్యంతో పాటు ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) గస్తీ నిర్వహిస్తున్నాయి. వీటిల్లో అన్నింటి కన్నా అరుణాచల్ సరిహద్దే అత్యంత సమస్యాత్మకమైనది. యావత్తు అరుణాచల్ తనదేనంటూ చైనా మొండిగా వాదిస్తోంది. ప్రజల పరంగా అక్రమ వలసలు లేవు. అయితే చైనా సైన్యమే ఆ పాత్ర పోషిస్తుండటం గమనార్హం. తరచూ చొరబాట్లతో ఉద్రిక్తతలు సృష్టిస్తోంది. డ్రాగన్ సైనికులు సరిహద్దులు దాటి చికాకులు కల్పిస్తున్నారు. డోక్లామ్ ఉదంతం ఇందుకు నిలువెత్తు నిదర్శనం. రెండు దేశాల మధ్య కంచె నిర్మాణం చేపట్టలేదు.

చొరబాట్లతోనే తంటాలు

భారత్-పాకిస్థాన్ సరిహద్దు ప్రపంచంలోనే అత్యంత సున్నితమైనది, సంక్లిష్టమైనది. ఈ ప్రాంతంలో తరచూ ఉద్రిక్తతలు చెలరేగుతుంటాయి. దీనికి ప్రపంచంలోనే ప్రమాదకరమైన సరిహద్దుగా పేరుంది. రెండు దేశాలనూ నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ- లైన్ ఆఫ్ కంట్రోల్) విడదీస్తోంది. ఉభయ దేశాలు 3,323 కిలోమీటర్ల సరిహద్దులు కలిగి ఉన్నాయి. జమ్ము-కశ్మీర్ 1,225 కిలోమీటర్ల సరిహద్దు పంచుకుంటుండగా ఇందులో 740 కిలోమీటర్లలో నియంత్రణ రేఖ విస్తరించి ఉంది. పంజాబ్ 553, రాజస్థాన్ 1,037, గుజరాత్ 508 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటున్నాయి. 2016 డిసెంబరు నాటికి కశ్మీర్ వెంట 186, పంజాబ్ వెంట 462, రాజస్థాన్ వెంట 1,018, గుజరాత్ వెంట 261 కిలోమీటర్ల మేరకు కంచె నిర్మాణం పూర్తయింది. చాలాచోట్ల కొండలు, గుట్టలు, వాగులు, వంకలు ఉండటంతో కంచె నిర్మాణానికి అడ్డంకిగా మారింది. పాక్ నుంచి అక్రమ వలసలు లేకపోయినా, భద్రతాదళాల కన్నుగప్పి ఉగ్రవాదుల చొరబాట్లు జరుగుతున్నాయి. రాజస్థాన్ సరిహద్దులో ఎడారి ప్రాంతమూ ఉంది. పాకిస్థాన్‌తో గుజరాత్ భూ సరిహద్దుతో పాటు తీరప్రాంత సరిహద్దునూ కలిగి ఉంది. తీరప్రాంత సరిహద్దు భద్రత పూర్తిస్థాయిలో పటిష్ఠంగా లేదు. పాక్ నుంచి సముద్రం మీదుగా వచ్చిన ఉగ్రవాదులు 2008లో ముంబయిలో నరమేధం సృష్టించిన సంగతి తెలిసిందే.

అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, మణిపూర్ రాష్ట్రాలు 1,643 కిలోమీటర్ల సరిహద్దును మియన్మార్‌తో పంచుకుంటున్నాయి. అసోం రైఫిల్స్ ఇక్కడ గస్తీ తిరుగుతుంటాయి. మియన్మార్ నుంచి అక్రమ వలసలు లేవు. మణిపూర్ రాష్ట్రంలోని 'మోరె' వద్ద ఇరు దేశాల సరిహద్దులు చీలిపోతాయి. ఈ సరిహద్దు ప్రశాంతమే. భూటాన్‌తో 699 కిలోమీటర్ల సరిహద్దును భారత్ పంచుకుంటోంది. అరుణాచల్ ప్రదేశ్ 217, అసోం 267, పశ్చిమ్ బంగ 183, సిక్కిం 32 కిలోమీటర్ల సరిహద్దును ఈ దేశంతో కలిగి ఉన్నాయి. 132 బోర్డర్ అవుట్ పోస్టుల ద్వారా సహస్ర సీమాబల్ సరిహద్దుల రక్షణ బాధ్యతలను నిర్వహిస్తోంది. శ్రీలంక, మాల్దీవులు, థాయ్‌లాండ్, ఇండొనేసియాలతో గల తీరప్రాంత సరిహద్దు ప్రశాంతమే. శ్రీలంకతో చిన్నపాటి సమస్యలు తప్ప ఇతర దేశాలతో ఇబ్బందులు లేవు. తమిళ జాలర్లు అప్పుడప్పుడు శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించడం, లంక జాలర్లు భారత్ జలాల్లోకి రావడం వంటి చెదురుమదురు ఘటనలు తప్ప ఇతర సమస్యలు లేవు. కంచె లేనందువల్ల కలిగే ఇబ్బందులను ఈశాన్య భారతం, ముఖ్యంగా అసోం ఎదుర్కొంటోంది. ఇతర దేశాలతో ఎలా ఉన్నప్పటికీ బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం సత్వరం పూర్తి చేయాలి. భద్రతను పటిష్ఠపరచాలి. ఈ దిశగా అడుగులు వేయడం కేంద్రం తక్షణ కర్తవ్యం!

- గోపరాజు మల్లపరాజు

ఇక అందరూ నిర్దోషులే!

కొన్ని కథలకు ముగింపు ఉండదు. ఏవో కారణాల వల్ల కథ ముందుకు కదలక నిలిచి పోతుందంతే. బోగస్ స్టాంపు పత్రాల కుంభకోణంలో ప్రధాన పాత్రధారి అబ్దుల్ కరీం తెల్గీ కథకు మృత్యువే ముగింపు పలికినా, పలువురు కీలక నిందితుల కథ మాత్రం కంచికి చేరలేదు. తెల్గీ 30 ఏళ్ల కారాగార శిక్ష అనుభవిస్తూ తీవ్ర అనారోగ్యం వల్ల 2017లో బెంగళూరులో మరణించాడు. అతడి తోడుదొంగలైన కొందరు రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు, పోలీసు సిబ్బంది మాత్రం సరైన సాక్ష్యాలు లేక శిక్షల నుంచి తప్పించుకున్నారు. తాజాగా మహారాష్ట్రలో నాసిక్ సెషన్స్ కోర్టు కూడా సరైన సాక్ష్యాలు లేవంటూ కొందరు భద్రతా సిబ్బందిని దోషవిముక్తుల్ని చేసింది. నాసిక్‌లోని ప్రభుత్వరంగ ఇండియా సెక్యూరిటీ ప్రెస్ (ఐఎస్పీ)లో ముద్రితమయ్యే స్టాంపు పత్రాలను రైల్వే రక్షణ (ఆర్పీఎఫ్) సిబ్బంది పహరాలో రైల్వేస్టేషన్‌కు చేరవేస్తుంటారు. ఆ సమయంలో కొన్ని స్టాంపు పత్రాలను ఆర్పీఎఫ్‌వారు తస్కరించి తెల్గీకి అమ్మినట్లు సీబీఐ అభియోగం. ఈ కేసులో 49మంది సాక్షులను విచారించిన సెషన్స్ కోర్టు, సీబీఐ తగు సాక్ష్యాధారాలను చూపలేకపోయిందంటూ తెల్గీని, ఆర్పీఎఫ్‌వారిని దోషవిముక్తుల్ని చేసింది.

ఆది నుంచీ అంతే...

మొదట్లో ముంబయి పోలీస్ కమిషనర్ ఆర్.ఎస్.శర్మ పేరు తెల్గీ కేసులో ప్రముఖంగా వినిపించేది. ఆ రోజుల్లో ఆయన్ను అతిపెద్ద చేపగా పత్రికలు వర్ణించాయి. శర్మ పదవీ విరమణ చేసిన మరుసటి రోజే స్టాంప్ కేసు దర్యాప్తు బృందం ఆయన్ను అరెస్టు చేయడం పెను సంచలనమైంది. ఇంకేముంది, డొంక అంతా కదిలిపోతుందని విశ్లేషణలు వినిపించాయి. చివరకు ఓ ముంబయి కోర్టు శర్మ మీద సాక్ష్యాధారాలు లేవంటూ 2013లో ఆయన్ను విడిచిపెట్టింది. తెల్గీ నార్కో విశ్లేషణలో, ముంబయి మాజీ పోలీసు అధికారి దిలీప్ నాయక్ పాలీగ్రాఫ్ పరీక్షలో శర్మ పేరు పదేపదే ప్రస్తావనకు రావడంతో ఆయనపై విచారణ నడచినా, ఈ పరీక్షా ఫలితాలను కోర్టు గట్టి సాక్ష్యంగా పరిగణించలేదు. నిఖార్సైన అధికారిగా పేరున్న శర్మ పేరును ఉద్దేశపూర్వకంగా పత్రికలకు పొక్కించి ఆయన ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారని కొందరు భాష్యం చెప్పారు. అసలు నార్కో, పాలీగ్రాఫ్ పరీక్షలు కోర్టులో నిలబడవని పదేపదే నిరూపితమవుతున్నా దర్యాప్తు సంస్థలు, ఏలినవారు ఈ పరీక్షలను తమకు గిట్టనివారిని దెబ్బతీసే ఆయుధంగా ప్రయోగిస్తున్నారన్న విమర్శ ఉంది. రూ.32 వేల కోట్ల విలువైన స్టాంపుల కుంభకోణంలో రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు, పోలీసు అధికారులకు ప్రమేయం ఉందని మొదటి నుంచీ ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, హోం మంత్రిగా పనిచేసిన ఛగన్ భుజ్‌బల్ దర్యాప్తు ప్రక్రియకు గండి కొట్టి తెల్గీని కాపాడాలని చూసినట్లు ప్రతిపక్షాల అభియోగం. 25 ఏళ్లు శివసేనలో ఉండి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లోకి మారిన భుజ్‌బల్‌తో పాటు, ఆ పార్టీ అధినేత శరద్ పవార్‌కూ ముడుపులు ముట్టజెప్పానని తెల్గీ నార్కో పరీక్షలో చెప్పాడు. తరవాత కోర్టుకు ఇచ్చిన సాక్ష్యంలో పవార్, భుజబల్ పేర్లను తెల్గీ ప్రస్తావించనే లేదు. రాష్ట్ర సిట్ నుంచి దర్యాప్తును స్వీకరించిన సీబీఐ తన ఛార్జిషీటులో భాజపా ఎమ్మెల్యే అనిల్ గోటే, మాజీ పోలీస్ కమిషనర్ ఆర్.ఎస్.శర్మల పేర్లను చేర్చింది. దాంతో పవార్, భుజ్‌బల్‌ల మీదా నార్కో పరీక్షలు చేయించాలని గోటే డిమాండ్ చేశారు. తరవాత అక్రమ ధన చలామణీ కేసులో అరెస్టయిన భుజ్‌బల్‌కు నిరుడు బెయిలు లభించగా, గోటే కూడా తెల్గీ కేసులో బెయిలుపై విడుదలయ్యారు. మరికొందరు నిందితులూ కేసుల నుంచి పూర్తిగా విముక్తులయ్యారు. సాక్షాత్తు స్టాంప్ కేసు దర్యాప్తు బృందం సభ్యుడైన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కామత్, తెల్గీ అనుచరుడైన అహ్మద్ తుర్కీలనూ సాక్ష్యాలు లేక 2016లో విడిచిపుచ్చారు. మొత్తం మీద ప్రధాన పాత్రధారి తెల్గీ వెనక ఉన్న సూత్రధారులు ఎప్పటికప్పుడు తప్పించుకుంటూనే ఉన్నారు. 18 రాష్ట్రాలు, 70 నగరాల్లో విస్తరించిన తెల్గీ ముఠా 350 మంది ఏజంట్ల ద్వారా బోగస్ స్టాంపు పత్రాలను విక్రయించింది. ఈ భారీ కుంభకోణం అధికార స్థానాల్లో ఉన్నవారి సహకారం లేకుండా జరిగి ఉండేదా? వారి గుట్టుమట్లన్నీ తెల్గీ మరణంతో భూస్థాపితమైనట్లే!

నకిలీ స్టాంపు పత్రాల కుంభకోణం



తెల్గీ మరణంతో నిజాలు భూస్థాపితం

కర్ణాటకలోని ఖానాపూర్‌లో 1980లలో పళ్లీలు అమ్ముకుని జీవించిన తెల్గీ 1990లలో నకిలీ స్టాంపుల విక్రేత అవతారమెత్తి కోట్లకు పడగలెత్తాడు. మొదట తెల్గీ రద్దయిన స్టాంపు పత్రాలపై గుర్తులను ప్రత్యేక రసాయనంతో చెరిపేసి, కొత్త పత్రాలంటూ తగ్గింపు ధరలకు విక్రయించేవాడు. మహారాష్ట్ర, దక్షిణాది రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఏజంట్లను నియమించి ఇండియన్ ఆయిల్, ఎల్.ఐ.సి. వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు ఈ పత్రాలను విక్రయించాడు. 50 బ్యాంకులు, బహుళజాతి బీమా కంపెనీలు, 60 బడా ప్రైవేటు రంగ సంస్థలు, అంతే సంఖ్యలో బిల్డర్లు నకిలీ స్టాంపు పత్రాలు కొన్నారు. నకిలీల విక్రయానికి తెల్గీ నిరుద్యోగ పట్టభద్రులను నియమించాడు. వారు స్టాంపు పత్రాలు అవసరమయ్యే సంస్థలకు వెళ్లి గుమాస్తాలకు రెండు శాతం కమిషన్‌పై నకిలీలను విక్రయించేవారు. బేరాలు పెరిగిపోవడంతో పాత స్టాంపు పత్రాలను కొత్తవిగా మార్చడంకన్నా తానే నకిలీ పత్రాలను ముద్రించడం మేలని తెల్గీ నిశ్చయించాడు. నాసిక్‌కు చెందిన సింగ్ అనే వ్యక్తి ఐఎస్పీ అధికారులకు తెల్గీని పరిచయం చేశాడు. 1995-96లో ఐఎస్పీ వేలం వేసిన డజను ముద్రణ యంత్రాలను తెల్గీ ముంబయికి తరలించి నకిలీ స్టాంపు పత్రాల వ్యాపారాన్ని విస్తరించాడు. నాసిక్‌లోని ఐఎస్పీ ముద్రణాలయానికి ఇంకు, రసాయనాలు, స్టాంపు కాగితాలను సరఫరా చేసే గుజరాత్ సంస్థ నుంచే తానూ ఆ సామగ్రిని కొనేవాడు. స్టాంపు పత్రాల ప్లేట్లను అధికారుల నుంచి సంపాదించి డెన్మార్క్ నుంచి తెచ్చిన ప్లేట్ తయారీ యంత్రంతో మరిన్ని తయారు చేసేవాడు. వాటితో నకిలీ పత్రాలను ముద్రించి దేశం మీదకు వదిలేవాడు. ఇలా సంపాదించిన డబ్బుతో సినిమాలూ తీశాడు.

లోసుగులే శాపాలు

తెల్గీ 2001లో అరెస్టయ్యాడు. వివిధ రాష్ట్రాల్లో 31 కేసులు దాఖలైనా, వాటిలో ఒక్కదానిలోనూ అతడికి శిక్ష పడలేదు. ప్రజలు, పత్రికల నుంచి వచ్చిన ఒత్తిళ్ల వల్ల మహారాష్ట్ర ప్రభుత్వం తెల్గీ కేసు దర్యాప్తు తీరుపై విచారణకు పోలీసు ఉన్నతాధికారి జైశ్వాల్ నాయకత్వంలో ప్రత్యేక కార్యాచరణ దళాన్ని నియోగించింది. అన్నా హజారే జోక్యం కేసు ముందుకు కదలడానికి దోహదం చేసింది. చివరకు 2006లో తెల్గీ, అతడి సహచరులకు 30 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. 2007లో మరో కేసులో 13 ఏళ్ల జైలుశిక్ష విధించారు. 13 ఏళ్ల జైలు జీవితం తరవాత అనారోగ్యం వల్ల తెల్గీ మరణించాడు. కానీ, అతడి వెనక ఉన్న పెద్ద తలలు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. నకిలీ పత్రాలను తక్కువ రేట్లకు కొని లాభపడిన ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలూ నిక్షేపంగా ఉన్నాయి. వ్యక్తి నుంచి వ్యవస్థల వరకు ధనమే పరమావధిగా నైతిక విలువలకు నీళ్ళు వదలడం ఈ కుంభకోణానికి మూలకారణం. తెర వెనక, తెరపైన వేలకోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడినవారు తమ నేరానికి మూల్యం చెల్లించనప్పుడు న్యాయ వ్యవస్థపై నమ్మకం సడలిపోతుంది. మన క్రిమినల్ న్యాయ వ్యవస్థలోని లొసుగులను ఇక్కడ ప్రస్తావించాలి. ఒక కేసు దర్యాప్తునకు పట్టే కాలమే ఎక్కువనుకుంటే అంతకు ఏడెనిమిది రెట్లు ఎక్కువ సమయం విచారణకు పడుతోంది. ఈ లోపల దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూటర్లు, జడ్జీలూ మారిపోతుంటారు. ఈ వ్యవధిలోనే ధనబలం, కండ బలం, రాజకీయ బలం ఉన్న నేరస్తులు తిమ్మిని బమ్మి చేసి శిక్ష పడకుండా తప్పించుకొంటున్నారు. అందుకే భారత్‌లో అవినీతి కేసుల్లో శిక్ష పడేవారి శాతం నాలుగుకు మించడం లేదు. ఈ దుస్థితిని అధిగమించాలంటే నేర న్యాయ వ్యవస్థను సంస్కరించాలి. జస్టిస్ మలీమత్ కమిటీ, సుప్రీంకోర్టు చెప్పినట్లు పోలీసు సంస్కరణలు తీసుకొచ్చి, నేర దర్యాప్తును ఇతర శాంతి భద్రతల విధుల నుంచి వేరు చేయాలి.

- వరప్రసాద్

ఓ యువతా మేలుకో!

'ఇనుప కండరాలు, వజ్రతుల్యమైన మనోబలంగల యువకులు మనకు కావాలి! మీలో అనంతమైన శక్తి ఉంది. ఇక కావలసింది - 'నేను దేన్నైనా చేయగలను అన్ని పనులూ నిర్వహించగలను' అనే ఆత్మవిశ్వాసం. మిమ్మల్ని మీరే బలహీనులమని భావించడం తగదు! మీలో ఉన్న శక్తి అపారం. 'నేను బలహీనుడిని' అని అనుకోవద్దు. ఎందుకంటే మనం ఎలా అనుకుంటే అలాగే అవుతాం'- స్వాతంత్ర్యం పోగొట్టుకొని, ఆత్మవిశ్వాసం కోల్పోయిన భారతీయ యువతకు దిశానిర్దేశం చేసిన ఆధునిక హైందవ యోగి పుంగవుడు స్వామి వివేకానంద.

తన సందేశం అర్థం చేసుకోవడానికి, ఆయన ప్రతి ఉపన్యాసానికి ఒక కథను జోడించేవారు. అది తమ గురువైన శ్రీరామకృష్ణ పరమహంస నుంచి నేర్చిన విద్య. 'మనం ఎవరిమో, మన ఆదర్శాలేమిటో తెలియని స్థితిలో జీవితాన్ని గడుపుతూ, పాశ్చాత్యులకు దాస్యం చేస్తూ కాలక్షేపం చేస్తున్న భారతీయ యువకులకు ఆనాడు స్వామి ఇచ్చిన సందేశం నేటికీ నిలిచి ఉంది. ఒక ప్రసంగంలో చెప్పిన కథ ఇది.

ఒక అడవిలో సింహంపిల్ల తప్పిపోయింది. తల్లిని వెదుకుతూ ఆ సింహం పిల్ల ఒక గొర్రెలమందలో చేరింది. గొర్రెపిల్లల మందలో అది 'బ్యా బ్యా యా' అని అరుస్తూ ఉంటే... తనకు తెలియకుండానే తానూ 'బ్యా బ్యా యా' అని అరవడం మొదలుపెట్టింది. కొంతకాలానికి దాని తల్లి, పిల్లను వెతుకుతూ అక్కడకు వచ్చి, అది గొర్రె లాగా అరవడం చూసింది. కోపాన్ని అణచుకొని, 'నాయనా! నేను నీ తల్లినిరా! మనం సింహజాతివాళ్ళంరా! ఈ అడవికే రాజులమని తెలుసుకో!' అంటూ గర్జించింది. తల్లి పిలుపు విని పిల్ల సింహం తాను ఎవరో తెలుసుకొని సింహంలా గర్జించింది!

స్వధర్మాన్ని వీడి, పరధర్మాన్ని స్వీకరించడం ఎలాంటిదో ఈ కథ ద్వారా హృదయానికి హత్తుకొనే విధంగా చెప్పారు. కలకత్తాలో 1863 జనవరి 12న జన్మించిన వివేకానంద 1902 జులై నాలుగున, 39 సంవత్సరాల నిండు యవ్వనంలో శ్రీ కైవల్యం చెందారు. కంచు కంఠం, స్ఫురద్రూపం, బహుభాషా సాహిత్యాలు, వేదాంత గ్రంథాలతో పరిచయం, సంగీతంలో మెలకువలు తెలిసికొని మధురంగా పాడే నైపుణ్యం... ఇవన్నీ స్వామి సొంతం.

వివేకానందుడి ప్రసంగాలకు నాటి మేధావులెందరో ముగ్ధులయ్యారు. భారత దేశానికి పునర్వైభవం యువకుల వల్లే సాధ్యమన్నది స్వామి వివేకానంద నిశ్చయం. పరులకు సేవ చేయడం ఈశ్వర సేవే అని ఆయన భావన. మతమంటే సత్యం. సత్యాన్వేషణలో కలిగే ఒక మహానందమే మతం. భౌతిక శాస్త్రంలో ప్రయోగం గురించి ప్రస్తావిస్తారు. గాంధీ మహాత్ముడు సత్యాన్వేషణలో తన ప్రయోగాల గురించి పేర్కొన్నారు. యువత దీన్ని గ్రహించుకొని ప్రవర్తించాలి. పాశ్చాత్యుల విషప్రచారానికి లొంగి, మనదేశ బలహీనత్వానికి కారణం మన మతమే అని భావించడం తప్పు. నిజం ఏమిటంటే, మన వెనకబాటుతనానికి కారణం మన మతాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకొనకుండా, అవగాహన లేకుండా ఆచరించడం!



అంతర్యామి

తన ప్రసంగాల్లో ఉపనిషత్ వాణిని తరచూ ఉటంకించేవారు స్వామి. 'భయం వీడండి!', 'లెండి! మేలుకొనండి. గమ్యం చేరేవరకు విశ్రాంతి లేదు!' అని వివేకానంద యువతకు పిలుపిచ్చారు.

ఒక యువకుడు వివేకానందుల వద్దకు వెళ్ళి 'నేను ధ్యానం చేసేటప్పుడు మనసు నిలకడగా ఉండటంలేదు... ఏదైనా ఉపాయం చెప్పండి' అని ప్రార్థించాడు. 'ధ్యాన సమయంలో ఎక్కడ కూర్చుంటావు?' అని స్వామి ప్రశ్నించారు.

'నా గదిలో తలుపులు, కిటికీలు అన్నీ మూసుకొని, ఏ ఆటంకం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నా!'

'ముందుగా అన్ని తలుపులూ పూర్తిగా తెరువు. కిటికీల అవతల ఇంటిచుట్టూ ఉన్న బీదలు, దీనులను గమనించు. వారి వద్దకు వెళ్ళి చదువు చెప్పు. వైద్యం అందించు. అప్పుడు నీకు ధ్యానం కుదురుతుంది!'

ఈ సమాధానం స్వామి మనసును తేటతెల్లం చేస్తుంది.


- డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు

6 నెలల్లో హైకోర్టు హౌసింగ్ సొసైటీకి ప్లాట్లు

- కార్యకలాపాల పర్యవేక్షణకు న్యాయమూర్తుల కమిటీ
- ఆడిట్ నివేదికలను బహిర్గతం చేయాలి
- నిర్మాణ బాధ్యతలను సొసైటీ తీసుకోరాదు
- తీర్పు వెలువరించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం స్థలం కేటాయించి దశాబ్దం దాటినా.. వివాదాలతో ఉమ్మడి హైకోర్టు ఉద్యోగుల సొసైటీలో ముందుకు సాగని ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలంటూ ఉమ్మడి హైకోర్టు తీర్పు వెలువరించింది. స్థలాల కేటాయింపు, సొసైటీ నిబంధనలు, పాలక వర్గాల ఆధిపత్యాల వ్యవహారాల్లో దాఖలైన పలు పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎస్వీ భట్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పునిచ్చి వివాదాలకు తెర దించింది. సొసైటీ కార్యకలాపాల పర్యవేక్షణకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ చల్లా కోదండరాం, జస్టిస్ పి.కేశవరావులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. గతంలో సొసైటీ ఖాతాల పరిశీలనకు ఏర్పాటు చేసిన న్యాయవాదుల కమిటీ రెండు నెలల్లో నివేదికను న్యాయమూర్తుల కమిటీకి అందజేయాలని ఆదేశించింది. వేదుల శ్రీనివాస్, ఎస్.మమతలతో కూడిన న్యాయవాదుల కమిటీ ఇచ్చే నివేదికలో సొసైటీ నిర్వహణ కమిటీలోని సభ్యులు అవకతవకలకు పాల్పడినట్లు పేర్కొంటే.. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలంది. గత ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్న రికార్డులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నియమించే ప్రత్యేక అధికారికి అప్పగించాలని సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, పరిపాలనాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత లేఅవుట్‌కు సంబంధించి సభ్యులు.. కమిటీ అనుమతితో సమావేశం నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించింది. ప్లాట్ల కేటాయింపు విధానం, వసూలు చేసిన అభివృద్ధి ఛార్జీల వివరాలను కమిటీకి అందజేయాలంటూ ప్రస్తుత పాలకవర్గాన్ని ఆదేశించింది. జడ్జిల కమిటీతో చర్చించి ఓ ఛార్టర్డ్ అకౌంటెంట్‌ను నియమించి, ఆడిట్ నివేదికలను రూపొందించి వాటిని బహిరంగపరచాలంది. లేఅవుట్ అభివృద్ధి, ఇతర పనులకు సంబంధించి పలు ఏజెన్సీల నుంచి అంచనా నివేదికలను తెప్పించి, న్యాయమూర్తుల కమిటీ సిఫార్సు మేరకు పనులు అప్పగించాల్సి ఉందని స్పష్టం చేసింది. సొసైటీ ద్వారా ప్లాట్ కేటాయింపు జరిగాక నిర్మాణ వ్యవహారాలు సభ్యుల ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటాయని, ఆ బాధ్యతలను మాత్రం సొసైటీ చేపట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది. అర్హులైనప్పటికీ కొంత మందికి సభ్యత్వం దక్కలేదంటూ పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో ప్రస్తుతం కేటాయించిన స్థలం పక్కనే అదనపు కేటాయింపుల నిమిత్తం సొసైటీ పాలకవర్గం ప్రభుత్వంతో సంప్రదించుకోవడానికి అనుమతించింది. ప్లాట్ కేటాయింపులతో సహా అన్ని పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నట్లయితే పాలకవర్గాలకు బాధ్యతలు అప్పగించి న్యాయమూర్తుల కమిటీ వైదొలగాలంటూ తీర్పులో పేర్కొంది.

'అన్నదాత'కు ఉపరాష్ట్రపతి అభినందన



ఈనాడు, హైదరాబాద్: రైతాంగానికి ఐదు దశాబ్దాలుగా 'అన్నదాత' వ్యవసాయ మాసపత్రిక ద్వారా సేవలు అందిస్తున్న 'రామోజీ' గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు సంకల్పం చాలా గొప్పదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభినందించారు. దేశంలో వ్యవసాయం మాదిరిగానే వ్యవసాయ సంచికలు నడపటం లాభదాయకం కాకున్నా రామోజీరావు 50 ఏళ్లుగా అన్నదాత ద్వారా రైతులకు, వ్యవసాయ రంగానికి సేవలందిస్తూ వస్తున్నారని ఆయన ప్రశంసించారు. అన్నదాత స్వర్ణోత్సవ సంచికను అన్నదాత కార్యనిర్వాహక సంపాదకుడు అమిర్నేని హరికృష్ణ, సంపాదక బృంద సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లో ఉపరాష్ట్రపతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దాన్ని పరిశీలించి బృందాన్ని అభినందించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులను ప్రోత్సహించేందుకు అవసరమైన సమాచారాన్ని వారికి అందజేయాలని వెంకయ్యనాయుడు సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో గత పదేళ్లలో రైతుల ఆత్మహత్యలపై కేంద్ర వ్యవసాయశాఖ అధ్యయనం చేసి రూపొందించిన నివేదిక ఆధారంగా రైతాంగంలో పంటలపై అవగాహన పెంపొందించాలని కోరారు. సేద్య సంస్కరణలు తీసుకువచ్చి వ్యవసాయరంగ సంక్షోభాన్ని నివారించాలి తప్ప రుణమాఫీ రైతాంగ సమస్యలకు పరిష్కారం కాదని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు.

భాజపాతో కూటమి ఎన్నటికీ ఉండబోదు

- డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్
- మోదీ హయాంలో హక్కులు కోల్పోయామని వ్యాఖ్య
- తమదీ అదే బాటన్న అన్నాడీఎంకే సీనియర్ నేత తంబిదురై

చెన్నై, న్యూస్‌టుడే: కేంద్రంలోని మోదీ సర్కారు పాలనలో తమిళనాడు తన హక్కులు కోల్పోయిందని, అందువల్ల భాజపాతో ఎన్నటికీ ఎన్నికల కూటమి ఏర్పాటు చేయబోమని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ స్పష్టీకరించారు. లోక్‌సభ ఎన్నికల కూటమికి పాత మిత్రులకు సైతం తలుపులు తెరిచే ఉన్నాయంటూ ప్రధాని మోదీ గురువారం ప్రకటించడంతో రాష్ట్రంలో అన్నాడీఎంకే, డీఎంకేల వైఖరి చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో స్టాలిన్ స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. పాత మిత్రులను స్వాగతించడానికి సిద్ధంగా ఉన్నామంటూ మోదీ తమిళనాడులోని భాజపా నాయకులతో మాట్లాడటం విస్మయాన్ని కలిగిస్తోందని అందులో పేర్కొన్నారు. ఈ నాలుగున్నర ఏళ్ల దేశ సమైక్యత బలోపేతానికి మోదీ ఎలాంటి చర్యలూ చేపట్టలేదని విమర్శించారు.

మేమూ దూరమే: తంబిదురై

భాజపాతో కూటమి ఏర్పాటు చేయబోమంటూ అన్నాడీఎంకే సీనియర్ నేత, లోక్‌సభ ఉపసభాపతి తంబిదురై తెలిపారు. దిండుకల్ జిల్లా వేడసందూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమిళనాడు హక్కుల కోసం లోక్‌సభ, రాజ్యసభలో అన్నాడీఎంకే గళం వినిపిస్తూనే ఉందన్నారు. కావేరి నిర్వహణ మండలి ఏర్పాటులో జాప్యంపై పోరాడి దాన్ని సాధించామని గుర్తుచేశారు. రాష్ట్రప్రభుత్వానికి అందించాల్సిన బకాయిలను కూడా కేంద్రంపై పోరాడి పొందినట్లు తెలిపారు.

అడవి దొంగలపై పీడీ పంజా

- త్వరలో 10–15 మందిపై చట్టం ప్రయోగించేందుకు ప్రతిపాదనలు

ఈనాడు, హైదరాబాద్: పచ్చని అడవులకు చిచ్చు పెడుతున్న మానవ మృగాలపై అటవీశాఖ పీడీ పంజా విసరబోతోంది. తొలి దశగా 10-15 మందిపై పీడీ చట్టాన్ని ప్రయోగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అడవి దొంగలపై ఉక్కు పాదం మోపాలని ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో సీఎం కేసీఆర్ ఆదేశించిన విషయం విదితమే. దీంతో జిల్లాల వారీగా నేరస్థుల వివరాలను ఆ శాఖ ఉన్నతాధికారులు తెప్పించుకున్నారు. మొత్తంగా ఇందులో 468 మంది ఉన్నట్లు అటవీశాఖ గుర్తించింది. వీరిలో 351 మంది కలప అక్రమరవాణా, ఇతర అక్రమాలకు పాల్పడిన వారు ఉన్నారు. 80 మంది వన్యప్రాణుల వేటగాళ్లు కాగా, మరో 37 మంది కలప యంత్రాల యజమానులు. జిల్లాల వారీగా చూస్తే.. అత్యధికంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి 44 మంది ఉన్నారు. ఆ తర్వాత భద్రాద్రి-కొత్తగూడెంలో 40, ఆదిలాబాద్‌లో 12, కొమురంభీం ఆసిఫాబాద్ 18, నిర్మల్ 18, మంచిర్యాల 12 మంది చొప్పున ఉన్నారు.

చట్ట సవరణ

అటవీశాఖ ప్రతిపాదనల్ని కలెక్టర్ లేదా నగర పోలీస్ కమిషనర్ అధ్యక్షతన ఉండే జిల్లా కమిటీలు సమీక్షిస్తాయని, తరువాత రాష్ట్ర స్థాయి కమిటీకి కూడా వెళ్లి ఆమోదం లభించాక అటవీ నేరగాళ్లపై పీడీ చట్టం అమలవుతుందని అటవీ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో పేర్కొన్నారు. గుండాగిరీ, భూకబ్జాలు, బందిపోటు దొంగలపై పెట్టే పీడీ చట్టానికి గత ఆగస్టులో సవరణ చేశారు. అటవీ చట్టం కింద నేరం చేసిన వారిని కూడా ఇందులో చేర్చారు.

25 వరకు నౌహీరా షేక్‌కు రిమాండు పొడిగింపు

ఆదేశాలు వెలువరించిన చిత్తూరు జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి



నౌహీరా షేక్

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: గొలుసు కట్టు పథకం(మనీ సర్క్యులేషన్) పేరిట కోట్లాది రూపాయలు స్వాహా చేసిన 'హీరా' గ్రూపు కంపెనీల అధినేత నౌహీరా షేక్‌కు ఈ నెల 25 వరకు రిమాండు పొడిగించారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రబాబు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రిమాండులో ఉన్న నౌహీరా షేక్‌తో పాటు మిగిలిన ఇద్దరు నిందితులనూ తమ కస్టడీకి అప్పగించాలని ఇటీవల సీఐడీ పోలీసులు కోర్టుకు విన్నవించారు. ఈ నేపథ్యంలో మూడ్రోజుల విచారణ నిమిత్తం నౌహీరాతో పాటు ఏ-3 థామస్, ఏ-4బిజూ థామస్‌ను సీఐడీ పోలీసులకు అప్పగించారు. సంబంధిత కస్టడీ గడువు ముగియడంతో వారిని శుక్రవారం సాయంత్రం మళ్లీ న్యాయస్థానంలో హాజరుపరచగా.. ఈ నెల 25 వరకు రిమాండ్ విధిస్తూ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలు వెలువరించారు. మరోవైపు నౌహీరాకు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆమె తరపు న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ నెల 17న విచారించనున్నారు.

పొరపాట్లకు బాధ్యుల్ని ఈసీ శిక్షించాలి

హైదరాబాద్, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితాల పొరపాట్లకు కారకులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎన్నికల సమన్వయ కమిటీ ఛైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కమిటీ కన్వీనర్ నిరంజన్‌తో పాటు శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, జాబితాల తప్పులపై ఎన్నికలకు ముందే పలుసార్లు ఈసీని కలిశామన్నారు. ఓట్ల తొలగింపు, నకిలీ ఓట్లపై ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా స్పందించలేదని ఆరోపించారు. తీరా ఎన్నికలు పూర్తయిన తర్వాత... జాబితాల్లో తప్పులు దొర్లాయని, దాదాపు 22 లక్షలమందికి ఓటుహక్కు కల్పించలేకపోయామని అధికారులే క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. అంతకుముందు గాంధీభవన్‌లో టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశం జరిపారు. పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

కమ్యూనిస్టు యోధుడు శివరామిరెడ్డికి అంతిమ వీడ్కోలు

నివాళులర్పించిన పలువురు ప్రముఖులు



శివరామిరెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే-ఈనాడు, హైదరాబాద్: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, కడప జిల్లా కమలాపురం మాజీ ఎమ్మెల్యే నర్రెడ్డి శివరామిరెడ్డి(97) మృతిపట్ల సీపీఐ నాయకులు తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరిన శివరామిరెడ్డి చికిత్స పొందుతూ మృతిచెందగా శుక్రవారం ఆయన మృతదేహాన్ని ఇక్కడి బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని నివాసానికి తరలించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ప్రజాతంత్ర సంపాదకులు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, సీఆర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ రజని తదితరులు శివరామిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు కమ్యూనిస్టు నేతలు, అభిమానులు తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

వారే దోపిడీ చేయించారు!

కొడనాడు ఎస్టేట్‌పై డాక్యుమెంటరీలో సంచలన ఆరోపణలు

చెన్నై, న్యూస్‌టుడే: దివంగత తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన కొడనాడులోని ఎస్టేట్ బంగ్లాలో.. ఆమె మరణానంతరం జరిగిన దోపిడీ వ్యవహారంపై దిల్లీలో శుక్రవారం ఓ డాక్యుమెంటరీ విడుదలైంది. దీన్ని తెహల్కా మాజీ మేనేజింగ్ ఎడిటర్ మాథ్యూస్ సామ్యూల్ విడుదల చేశారు. జయలలిత ఆస్పత్రిలో ఉండగా అందరినీ తమ కనుసన్నల్లో ఉంచుకోవడానికి ప్రయత్నించిన వ్యక్తులే ఈ దోపిడీ చేయించారని ఆ డాక్యుమెంటరీ తెలిపింది. 'బంగ్లాలో నగదు, ఆస్తిపత్రాలను అపహరించాలని జయలలిత కారు డ్రైవర్ కనకరాజ్ నాతో బేరం మాట్లాడారు. పది మందితో కలిసి దోపిడీకి పాల్పడ్డాం' అని డాక్యుమెంటరీ విడుదల కార్యక్రమంలో పాల్గొన్న శ్యాన్ అనే వ్యక్తి తెలిపారు. అనంతరం శ్యాన్ భార్య సహా ఐదుగురు అనుమానాస్పదంగా మరణించగా.. అవన్నీ హత్యలేనని మాథ్యూస్ ఆరోపించారు.

రైతులకు పరిహారం చెల్లించాలి: తమ్మినేని

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : సాగునీరు లేకపోవడం వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వానాకాలంలో వర్షాభావంతో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు యాసంగిలో 35లక్షల ఎకరాలకు బదులు 14లక్షల ఎకరాల్లోనే పంటలు వేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టుల కింద వేసిన పంటలకు సర్కారు నీరివ్వడం లేదని ఆరోపించారు. నాగార్జునసాగర్‌లో 510 అడుగులు, శ్రీశైలంలో 834 అడుగుల దిగువకు నీటిని వినియోగించరాదని కృష్ణానదీ యాజమాన్య బోర్డు ప్రకటించిందని, అవసరాలను బట్టి గతంలో ఇంతకంటే దిగువన ఉన్న నీటిని వినియోగించారని గుర్తుచేశారు. కొన్ని జిల్లాల్లో పంటలకు ఇవ్వాల్సిన నీటిని మిషన్ భగీరథకు తరలించడం వల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఇకనుంచైనా నీటి లభ్యతను బట్టి ఆయకట్టు విస్తీర్ణాన్ని నిర్ధారించాలని, రైతులు మెట్టపంటలు వేసేలా ప్రోత్సహించాలని సూచించారు.



నల్గొండ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రాష్ట్రీయ బాలస్వాస్థ్య కేంద్రంలో పిల్లలకు ఆహ్లాదం కలిగించేందుకు గోడలపై చిత్రించిన బొమ్మలు

బాలస్వాస్థ్య.. ఆరోగ్య రక్ష

ఈ చిత్రాలు చూస్తుంటే ఇదేదో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అనుకుంటే పొరపాటు పడ్డట్లే. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నల్గొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కేంద్ర ప్రభుత్వం సమకూర్చిన వైద్య సదుపాయాలు ఇవి. రాష్ట్రంలోనే మొదటిసారిగా నల్గొండలో వీటిని ఏర్పాటు చేశారు. ఈ తరహా కేంద్రాలను ఇతర జిల్లాల్లోనూ స్థాపిస్తున్నారు. నల్గొండలో రాష్ట్రీయ బాలస్వాస్థ్య కేంద్రాన్ని సుమారు రూ.1.50 కోట్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పిల్లలకు స్పీచ్ థెరపీ, పంటి, కంటి చికిత్సలు, ఫిజియోథెరపీ, న్యూట్రిషన్, బుద్ధి వికాసానికి సంబంధించిన పరికరాలతో పాటు ప్రత్యేక వైద్యులను నియమించారు. ప్రతి రోజూ ఈ కేంద్రానికి సంబంధించిన ఇద్దరు వైద్యులు, ఒక ఏఎన్ఎంలతో కూడిన ఫార్మసిస్ట్ బృందం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర సమస్యలతో బాధపడే వారిని కేంద్రానికి తీసుకువచ్చి చికిత్స అందిస్తారు. వైద్యం కోసం ఇక్కడకు వచ్చే పిల్లలకు ఆహ్లాదం కలిగించేలా రంగులు, బొమ్మలతో కేంద్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వార్డుల్లో శరీర భాగాల ఆవశ్యకత, వాటిని కాపాడుకునే విధానాలను బొమ్మల రూపంలో చిత్రించారు. పిల్లల కోసం ప్రత్యేక ఆట వస్తువులను అందుబాటులో ఉంచారు.

– ఈనాడు, నల్గొండ



బాలస్వాస్థ్య కేంద్రంలో ఆడుకుంటున్న చిన్నారులు

బాబ్బాబు.. తప్పుకోవూ!

- పోటీదారులకు అభ్యర్థుల వేడుకోలు
- రేపే నామినేషన్ల ఉపసంహరణ
- పరిశీలనలో 4,711 తిరస్కారం

ఈనాడు, హైదరాబాద్: మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో బుజ్జగింపుల పర్వం కొనసాగుతోంది. నామినేషన్ల ఉపసంహరణకు ఆదివారం (13వ తేదీ) ఆఖరి రోజు. దీంతో వీలైనంత వరకు పోటీ తగ్గించుకోవాలని అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. తమ విజయానికి గండికొట్టే వారిని బుజ్జగించేందుకు నానాయాతన పడుతున్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో పలు చోట్ల నగదు రూపేణా నజరానాలు ఇచ్చి పోటీ నుంచి తప్పుకోవాలని పలువురు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ప్రొటోకాల్ నేపథ్యంలో ప్రాధాన్యం ఉన్న పంచాయతీల్లో కొందరు సర్పంచి అభ్యర్థులు పోటీని తగ్గించుకునేందుకు ఎమ్మెల్యేలతో సాటి అభ్యర్థులకు చెప్పిస్తున్నారు. అయితే తరువాత సారి జరగబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే రిజర్వేషన్ కొనసాగనుండడంతో పోటీలో నిలిచేందుకే ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. తొలి విడతలో పంచాయతీ ఎన్నికలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన పూర్తయింది. 4,479 పంచాయతీలకు ఎన్నికల ప్రకటన వెలువడగా 11 పంచాయతీల నామినేషన్లను పూర్తిగా తిరస్కరించారు. రెండు, మూడు నామినేషన్లు దాఖలు చేసిన వారివి, సరిగా పత్రాలు నింపని అభ్యర్థులవి కలిపి 4,711 నామినేషన్లు తిరస్కారానికి గురయ్యాయి. 39,822 వార్డులకు గాను 206 వార్డుల్లో పూర్తిగా నామినేషన్లు తిరస్కరించారు. మిగిలిన వార్డుల్లో 4,189 నామినేషన్లను నిబంధనల ప్రకారం లేవని ఆమోదించలేదు. మరోవైపు రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తొలి రోజు 4,135 పంచాయతీలకు 4,850 నామినేషన్లు, 36,602 వార్డులకు 9,198 నామినేషన్లు దాఖలయ్యాయి.

రూ.1.17 కోట్లు స్వాధీనం

ఎన్నికల సందర్భంగా ఖమ్మం జిల్లాలో రూ.1.17 కోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిర్మల్, కరీంనగర్‌తో పాటు పలు జిల్లాల్లో మద్యం, ఇతరత్రా కలిపి రూ.4.40 లక్షల విలువైన సామగ్రిని పట్టుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14 కేసులు నమోదు చేశారు.

నేడు జిల్లాలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి శనివారం జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం సిద్దిపేటలో, మధ్యాహ్నం సిరిసిల్ల, సాయంత్రం జగిత్యాలలో పర్యటిస్తారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ, శాంతిభద్రతలపై కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహిస్తారు.

ఉపసర్పంచి స్థానానికీ గిరాకీ

- అధికారాలు ఉండటమే కారణం
- వార్డు సభ్యులకూ భారీగా నామినేషన్లు
- పారిశ్రామిక ప్రాంతాల్లో పంచాయతీ చిత్రం

ఈనాడు – హైదరాబాద్

గ్రామ పంచాయతీ ఎన్నికలు కొన్ని జిల్లాల్లో రసవత్తరంగా మారాయి. సర్పంచి స్థానానికి పోటీ చేద్దామని పార్టీల మద్దతు ఆశించి భంగపడిన కొందరు ఉపసర్పంచి స్థానంపై దృష్టి సారించారు. ఉపసర్పంచికి కూడా సర్పంచి స్థాయిలో కొన్ని అధికారాలు ఉండటమే దీనికి ప్రధాన కారణం. మొదటి విడత ఎన్నికల్లో భాగంగా 4,479 పంచాయతీల్లోని 39,822 వార్డులకు 97,690 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఆదాయ వనరులు బాగున్న పంచాయతీల్లో నామినేషన్లు ఎక్కువగా దాఖలవడం విశేషం. పరిశ్రమలున్న ప్రాంతాలు, స్థిరాస్తి వ్యాపారం జోరు మీదున్న పంచాయతీల్లో వార్డు సభ్యుల స్థానాలకు కూడా పెద్దఎత్తున పోటీ నెలకొంది. ఇక్కడ పంచాయతీల ఆదాయం అధికంగా ఉండటంతో పాటు రాజకీయంగానూ పలుకుబడి అక్కరకొస్తుంది. స్థానిక అనుమతులు పంచాయతీలే ఇవ్వాల్సి ఉండటంతో పరిశ్రమల యజమానులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటుంటారు. ఇక్కడ వార్డు సభ్యుడైనా చాలు అనేంత ప్రాధాన్యం ఉంటుంది. దీంతో పాటు పైరవీలు, పై సంపాదన గిట్టుబాటు అవుతుందన్న ఆశతో ఈ ప్రాంతాల్లో వార్డు సభ్యులుగా పోటీకి పలువురు బారులు తీరినట్లు తెలుస్తోంది. పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం, గుమ్మడిదల, పటాన్‌చెరు మండలాల్లోని కొన్ని పంచాయతీలకు వార్డు సభ్యుల స్థానాలకు కూడా పదుల సంఖ్యలో నామినేషన్లు దాఖలవ్వడం విశేషం.

సర్పంచి స్థాయిలో ప్రచారం

సర్పంచిగా గెలవాలంటే అన్ని వార్డుల నుంచి ఎక్కువ ఓట్లు పొందాలి. ఉపసర్పంచిగా ఎన్నికవ్వాలంటే ఎక్కువ మంది వార్డు సభ్యుల మద్దతు అవసరం. అందుకే సర్పంచి అభ్యర్థులు, ఉపసర్పంచి ఆశావహులు అన్ని వార్డుల్లోనూ ప్రచారం చేస్తున్నారు. కొన్నిచోట్ల వార్డు సభ్యుల విజయానికి తాము కూడా ఖర్చు చేస్తున్నారు. శంషాబాద్, షాద్‌నగర్, కొత్తూరు, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, బాలానగర్, జడ్చర్ల, మిడ్జిల్‌తోపాటు మేడ్చల్, కరీంనగర్ జిల్లా మైదాన ప్రాంతాల్లోని పంచాయతీల్లో ఈ తరహా ప్రచారం జోరుగా సాగుతోంది.

చెయ్యెత్తితే ఉపసర్పంచి

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులను నేరుగా ఎన్నుకుంటారు. ఎన్నికలయ్యాక ఎక్కువ మంది వార్డు సభ్యులు ఎవరిని బలపరిస్తే (చెయ్యెత్తితే) వారు ఉపసర్పంచి అవుతారు. వెంచర్లకు అనుమతులు, పరిశ్రమల స్థాపనకు పంచాయతీ ఆమోదం తెలపటం, కీలక నిర్ణయాల్లో సభ్యుల ఆమోదం వంటి విషయాల్లో వార్డు సభ్యులకు ప్రాధాన్యం ఉంటుంది. ఇలాంటప్పుడు మెజారిటీ సభ్యుల మద్దతు ఉండే ఉపసర్పంచి పాత్ర కీలకంగా మారుతుంది. పలు అనుమతులకు సర్పంచి తర్వాత ఉపసర్పంచిని కూడా సంప్రదించాల్సి ఉండటంతో ఈ స్థానానికి ఇప్పుడు ప్రాధాన్యం పెరిగింది. కొన్ని పంచాయతీల్లో ఉపసర్పంచి ఆశావహులు వార్డు సభ్యుల్లో తనవాళ్లు ఎక్కువమంది నెగ్గేలా రాయ'బేరాలు' కూడా చేసుకుంటున్నారు.

వార్డులకు భారీగా నమోదైన నామినేషన్లు

జిల్లా	పంచాయతీలు	వార్డుల సంఖ్య	దాఖలైన నామినేషన్లు
రంగారెడ్డి	179	1,580	4,735
మెదక్	154	1,364	3,007
ఖమ్మం	188	1,736	4,564
కరీంనగర్	97	928	2,980

తెరాసలో పదవుల సందడి

- రాష్ట్ర కమిటీలో ఖాళీల భర్తీపై కేటీఆర్ దృష్టి
- పలువురు కొత్తవారికి అవకాశమిచ్చే యోచన
- సమర్థత, విధేయతలే ప్రామాణికంగా వడపోత

ఈనాడు, హైదరాబాద్: తెరాస రాష్ట్ర కమిటీలో ఖాళీల భర్తీకి పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కసరత్తు ప్రారంభించారు. ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకాలపై ఆయన దృష్టి సారించారు. గత ఏడాది అక్టోబరులో 65 మందితో తెరాస రాష్ట్ర కమిటీ ఏర్పాటైంది. 20 మంది ప్రధాన కార్యదర్శులు, 33 మంది కార్యదర్శులు, 12 మంది సహాయ కార్యదర్శులను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నియమించారు. ఎన్నికల సమయంలో వారిలో 9 మంది రాజీనామా చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న మైనంపల్లి హన్మంతరావు మల్కాజిగిరి నుంచి, కార్యదర్శులు కృష్ణమోహన్‌రెడ్డి గద్వాల నుంచి, నరేందర్‌రెడ్డి కొడంగల్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఎస్సీ విభాగం అధ్యక్షుడు సుంకె రవికుమార్ చొప్పదండి నుంచి, బీసీ విభాగం అధ్యక్షుడు ముఠా గోపాల్ ముషీరాబాద్ నుంచి గెలిచారు. ఎన్నికల అనంతరం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షునిగా కేటీఆర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన కార్యవర్గంపై దృష్టి సారించారు. ఎమ్మెల్యేలుగా ఉన్న వారు ప్రజలతో మమేకం కావడానికి వీలుగా పార్టీ పదవుల నుంచి వైదొలగాలని చెప్పడంతో మైనంపల్లి, కృష్ణమోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గోపాల్, రవికుమార్‌లు రాజీనామాలు చేశారు. మొత్తం 12 ఖాళీలు ఏర్పడ్డాయి. పంచాయతీ ఎన్నికలు, పార్టీ సభ్యత్వ నమోదు, పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఖాళీలన్నీ భర్తీ చేయడంతో పాటు పార్టీ అవసరాల నిమిత్తం పలువురు కొత్తవారిని కూడా తీసుకోవాలని కేటీఆర్ భావిస్తున్నారు.

అన్ని కోణాల్లో ఆలోచించి..

రాష్ట్ర కమిటీలోని వారికి ఇటీవల నియమిత పదవులతో పాటు రాజ్యసభ సభ్యులుగా, ఎమ్మెల్సీలుగా కూడా అవకాశాలు వస్తుండడంతో పార్టీ పదవులపై చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. ఖాళీలను భర్తీ చేస్తామని కేటీఆర్ ప్రకటించిన తరువాత పలువురు నేతలు ఆయనను కలిసి వెళ్లారు. కొందరు ఎమ్మెల్సీలు, ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు, ఇతర నేతలు పార్టీలో బాధ్యతలను ఆశిస్తున్నారు. సమర్థత, విధేయత, కష్టపడి పని చేసే తత్వం, పార్టీ శ్రేణులతో సన్నిహిత సంబంధాల వంటి వాటిని కేటీఆర్ ప్రామాణికంగా తీసుకుంటారని సమాచారం.

స్థానిక సంస్థల బలోపేతానికి చేయూత

తెలంగాణ ఆర్థిక సంఘం

తొలి వార్షికోత్సవంలో ఛైర్మన్ రాజేశంగౌడ్

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనలకు అనుగుణంగా స్థానిక సంస్థల బలోపేతానికి తెలంగాణ ఆర్థిక సంఘం కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ఛైర్మన్ గొడిశాల రాజేశంగౌడ్ తెలిపారు. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల ఆర్థిక పరిపుష్టికి అవసరమైన సిఫార్సులను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. పంచాయతీలకు సీఎం కేసీఆర్ రూ.1,500 కోట్ల నిధిని కేటాయించేందుకు అంగీకరించారని, వాటి ద్వారా గ్రామాలకు మేలు జరుగుతుందన్నారు. ఆర్థిక సంఘం ఏర్పాటై సంవత్సరం పూర్తయిన సందర్భంగా కమిషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కమిషన్ సభ్యుడు చెన్నయ్య, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్ చందా, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. రాజేశంగౌడ్ మాట్లాడుతూ 'ఏడాది కాలంగా అన్ని శాఖలతో సమావేశాలు, స్థానిక సంస్థల ప్రతినిధులతో సదస్సులు నిర్వహించాం. ప్రభుత్వ శాఖల నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన బకాయిలను విడుదల చేయించాం. కర్ణాటక, దిల్లీ, మహారాష్ట్రల్లో పర్యటించి, అక్కడి స్థానిక సంస్థల ఆర్థిక వనరులు, సేవలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించాం. పంచాయతీ ఎన్నికల తర్వాత కొత్త సర్పంచులకు పంచాయతీ నిధులు, విధులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తాం' అని చెప్పారు. అంతకు ముందు రాజేశంగౌడ్, చెన్నయ్యలు సచివాలయంలో ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు.

తప్పుడు ఇంప్లాంట్ల కేసుకు ముగింపు

దిల్లీ: తుంటి సమస్యతో బాధపడుతున్న వారికి తప్పుడు ఇంప్లాంట్లు అమర్చారనే ఆరోపణలపై అమెరికాకు చెందిన ఫార్మా దిగ్గజం జాన్సన్ అండ్ జాన్సన్‌పై చర్యలు తీసుకోవాలని దాఖలైన కేసును సుప్రీంకోర్టు శుక్రవారం మూసివేసింది. బాధితులైన రోగులకు రూ.1.22 కోట్ల వరకు నష్టపరిహారం అందించే విషయంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ తీసుకున్న చర్యలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ ఎస్.కె. కౌల్‌ల ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. 2005 నుంచి జరిగిన తుంటి మార్పిడి శస్త్రచికిత్సల్లో 4,525 మంది భారతీయ రోగుల శరీరాల్లో తప్పుడు ఇంప్లాంట్లను అమర్చారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ అరుణ్‌కుమార్ గోయెంకా అనే వ్యక్తి దాఖలు చేసిన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ నిర్వహించింది.

బీసీల అభ్యున్నతికి కమిషన్ కృషి చేయాలి

- ఛైర్మన్, సభ్యులతో గవర్నర్ నరసింహన్ సూచన
- బీసీ కమిషన్ కార్యకలాపాలను వివరించిన ఛైర్మన్



తెలుగులోకి అనువదించిన మండల్, హవనూర్ కమిషన్ నివేదికల తొలి ప్రతులను శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌కు అందజేస్తున్న తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు. పక్కన కార్యదర్శి అనితా రాజేంద్ర, బీసీ కమిషన్ సభ్యులు డా.ఆంజనేయగౌడ్, డా.వకుళాభరణం కృష్ణ మోహనరావు, జూలూరు గౌరీశంకర్, ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతికి బీసీ కమిషన్ కృషి చేయాలని గవర్నర్ నరసింహన్ సూచించారు. బీసీలను చైతన్యపరచడంతో పాటు వారికి అన్ని రకాలుగా మేలు చేయడం ద్వారా కమిషన్ ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. రిజర్వేషన్లపై మండల్, హవనూర్, అనంతరామన్ కమిషన్‌లు ఆంగ్లంలో రూపొందించిన నివేదికలను తెలంగాణ బీసీ కమిషన్ తెలుగులోకి అనువదించి, ఆ ప్రతులను శుక్రవారం రాజభవన్‌లో గవర్నర్‌కు అందజేసింది. బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్‌రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్, కార్యదర్శి అనితా రాజేంద్ర, ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఛైర్మన్ రాములు మాట్లాడుతూ దేశంలోని బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లకు మండల్, అనంతరామన్, హవనూర్ కమిషన్‌ల నివేదికలే మూలాధారంగా నిలిచాయన్నారు. రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలో తెలుగులో నివేదికలు తేవడం సందర్భోచితమని భావించామని, దీనిపై సమగ్ర అధ్యయనం చేసి రూపొందించామన్నారు. గత ఏడాదిగా దేశంలోని ఆయా రాష్ట్రాలకు చెందిన బీసీ కమిషన్‌ల నివేదికలను క్షుణ్నంగా అధ్యయనం చేశామన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ రాజ్యాంగంలోని అధికరణలు, విశ్లేషణలపై తెలుగులో రూపొందించిన బీసీ నోట్‌బుక్‌ను ఆంగ్లంలోకి అనువదించామని చెప్పారు. ఈ సందర్భంగా రాములు, బృంద సభ్యులను గవర్నర్ అభినందించారు. రాష్ట్రంలో బీసీల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం

- జాబితా సిద్ధం చేస్తున్న కేసీఆర్
- కేటీఆర్‌తో కలిసి కసరత్తు
- తెరాస ఎమ్మెల్యేల్లో తీవ్ర ఉత్కంఠ
- సభాపతి ఎంపికపైనా సీఎం దృష్టి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ దీనికి అవసరమైన తుది జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ నెల 18న విస్తరణకు అవకాశం ఉన్నందున ఒకటి, రెండురోజుల్లో దీనిపై సీఎం స్పష్టత ఇస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. విస్తరణపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆశావహులంతా ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు కోసం ఎదురు చూస్తున్నారు. సంక్రాంతి అనంతరం విస్తరణ జరుగుతుందన్న సంకేతాలు ఇప్పటికే వెలువడ్డాయి. 18వ తేదీ మంచి ముహూర్తాలు ఉండటంతో పాటు శాసనసభ సమావేశాలను పురస్కరించుకొని విస్తరణకు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిసింది. ఎనిమిది మంది సభ్యులు ఉంటారనే ప్రాథమికంగా భావిస్తున్నా.. ఆరుగురితోనూ మరో జాబితా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సీఎం కేసీఆర్‌తో పాటు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సైతం ఈ కసరత్తులో పాల్గొన్నట్లు తెలిసింది. ఇతరత్రా కారణాలు ఏమైనా ఉంటే తప్ప 18నే విస్తరణ ఉంటుందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో నెలకొంది. మాజీ మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, కొంత మంది ఎమ్మెల్సీలు అమాత్య పదవులపై సీఎం పిలుపు కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే సభాపతి అభ్యర్థి ఎంపికపై సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేలతో చర్చించారు. మంత్రిపదవుల ప్రస్తావన రాలేదు. మరో వారం రోజుల గడువు ఉన్నందున ఒకటి, రెండు రోజుల్లో ఎమ్మెల్యేలతోనూ సీఎం మాట్లాడతారని భావిస్తున్నారు.

మరికొందరి చేరికపై ప్రస్తావన

ముఖ్యమంత్రి కేసీఆర్‌తో శుక్రవారం చేవెళ్ల, నాగర్‌కర్నూలు, వరంగల్ తూర్పు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మర్రి జనార్దన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్‌లు కలిశారు. శంకర్‌పల్లి పురపాలికలో వార్డులను పెంచాలని, ఎంఎంటీఎస్ రైలును లింగంపల్లి నుంచి వికారాబాద్ వరకు పొడిగించాలని కోరారు. ఈ సందర్భంగా మరో పార్టీ నుంచి ఎమ్మెల్యేల చేరిక విషయం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే తమ నియోజకవర్గంలోని చేనేత కార్మికులను ఆదుకోవాలంటూ సీఎంను అభ్యర్థించారు.

సభాపతి ఎంపికపై 15న నిర్ణయం

సభాపతి ఎంపికపై సీఎం కేసీఆర్ ఈనెల 15న నిర్ణయం తీసుకోనున్నారు. ఈ జాబితాలో మాజీ మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఇంద్రకరణ్‌రెడ్డి, రెడ్యానాయక్‌లతో పాటు మాజీ ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి పేర్లు ఉన్నాయి. వీరిలో కొందరితో సీఎం మాట్లాడారు. మిగిలిన వారితో 2 రోజుల్లో మాట్లాడి ఖరారు చేసే వీలుంది.

ముగ్గురు ఎమ్మెల్సీలపై మండలి ఛైర్మన్ విచారణ

ఈనాడు, హైదరాబాద్: తెరాస నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ముగ్గురు శాసనమండలి సభ్యులను అనర్హులుగా ప్రకటించాలన్న ఫిర్యాదుపై శుక్రవారం మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ విచారణ చేపట్టారు. తొలిరోజు భూపతిరెడ్డి, రాములు నాయక్‌ల తరఫున వాదనలు విన్నారు. శనివారం యాదవరెడ్డిపై విచారణ జరపనున్నారు. శాసనమండలిలో తెరాస తరఫున నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి గెలిచిన భూపతిరెడ్డి, ఎమ్మెల్యేల కోటాలో ఎన్నికైన యాదవరెడ్డి, గవర్నర్ నామినేట్ చేసిన రాములు నాయక్‌లు... ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఫిరాయింపుల నిరోధక చట్టంకింద వీరిపై అనర్హత వేటువేయాలని తెరాస గత నెలలోనే స్వామిగౌడ్‌కు ఫిర్యాదుచేసింది. అప్పట్లోనే వారికి సంజాయిషీ నోటీసు ఇచ్చారు. అనర్హత వేటు ఎందుకు వేయరాదో వారంలోగా వివరణ ఇవ్వాలన్నారు. ముగ్గురు ఎమ్మెల్సీలూ వివరణ ఇచ్చారు. వీటిని పరిశీలించిన మండలి ఛైర్మన్ విచారణ కోసం నోటీసులిచ్చారు. భూపతిరెడ్డి, రాములు తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఇందులో శాసనమండలి కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారు. మరో ఎమ్మెల్సీ యాదవరెడ్డిపైనా విచారణ పూర్తయ్యాక ఛైర్మన్ తీర్పును ప్రకటిస్తారు.

సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి రూ.638 కోట్లు విడుదల

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సరిహద్దు ప్రాంత అభివృద్ధి కార్యక్రమం (బీఏడీపీ) కింద సుమారు రూ.638 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. సరిహద్దుల వెంబడి మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజల ఇబ్బందుల్ని తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. అంతర్జాతీయ సరిహద్దులకు 50 కి.మీ. పరిధిలో నివసిస్తున్న ప్రజల ప్రత్యేక అభివృద్ధి కోసం 2018-19లో ఇప్పటిదాకా కేంద్ర హోంశాఖ రూ.637.98 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు. గత ఏడాది రూ.1,100 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. బీఏడీపీ కింద 17 రాష్ట్రాల్లో 111 సరిహద్దు జిల్లాలున్నాయి.

'రఫేల్' గుట్టు రట్టవుతుందనే
ఆలోక్ బదిలీ: సీపీఐ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) డైరెక్టర్‌గా ఆలోక్‌వర్మ కొనసాగితే తమ రఫేల్ కుంభకోణం బయటపడుతుందన్నదే భాజపా ప్రభుత్వ ఆందోళన... అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఆలోక్‌ను వేరే శాఖకు బదిలీ చేయడం కక్షసాధింపు చర్య అని, కేంద్రం అటువంటి నిర్బంధాలకు పాల్పడటాన్ని తట్టుకోలేకనే సీబీఐ పదవికి రాజీనామా చేశారని శుక్రవారం నాటి ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని స్థాయిలోనే చట్టనిబంధనల ధిక్కరణ సాగిపోతుంటే ప్రజాస్వామ్యం ఇక ఎలా మనుగడ సాగిస్తుందని నారాయణ ప్రశ్నించారు. రాజ్యాంగసూత్రమైన లౌకికవాదాన్ని అపహాస్యం చేసేలా కేంద్రం వ్యవహరిస్తోందని, అందుకే పౌరసత్వ సవరణ పేరిట పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టిందని ఆరోపించారు. భాజపా సంకుచిత వైఖరి కారణంగానే అసోం ఆందోళనలతో అట్టుడుకుతోందని, బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయంగా 'అప్పిలేట్ ట్రైబ్యునల్' ఉంది

- సింగిల్ జడ్జి ఉత్తర్వులు సరైనవే
- రైల్వే అధికారుల అప్పీల్‌ను కొట్టేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: రైలు ప్రమాదాల్లో క్షతగాత్రులు, మృతుల పరిహారాలు చెల్లింపు విషయంలో సికింద్రాబాద్ రైల్వే ట్రైబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వుల్లో హైకోర్టు సింగిల్ జడ్జి జోక్యం చేసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ దక్షిణమధ్య రైల్వే అధికారులు దాఖలు చేసిన అప్పీల్‌ను హైకోర్టు కొట్టేసింది. సింగిల్ జడ్జి నిర్ణయం సరైనదేనని స్పష్టం చేసింది. రైల్వే ట్రైబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే ప్రత్యామ్నాయ మార్గంగా 'రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్ యాక్ట్' ప్రకారం ఏర్పాటు చేసిన రైల్వే 'అప్పిలేట్ ట్రైబ్యునల్'ను ఆశ్రయించాలని సూచించింది. ఉమ్మడి హైకోర్టు విభజనకు ముందు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎస్వీ భట్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. పరిహార చెల్లింపు వ్యవహారంలో సికింద్రాబాద్ రైల్వే ట్రైబ్యునల్ బెంచ్ 2017 మార్చిలో ఉత్తర్వులు జారీ చేస్తూ 463 కేసుల్ని పరిష్కరించింది. ట్రైబ్యునల్ ఉత్తర్వులను సవాలు చేస్తూ దక్షిణమధ్య రైల్వే అధికారులు హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యం దాఖలు చేశారు. ట్రైబ్యునల్ ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు సింగిల్ జడ్జి నిరాకరించారు. దీంతో సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ రైల్వే అధికారులు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో తప్పులేదని తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ట్రైబ్యునల్ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాలని సూచించింది.

రయ్.. రయ్

- వేగంగా సాగుతున్న ఎన్‌హెచ్-365 పనులు
- ఆధునిక యంత్రంతో పటిష్ఠంగా కాంక్రీట్
- 8 గంటల్లో 500 మీటర్ల మేర నిర్మాణం



సూర్యాపేట జిల్లాలో మూసీ నదిపై నిర్మిస్తున్న వంతెన

ముఖ్యాంశాలు

జాతీయ రహదారి సంఖ్య	: 365
పరిధి	: తానంచెర్ల-నకిరేకల్ (66.5 కి.మీ)
బైపాస్‌లు	: 8, రీఅలైన్‌మెంట్లు: 8
టోల్‌ప్లాజా	: ఒకటి (సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం కొత్తగూడెం వద్ద)
మేజరు వంతెనలు	: రెండు (సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం వద్ద మూసీ నదిపై వంతెన: 910 మీటర్లు. తానంచెర్ల వద్ద వంతెన: 65 మీటర్లు)
ప్రాజెక్టు విలువ	: రూ.605 కోట్లు
గడువు	: 24 నెలలు (31 అక్టోబరు 2019 వరకు పూర్తి చేయాలి)
ప్రస్తుతం పనుల పరిస్థితి	: 50 శాతం పూర్తి

ఈనాడు డిజిటల్ - సూర్యాపేట

మన ప్రయాణం వేగంగా, సాఫీగా సాగాలంటే అందుకు మెరుగైన రహదారులు అవసరం. రూ.వేల కోట్లు వెచ్చించి నిర్మించే సంప్రదాయ బీటీ రహదారులకు నాణ్యత ప్రమాణాలు పాటించినా జీవితకాలం కన్నా ముందే పాడవుతుంటాయి. మళ్లీ వాటి మరమ్మతులకు రూ.కోట్లు వెచ్చించాల్సిందే. దీన్ని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం కాంక్రీట్‌తో జాతీయ రహదారులను నిర్మిస్తోంది. తెలంగాణలో జాతీయ రహదారి-365ని సీసీ రహదారిగా నిర్మిస్తోంది. ఏడాది కిందట ప్రారంభమైన పనులు శరవేగంగా సాగుతున్నాయి. అన్నీ సక్రమంగా సాగితే మరో ఏడాదిలోనే సిమెంటు రహదారులపై భారీ వాహనాలు పరుగులు తీస్తాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



సాయంత్రం వేళలో రహదారి నిర్మిస్తున్న పీక్యూసీ స్లిప్ ఫ్మార్ ఫేవర్ యంత్రం

అధునాతన యంత్రాల వినియోగం

ఎక్కువ కాలం మన్నేలా.. నూతన విధానంలో నిర్మిస్తున్న రహదారి కావడంతో ఎన్‌హెచ్ రహదారి నిర్మాణం జరుగుతోంది. గతేడాది జనవరిలో ప్రారంభమైన పనులు ప్రస్తుతం కీలక దశకు చేరుకున్నాయి. నాలుగు వరుసలుగా నిర్మించే రోడ్డులో కింది రెండు పొరల్లో మొరం, 40 ఎం.ఎం. కంకరతో నిర్మిస్తారు. వీటి పనులు దాదాపు 50 కి.మీ.ల మేర పూర్తయ్యాయి. మరో రెండు వరుసలు కాంక్రీట్‌తో నిర్మిస్తారు. ఇందులో ఆరంగుళాల మందంతో డీఎల్‌సీ(డ్రైలీన్ కాంక్రీట్) మొదటి లేయరు నిర్మితమవుతుంది. దీని నిర్మాణం 15 కి.మీల మేర పూర్తయింది. చివర్లో పైన వేసే లేయరును పీక్యూసీ (పేవ్‌మెంట్ క్వాలిటీ కాంక్రీట్)గా వ్యవహరిస్తారు. దీన్ని 12 అంగుళాల మందంతో నిర్మిస్తున్నారు. ఇందుకు గుత్తేదారు సంస్థ జర్మనీ నుంచి రూ.10.5 కోట్ల విలువైన యంత్రాన్ని దిగుమతి చేసుకుంది. దీన్ని 'పీక్యూసీ స్లిప్ ఫ్మార్ ఫేవర్'గా పిలుస్తారు. దీని సాయంతో చివరి లేయరు నిర్మాణ పనులను గురువారం నుంచి ప్రారంభించారు.

సాయంత్రం వేళల్లోనే పనులు

హైవే నిర్మాణంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పగటి వాతావరణం 25 డిగ్రీలకు మించి ఉంటే రహదారి బీటలు వారే ప్రమాదముంటుంది. దీన్ని నివారించేందుకు సాయంత్రం 5 గంటల తర్వాత పని ప్రారంభించి ఉదయం 6 గంటలకు ముగిస్తున్నారు. ఈ యంత్రం ద్వారా 8 గంటల్లో 500 మీటర్లు మాత్రమే రహదారి నిర్మించగలరు. ఒకేసారి 9.5 మీటర్ల వెడల్పుతో రోడ్డును నిర్మించడం దీని ప్రత్యేకత. నిర్మాణమే కాకుండా లెవలింగ్, వైబ్రేషన్లు, రహదారిని నున్నితంగా మార్చేందుకు ఫ్లోటర్ పరికరాలుంటాయి. కాంక్రీట్ కొద్దిమేర గట్టిపడ్డాక టీఎంసీ (టెక్చరింగ్ క్యూరింగ్ కాంపౌండ్ మిషన్) సాయంతో క్యూరింగ్ చేయడమే కాకుండా.. నున్నితాన్ని కొంత మేర తగ్గిస్తారు. ప్రస్తుతం ఈ తరహా యంత్రంతో రెండు వరుసల భువనగిరి-వరంగల్ జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. దానితో పోలిస్తే ఇక్కడి యంత్రం మరింత అధునాతమైనదని అధికారులు చెబుతున్నారు.



రోడ్డుపై పరుస్తున్న పాలిథిన్ కవర్ (ఇది రోడ్డులోని రెండు పొరల మధ్యలో ఉంటుంది)

చీలికల నివారణ

వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల రహదారులు సంకోచ, వ్యాకోచాలకు గురవుతుంటాయి. ఈ సందర్భాల్లో రోడ్డులో చీలికలు ఏర్పడే ప్రమాదముంటుంది. దీన్ని నివారించేందుకు రహదారిలో డొవల్‌బార్‌ను అమర్చుతున్నారు. 18 అంగుళాలుండే ప్రత్యేక రాడ్‌ను 4.5 మీటర్లకు 20 చొప్పున అమరుస్తారు. రాడ్ చివరలో ఉండే ప్లాస్టిక్ క్యాప్ వాతావరణంలో జరిగే మార్పులకు అనుగుణంగా మార్పు చెందుతుంది. ఫలితంగా రహదారిపై పగుళ్ల నూరు శాతం తగ్గుతాయని ఈఈ ఏవీ.రావు 'ఈనాడు'కు తెలిపారు. ప్రభుత్వం విధించిన గడువులోగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు.

రాబర్ట్‌వాద్రా సన్నిహితుడికి ఊరట

దిల్లీ: సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్‌వాద్రాకు సన్నిహితుడైన మనోజ్ అరోరాకు దిల్లీ ప్రత్యేక కోర్టులో శుక్రవారం అరెస్టు నుంచి ఊరట లభించింది. శనివారం మధ్యాహ్నం 3గంటల్లోపు ఈడీ ఎదుట హాజరు కావాలని జడ్జి ఆదేశించారు. వాద్రాకు చెందిన స్కైలైట్ హాస్పిటాలిటీ ఎల్‌ఎల్‌పీలో అరోరా ఉద్యోగి. లండన్‌లో 1.9మిలియన్ పౌండ్ల విలువ చేసే ఆస్తిని సంజయ్‌భండారీ అనే మధ్యవర్తి వాద్రా కోసం కొనుగోలు చేశారని ఇది అరోరాకు తెలుసునని ఈడీ ఆరోపిస్తోంది. విచారణకు హాజరు కావాలని నోటీసులిచ్చినా స్పందించలేదు. అరోరా దేశం విడిచి పారిపోయిఉంటారని అనుమానించిన ఈడీ.. అతనిపై బెయిల్‌కు వీలు లేని అరెస్టు వారెంట్ జారీ చేయాలని జనవరి 5న ప్రత్యేక కోర్టుకు విన్నవించింది.

సేవలోనే సంతృప్తి.. పనిలోనే విశ్రాంతి

ఈనాడు, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో నివాసముంటున్న నస్కటి నాగభూషణం విద్యుత్తు శాఖలో జేఏఓగా పనిచేసి 2014లో ఉద్యోగ విరమణ చేశారు. ఇద్దరు కుమారులు ఉద్యోగులుగా స్థిరపడ్డారు. భార్య గృహిణి. ఉద్యోగ విరమణ అనంతరం నాగభూషణం తనకు చేతనయినంత మేర ఇతరులకు సేవ చేయాలని తపించి 2015లో మహబూబ్‌నగర్ సీనియర్ సిటిజన్ ఫోరంలో సభ్యత్వం తీసుకొని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చే గ్రామీణులు, నిరక్షరాస్యులకు ఉచితంగా వినతిపత్రాలు రాస్తూ, వారికి సలహాలు సూచనలు ఇస్తుంటారు. జిల్లా కోర్టులో పారా లీగల్ వాలంటీర్‌గా సేవలందిస్తున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన, ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటించారు. ప్రస్తుతం నాలుగు నెలలుగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రోగులకు సహాయం చేస్తూ.. వారి సేవలో తరిస్తున్నారు. సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో సేకరించిన దుస్తులను ప్రభుత్వాసుపత్రిలోని ఒక బీరువాలో భద్రంగా ఉంచి, అవసరం ఉన్న పేదలకు పంపిణీ చేసే బాధ్యతను తానే తీసుకున్నారు. సేవ చేయడంలో ఉన్న ఆనందం తనకు వేరే ఏ పనిలోనూ లేదని నాగభూషణం 'ఈనాడు'తో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

నడవలేని స్థితిలో ఆసుపత్రికి వచ్చిన మహిళను చక్రాల కుర్చీలో వైద్యుడి వద్దకు తీసుకెళ్తున్న నాగభూషణం



ఇన్ఫోసిస్ మరోమారు వాటాదార్లకు బొనాంజా ఆఫర్‌ను ప్రకటించింది. మెగా బైబ్యాక్, ప్రత్యేక డివిడెండుతో ముందుకొచ్చింది. రూ.8,260 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేసేందుకు (బైబ్యాక్) శుక్రవారం కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదముద్ర వేసింది. రూ.4 ప్రత్యేక డివిడెండుకు కూడా బోర్డు సిఫారసు చేసింది. అయితే అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి కంపెనీ మిశ్రమ ఫలితాలను ప్రకటించింది. లాభం అంచనాలకు దూరంగా నిలవగా.. ఆదాయం అంచనాలకు మించి నమోదయ్యింది. అయితే 2018-19 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయ అంచనాలను ఇన్ఫీ పెంచడం మరో చెప్పుకోదగిన విషయం. స్థిర కరెన్సీ రూపేణా ఈ ఆర్థిక సంవత్సర ఆదాయంలో 8.5- 9% వృద్ధి ఉండొచ్చని పేర్కొంది. అంతకుముందు 6-8% వృద్ధిని ఇన్ఫీ అంచనా వేసింది. కొత్త సీఈఓ సలీల్ పరేఖ్ కంపెనీని తిరిగి గాడిలో పెట్టేందుకు చేపడుతున్న చర్యలు క్లయింట్లలో తిరిగి విశ్వాసాన్ని నింపుతుండటం, డిజిటల్ లాంటి కీలక విభాగాల ఆకర్షణీయ పనితీరును దృష్టిలో ఉంచుకొని ఆదాయ వృద్ధి అంచనాలను కంపెనీ పెంచినట్లుగా కనిపిస్తోంది.

ఇన్ఫీ మరో బొనాంజా

- రూ.8,260 కోట్ల షేర్ల బైబ్యాక్‌కు బోర్డు పచ్చజెండా
- రూ.4 ప్రత్యేక డివిడెండుకూ సిఫారసు
- అక్టోబరు- డిసెంబరు లాభంలో 30% క్షీణత
- 20% పెరిగిన ఆదాయం
- 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఆదాయ అంచనాలు పెంపు



క్లయింట్లలో విశ్వాసాన్ని తిరిగి నింపేందుకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. క్లయింట్ల సంఖ్య పెరగడంతో మూడో త్రైమాసికంలో వార్షిక ప్రాతిపదికన 10.1 శాతం వృద్ధిని నమోదు చేశాం. డిజిటల్ వ్యాపార విభాగానికి ఇది మరో గొప్ప త్రైమాసికం. ఈ విభాగ ఆదాయం 33.1 శాతం పెరిగింది. 157 కోట్ల డాలర్ల విలువైన పెద్ద ఆర్డర్లు రావడంతో మరింత ఉత్సాహంగా ముందుకు అడుగులు వేయబోతున్నాం

– సలీల్ పరేఖ్, సీఈఓ, ఇన్ఫోసిస్

ఆదాయం

అక్టోబరు-డిసెంబరులో ఆదాయం 20.3% వృద్ధి చెంది రూ.17,794 కోట్ల నుంచి రూ.21,400 కోట్లకు చేరింది. త్రైమాసిక ప్రాతిపదికన ఆదాయం 3.8% పెరిగింది. గతేడాది జులై- సెప్టెంబరులో కంపెనీకి రూ.20,609 కోట్ల ఆదాయం వచ్చింది. జులై- సెప్టెంబరుతో పోలిస్తే డాలరు రూపేణా కూడా కంపెనీ ఆదాయం 2.2% పెరిగింది. ఆ సమయంలో 292.1 కోట్ల డాలర్ల ఆదాయాన్ని నమోదు చేయగా.. ఇప్పుడు 298.70కోట్ల డాలర్లకు పెరిగింది. డిజిటల్ విభాగ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 33.1% పెరిగి 94.2 కోట్ల డాలర్లుగా నమోదైంది.

బైబ్యాక్

రూ.13000 కోట్ల మూలధన కేటాయింపు విధానంలో భాగంగా షేర్ల బైబ్యాక్, ప్రత్యేక డివిడెండు ఇచ్చేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. తాజా బైబ్యాక్ ప్రతిపాదనలో భాగంగా 10,32,50,000 ఈక్విటీ షేర్లను కంపెనీ కొనుగోలు చేయనుంది. ఒక్కో షేరుకు రూ.800 ధర మించకుండా వీటిని బైబ్యాక్ చేయనుంది. ఇందులో రూ.8,260 కోట్ల (118 కోట్ల డాలర్లు) వరకు వెచ్చించనుంది. రూ.5 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.4 (80%) ప్రత్యేక డివిడెండును చెల్లించేందుకు బోర్డు సిఫారసు చేసింది.

అనుబంధ సంస్థలపై

పనయాతో పాటు మరో రెండు అనుబంధ సంస్థలు స్కావా, కల్లిడస్‌ల విక్రయ యోచనను ప్రస్తుతానికి ఇన్ఫీ విరమించుకుంది. ఆశించిన ధరకు కొనుగోలుదార్లు ముందుకు రాకపోవడమే ఇందుకు కారణం. కొనుగోలుదార్ల నుంచి తమకు అందిన ప్రతిపాదనలు, చర్చల పురోగతి ఆధారంగా 2019 మార్చి 31 కల్లా వీటి అమ్మకం పూర్తవ్వకపోవచ్చనే అభిప్రాయానికి వచ్చామని కంపెనీ తెలిపింది. విక్రయించాల్సిన ఆస్తుల జాబితాలో నుంచి వీటిని తొలగించినట్లు పేర్కొంది. స్కావా, పనయాల వ్యాపారాలపై తిరిగి దృష్టి పెట్టే యోచనలో ఇన్ఫోసిస్ ఉంది. అక్టోబరు- డిసెంబరులో కొత్తగా 7,762 మంది ఉద్యోగులను ఇన్ఫీ నియమించుకుంది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2.25 లక్షలకు చేరింది.

లాభం

సమీక్ష త్రైమాసికానికి ఇన్ఫోసిస్ రూ.3,610 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2017లో ఇదే కాలంలో నమోదైన రూ.5,129 కోట్లతో పోలిస్తే లాభం 30 శాతం తగ్గింది. గతేడాది జులై- సెప్టెంబరులో ఆర్జించిన రూ.4,110 కోట్లను పరిగణనలోకి తీసుకుంటే ఈసారి లాభంలో 12.2 శాతం క్షీణత ఉంది.

క్లయింట్లు

సమీక్ష త్రైమాసికంలో కొత్తగా 101 క్లయింట్లను కంపెనీ జతచేసుకుంది. ఇందులో ఒకదాని ఆర్డరు విలువ 5 కోట్ల డాలర్లకు పైగా ఉండగా.. తొమ్మిదింటి ఆర్డర్ల విలువ 2 కోట్లకు పైనే. కోటి డాలర్లకు మించి విలువున్న విభాగంలో 18 క్లయింట్లు జతయ్యాయి

మరో విడత

కిరణ్ మజుందార్‌షాను లీడ్ స్వతంత్ర డైరెక్టర్లుగా మరో విడత నియమించేందుకు ఇన్ఫోసిస్ డైరెక్టర్ల బోర్డు అంగీకారం తెలిపింది. 2019 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 22 వరకు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు.

రూ.40కే ఇంటికి ఆహారం

- కేంద్రీకృత వంటగదుల నుంచి సరఫరా చేస్తాం
- ఫ్యూచర్‌పే కార్యకలాపాల విస్తరణలో భాగం
- ఫ్యూచర్ గ్రూప్ సీఈఓ కిశోర్ బియానీ

శంభుకలాన్ (పంజాబ్): ఇప్పటివరకు నిత్యావసరాలు, అతి సులభంగా వండుకుని తినే వీలున్న పదార్థాలు విక్రయిస్తూ వచ్చిన బిగ్‌బజార్ (ఫ్యూచర్‌గ్రూప్).. ఇకపై అన్నం, కూరలూ (ఆహార పదార్థాలు) విక్రయించనుంది. ఆహార వ్యాపారాన్ని స్థిరీకరించడంలో భాగంగా 'ఆహార పదార్థాల' విక్రయంలోకి ప్రవేశిస్తున్నట్లు ఫ్యూచర్‌గ్రూప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) కిశోర్ బియానీ తెలిపారు. కేంద్రీకృత వంటశాలల నుంచి వీటిని కొనుగోలుదార్లకు అందుబాటు ధరల్లో సరఫరా చేస్తామన్నారు. తమ డిజిటల్ వాలెట్ ఫ్యూచర్‌పే కార్యకలాపాల విస్తరణలో భాగంగా, అందుబాటు ధరలో ఆహార పదార్థాలను ఇళ్ల వద్దకే పంపిస్తామని వివరించారు. 'తినడానికి సిద్ధంగా ఉండే ఆహారాన్ని వినియోగదారుల ఇళ్లకు రూ.40కే సరఫరా చేయాలన్నది మా యత్నం. ఇందుకోసం కేంద్రీకృత వంటశాలలు (క్లౌడ్‌కిచెన్) ఉపయోగించుకుంటాం. ఈ ప్రాజెక్టును సాకారం చేయడంపై దృష్టి సారించాం' అని ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైన బియానీ విలేకరులతో చెప్పారు. 'ప్రతి నగరంలో ఉండే వంటశాలల్లో తయారైన తాజా ఆహార పదార్థాలను, నేరుగా ఇళ్లకు సరఫరా చేయాలన్నది ప్రణాళిక. స్థానిక అవసరాలకు అనుగుణమైన ఆహారాన్నే సిద్ధం చేస్తాం'అని బియానీ వెల్లడించారు.

వంటశాలలు మాత్రమే.. అక్కడ తినే వీలుండదు

'ఆయా నగరాల్లో నెలకొల్పే వంటశాలల్లో ఆహార పదార్థాలను వండి, ప్యాక్ చేసి, ఇళ్లకు పంపుతారు. అయితే ఈ వంటగదుల వద్ద భుజించేందుకు వీలుండద'ని తెలిపారు. కేంద్రీకృత వంటశాలలు అతి త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పిన బియానీ, ఎన్ని నెలకొల్పుతున్నారు, ఇళ్లకు చేరవేసేందుకు ఏ నెట్‌వర్క్‌ను వినియోగించుకుంటారనే విషయాలు తెలిపేందుకు నిరాకరించారు. 'బియ్యంతో తయారు చేసే భోజనాన్ని సిద్ధం చేస్తాం. ఇదే సమయంలో రూ.10కి 2 సమోసాలు కూడా పొందొచ్చు' అని తెలిపారు. ఆహార పదార్థాలను ఇళ్లకే చేరవేసేందుకు, ఫ్యూచర్‌పే యాప్‌ను వినియోగించుకుని, తథాస్తు డిజిటల్ ప్రాజెక్ట్ కింద చేపట్టాలన్నది గ్రూప్ ప్రణాళికగా కిశోర్ బియానీ వెల్లడించారు. 'ఈ ప్రాజెక్టుపై పెద్దఎత్తున ఆశావహంగా ఉన్నాం. అందుబాటు ధర కనుక, తక్కువ మార్జిన్ ఉన్నా, వినియోగదారులకు సంతృప్తికరంగా అందించేందుకు, తమ సంస్థ నెట్‌వర్క్‌ను సమర్థంగా వాడుకుంటాం' అని తెలిపారు.

మా గ్రూప్‌లోనే బియ్యపు మిల్లులు, పిండి మిల్లులున్నాయి. సొంత కంపెనీలు, సరఫరా వ్యవస్థలు, సొంత బ్రాండ్ ఉత్పత్తులున్నాయి. వీటన్నింటినీ వాడుకుంటాం. ఒకవేళ ఎవరైనా మార్జిన్‌తో సరఫరా చేస్తే, అవీ తీసుకుంటాం' అని కిశోర్ బియానీ పేర్కొన్నారు. ఫ్యూచర్ గ్రూప్ వ్యాపారంలో 50 శాతం, ఆహార విభాగం నుంచే లభిస్తోందని, ఆధార్, ఈజీడే, ఫ్యూచర్‌స్టోర్లను విస్తరించడం వల్ల, రాబోయే అయిదేళ్లలో ఈ విభాగ ఆదాయం 60 శాతానికి చేర్చాలన్నది ప్రణాళికగా తెలిపారు.



ఇవీ ప్రణాళికలు

- ఇందుకోసం 50,000 కంటే తక్కువ జనాభా ఉండే ప్రాంతాలకు ఆధార్ స్టోర్లు, ఇంతకంటే ఎక్కువ ఉండే ప్రాంతాల్లో ఈజీడే, 2 లక్షలు, అంతకుమించిన జనాభా ఉన్న ప్రాంతాల్లో బిగ్‌బజార్ విక్రయశాలలు నెలకొల్పనుంది.
- ఇండియా ఫుడ్‌గ్రిడ్ ఏర్పాటు చేసేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం 38 పెద్ద గోదాములను నిర్మిస్తోంది. వీటిల్లో 5 వినియోగంలోకి రాగా, 2-3 ఏళ్లలో అన్నీ సిద్ధమవుతాయి.

సుప్రీం మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో

ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఆస్తుల విక్రయం!

దిల్లీ: ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఆస్తుల బదిలీ, విక్రయాలను పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టులో పదవీ విరమణ చేసిన న్యాయమూర్తిని నియమించాలని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) సూచించింది. రూ.90,000 కోట్ల రుణ సంక్షోభంలో చిక్కుకున్న ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌ను గట్టెక్కించేందుకు. . సంస్థల ఆస్తులు విక్రయించాలని, నూతన యాజమాన్యం నిర్ణయించిన సంగతి విదితమే. 'కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ తరహాలోనే ఐఎల్ అండ్ ఎఫ్ఎస్, దాని అనుబంధ సంస్థల ఆస్తులకూ ఒక విధానాన్ని అనుసరించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ఎంత మేర చెల్లించాల్సి ఉంది, పరిష్కార ప్రక్రియకు అవకాశం ఉందా.. వంటివి పరిశీలించేందుకు రుణదాతల కమిటీని ఏర్పాటు చేయాలి. వీటి పర్యవేక్షణకు పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు జడ్జిని నియమించాలని కేంద్రప్రభుత్వానికి సూచిస్తున్నాం' అని న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జె.ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల ఎన్‌సీఎల్‌టీ బెంచ్ సూచించింది.

బిగ్ సి సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు, ప్రతి మొబైల్‌కు బహుమతి ఇస్తున్నట్లు మొబైల్ గొలుసుకట్టు విక్రయశాలల సంస్థ బిగ్‌సి ప్రకటించింది. ఎందస్తుగా ఏమీ చెల్లించనవసరం లేకుండా, వడ్డీ లేని సులభ వాయిదాల్లో కొనుగోలుకు ప్రాసెసింగ్ రుసుము కూడా లేదని వెల్లడించింది. బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేస్తే 10 శాతం వరకు నగదు వెనక్కి, ప్రతి స్మార్ట్‌ఫోన్‌పై రూ.2200 వరకు జియో క్యాష్‌బ్యాక్, 30 జీబీ డేటా ఉచితమని, ఎంపిక చేసిన మోడళ్లపై స్క్రీన్‌ను ఒకసారి మార్చి ఇచ్చే వీలుందని పేర్కొంది. బ్యాంకుకార్డులపై కొంటే శామ్‌సంగ్ గెలాక్సీ జే6, జే6+, ఏ7పై 10 శాతం నగదు వెనక్కి, బజాజ్‌ఫైనాన్స్, టీవీఎస్ క్రెడిట్ ద్వారా వాయిదాల్లో కొనుగోళ్లు, ఒపో ఎఫ్9ప్రోపై రైస్‌కుక్కర్, వివో ఫోన్లపై బహుమతులు, రూ.1590 విలువైన కార్బన్ కే9బూమ్ మ్యాక్స్‌పై పెడస్టల్ ఫ్యాన్ ఉచితమని తెలిపింది.

ఎన్ఎస్ఈ ఛైర్మన్ అశోక్ చావ్లా రాజీనామా

ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో ప్రాసిక్యూషన్‌కు సీబీఐకి అనుమతి లభించడం వల్లే

దిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఛైర్మన్ పదవికి అశోక్ చావ్లా రాజీనామా చేశారు. తక్షణమే ఇది అమల్లోకి వచ్చిందని శుక్రవారం రాత్రి ఎక్స్ఛేంజీ వెల్లడించింది. మాజీ బ్యూరోక్రాట్ అయిన చావ్లాను ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో విచారించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. 'ఇటీవలి చట్టపర ఘటనల నేపథ్యంలో ఎన్ఎస్ఈ డైరెక్టర్, బోర్డ్ ఛైర్మన్ పదవికి అశోక్ చావ్లా రాజీనామా చేశారు. వెంటనే ఇది అమల్లోకి వచ్చింది' అని మాత్రమే ఎన్ఎస్ఈ ప్రకటించింది. ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అయిన చావ్లా 2016 మార్చి 28న ఎన్ఎస్ఈ ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు పౌరవిమానయాన కార్యదర్శి, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఛైర్‌పర్సన్ బాధ్యతలూ నిర్వర్తించారు. 2018 నవంబరులో యెస్ బ్యాంక్ ఛైర్మన్ పదవి నుంచి వైదొలగారు.

అమెజాన్ అడుగులు ఎటువైపు?

ప్రపంచంలోనే అత్యంత కుబేరుడు, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ తన భార్యతో విడాకులు తీసుకుంటున్నారు. విడిపోవడం అన్నది అమెరికా కుటుంబ వ్యవస్థలో పెద్ద విషయం కాదు కానీ.. ఇక్కడి వ్యక్తి ప్రపంచ కుబేరుడు కావడమే అసలు విషయం. ఈ పరిణామం నేపథ్యంలో వేల ఉద్యోగుల కుటుంబాలతో పాటు మదుపర్ల భవితవ్యంతో ముడి పడి ఉన్న ఈ పరిణామం అమెజాన్‌ను ఎటు వైపునకు అడుగులు వేయిస్తుందన్నది తేలాల్సి ఉంది.

బెజోస్ దంపతుల పరిణయం ఈ మధ్య జరిగిందేమీ కాదు. వాల్‌స్ట్రీట్‌లో హెడ్జ్ ఫండ్ మేనేజరుగా బెజోస్ పనిచేస్తున్న సమయంలో అంటే 1992లో ఈ జంట కలిసింది. అప్పటికి అమెజాన్‌ను ఏర్పాటు చేయలేదు. ఒక ఏడాది కంటే తక్కువ సమయంలోనే మనసులు కలిశాయి. 1993 సెప్టెంబరులో ఫ్లోరిడాలో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాతి ఏడాదే సియాటెల్‌లోని ఒక గ్యారేజీలో బెజోస్ తన అంకుర సంస్థ అమెజాన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అమెజాన్ ఇంతలింతలు అయ్యేంత వరకు బెజోస్ భార్య మెకంజీ వెన్నంటే ఉంది. కానీ బుధవారం అంటే దాదాపు పాతికేళ్ల తర్వాత తాము విడిపోతున్నట్లుగా ప్రకటించారు.

మరి ఇపుడు ఏమవుతుంది

బెజోస్‌కు ఇపుడు 54 ఏళ్లు. భార్య, నవలా రచయిత్రి అయిన మెకంజీకి 48 ఏళ్లు. వీరికి ముగ్గురు కుమారులు. ఒక దత్త కుమార్తె ఉన్నారు. ఈ విషయాలను పక్కనపెడితే ఫ్లోరిడాలో వీరి పెళ్లి జరిగినా.. చివర్లో(విడాకులు తీసుకోవాలనుకున్నప్పటికి) ఎక్కడ ఉన్నారన్న దాన్ని బట్టి విడాకుల ప్రక్రియ ఉంటుందని ఏఎఫ్‌పీ అంటోంది. వీరికి అమెజాన్ ప్రధాన కార్యాలయం ఉన్న సియాటెల్‌తో పాటు వాషింగ్టన్ డీసీ, టెక్సాస్, బెవర్లీ హిల్స్, కాలిఫోర్నియాల్లోనూ నివాసాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంతం పెద్ద విషయం కాదని అట్లాంటాలోని కుటుంబ చట్ట సంస్థ అయిన కెస్లర్ ప్రతినిధి అంటున్నారు. విషయం ఏమిటంటే అక్కడి చట్టాల ప్రకారం.. ముందస్తు ఒప్పందం లేకపోతే భాగస్వామికి తన ఆస్తిలో సగం ఇవ్వాల్సి ఉంటుంది.

ఎంత ఆస్తి వెళుతుంది

ప్రస్తుతం బెజోస్‌కున్న ఆస్తుల్లో ఎక్కువ భాగం అమెజాన్ షేర్ల రూపంలో ఉన్నవే. గురువారం నాటి లెక్కల ప్రకారం.. బెజోస్‌కు అమెజాన్‌లో ఉన్న 18 శాతం(7.9 కోట్ల షేర్లు) వాటా 130 బిలియన్ డాలర్లు(దాదాపు రూ.9.1 లక్షల కోట్లు). విడాకుల సెటిల్‌మెంటు జరగాలంటే ఈ షేర్లలోనూ సగం వాటా ఆమెకు వెళ్లే అవకాశం ఉంది. అంటే ఆమెకు అమెజాన్‌లో 8 శాతం(రూ.4.5 లక్షల కోట్లకు పైగా) వాటా దక్కుతుంది. ఇక ఓటింగ్ హక్కుల విషయం పెద్దగా ప్రస్తావనలోకి రాదు. ప్రస్తుతం జెఫ్ బెజోస్ ఒక మైనారిటీ వాటాదారు కావడం ఇందుకు నేపథ్యం.

కంపెనీలో వారి పరిస్థితి ఏమిటి?

బెజోస్ భార్యకు సగం షేర్లు వెళితే ఆమె కూడా ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరుగా మారతారు. ఒక వేళ విడాకుల ఒప్పందంలో భాగంగా వారు తమ షేర్లను ఒక ట్రస్టు లేదా ఏదైనా చట్టబద్ధ వ్యవస్థలోకి బదిలీ చేసి.. అమెజాన్ వాటాదార్లలో తమ అధికారాన్ని అట్టే పెట్టి ఉంచుకునే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో కంపెనీని రక్షించుకోవాలంటే.. కంపెనీ కార్యకలాపాలకు ఇబ్బంది రాకుండా షేర్ల ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. అయితే అందుకు వేచి చూడాల్సి ఉంది. ఇక అత్యధిక వ్యక్తిగత వాటా వీరిద్దరిదే కానుంది. ఒక వేళ 8%, 8 శాతంగా విడిపోయినా వీరిదే పైచేయి. ఎందుకంటే రెండో అత్యధిక వ్యక్తిగత వాటా 6 శాతమే. ఇది వాన్‌గార్డ్ చేతిలో ఉంది.

కంపెనీ పరిస్థితి ఏమిటి?

ఒక వేళ విడాకుల ఒప్పందంలోనూ వారి అభిప్రాయాలు పొసగకపోతే అన్నదే అసలు ప్రశ్న. అపుడు కంపెనీపై నీలినీడలు కమ్ముకుంటాయి. ఒక వేళ మెకంజీ తన వాటాను ఇతరులకు విక్రయిస్తుందా? లేదంటే తన వద్దే ఉంచుకుంటుందా అన్నది ఇపుడే చెప్పలేం. ఒక వేళ ఇతర పోటీ సంస్థలు ఇదే అదనుగా భావించి ఆమె వద్ద వాటాను కొనుగోలు చేస్తే సమీకరణాలు పూర్తిగా మారిపోవచ్చు. ఇప్పటికే తక్కువ వాటా ఉన్న కారణంగా భవిష్యత్‌లో బెజోస్ చేతి నుంచి కంపెనీ జారినా జారిపోవచ్చు. బెజోస్ తర్వాత అధిక వాటా ఉన్న వాన్‌గార్డ్ కూడా పావులు కదిపినా ఆశ్చర్యం లేదు. అపుడు కంపెనీలో ఆధిపత్యంపై పోరు తప్పదు. అదే జరిగితే వేలకొద్దీ కుటుంబాలు, మదుపర్ల పరిస్థితిని ఊహించలేం. ఈ పరిణామాల మధ్య అమెజాన్ భవితవ్యం ఎటు వెళుతుందన్న అపుడే చెప్పలేమని అమెరికా మార్కెట్ నిపుణులు అంటున్నారు.

వాషింగ్టన్ స్టేట్ లా ఏ చెబుతోంది

బెజోస్ దంపతులకు పలు చోట్ల నివాసాలున్నప్పటికీ.. వాళ్లిద్దరూ వాషింగ్టన్‌లోనే విడాకులకు దరఖాస్తు చేస్తారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాషింగ్టన్ రాష్ట్ర చట్టాల ప్రకారం.. పెళ్లి అనంతరం సమకూర్చుకున్న ఆస్తులన్నీ ఇద్దరూ కలిసి సంపాదించినవనే భావిస్తారు. అంటే ఒక వేళ విడాకులు తీసుకుంట.. పెళ్లి తర్వాత సంపాదించిన ఆస్తులన్నిటినీ పంచుతారన్నమాట. అయితే కాలిఫోర్నియా వంటి రాష్ట్రాల్లో మాదిరిగా ఇక్కడ సగం, సగం ఏమీ పంచరు. అయితే బెజోస్ కేసు విషయానికొస్తే.. వీరి పెళ్లి అయి చాలా కాలం అయింది. వీరిద్దరి పెళ్లి తర్వాతే అమెజాన్ ఏర్పాటు జరిగింది. కాబట్టి ఇటువంటి పరిస్థితుల్లో కోర్టులు ఆస్తులను దాదాపు సగానికి చేయవచ్చంటున్నారు.

బెజోస్ దంపతుల విడాకుల ప్రకటన నేపథ్యం

కోర్టుకు వెళ్లకపోవచ్చు

న్యాయనిపుణుల అంచనాల ప్రకారం.. వీరిద్దరూ కోర్టు బయట సెటిల్‌మెంట్ చేసుకోవచ్చు. వీరిద్దరూ కానీ.. వీరి లాయర్ల ద్వారా కానీ ఇది జరగవచ్చని భావిస్తున్నారు. చర్చల్లో అయినా కూడా సగం వాటాను ఆమె, ఆమె తరపు న్యాయవాది కోరే అవకాశం ఉందని అంటున్నారు. ఒక వేళ వీరిద్దరి మధ్య పెళ్లికి ముందు ఒప్పందం(ప్రీనప్షల్ అగ్రిమెంట్) జరిగి ఉంటే బెజోస్ భార్యకు పరిమితంగానే ఆస్తి దక్కేది. అమెరికాలో ఇద్దరు వ్యక్తులు పెళ్లి చేసుకునే ముందు ఇటువంటి ఒప్పందాలు కుదుర్చుకుంటుంటారు. ఇలా చేసినపుడు పెళ్లికి ముందు ఎవరి ఆస్తులు ఎంత అన్నది అందులో పొందుపరుస్తారు. అదే సమయంలో పెళ్లి తర్వాత ఇరువురి ఆస్తులపై హక్కులు ఎలా ఉండాలో కూడా రాసుకుంటారు. అయితే 1993లో జరిగిన బెజోస్ దంపతుల వివాహ సమయంలో ఇటువంటి ఒప్పందం జరగలేదు.

(ఈనాడు వాణిజ్య విభాగం)



విడాకులకు కారణమేమిటి?

అమెరికా వార్తా పత్రిక ద నేషనల్ ఎంక్వైరర్ కథనం ప్రకారం.. బెజోస్‌కు హాలీవుడ్ టాలెంట్ ఏజెంట్ పాట్రిక్ వైట్‌షెల్ భార్య, మాజీ రిపోర్టర్ లారన్ షాంజ్‌తో సంబంధం ఉంది. ఎనిమిది నెలల కింద వీరిరువురు దగ్గరయ్యారని ఆ పత్రిక అంటోంది. ఆ సంబంధమే ఈ తెగదెంపులకు కారణమని తన కథనంలో వివరించింది.

అమెజాన్ గురించి..

అంతర్జాతీయం పేరు: కెడబ్రా ఇంక్(1994-95)
సేవలు: క్లౌడ్ కంప్యూటింగ్, ఇ-కామర్స్, కృత్రిమ మేధ, కంప్యూటర్ హార్డ్‌వేర్.
ఏర్పాటు: జులై 5, 1994
వ్యవస్థాపకుడు: జెఫ్ బెజోస్
ప్రధాన కార్యాలయం: సియాటెల్, వాషింగ్టన్,అమెరికా
సేవలందించేప్రాంతం: ప్రపంచవ్యాప్తంగా
ఉత్పత్తులు: అమెజాన్ యాప్‌స్టోర్, అమెజాన్ ఈకో, అమెజాన్ కిండిల్, అమెజాన్ ప్రైమ్, అమెజాన్ వీడియో, కామిక్సాలజీ
ఆదాయం: 177.86 బి. డాలర్లు(2017)
నికర లాభం: 3.033 బి. డాలర్లు(2017)
ఉద్యోగుల సంఖ్య: 6,13,300

సెన్సెక్స్ ▼ 97 **36010**

నిఫ్టీ ▼ 27 **10795**

డోజోన్స్ 23950 ▼ 52 | నాస్‌డాక్ 6969 ▼ 17

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 70.49 ▼ (ఒక అమెరికా డాలరుకు) 08 పైసలు


ముడి చమురు 60.63 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ఘనం (+)			గ్రహణం (-)		
నిఫ్టీ	11న	మార్పు%	నిఫ్టీ	11న	మార్పు%
ITC	295.35	1.99	INDUSIND BANK	1515.15	-3.24
UPL	783.45	1.34	TATA MOTORS	180.30	-2.93
INDIAN OIL CORP	131.20	1.00	BHARTI INFRATEL	277.20	-2.75
ONGC	144.65	0.98	TCS	1842.55	-2.44
HINDALCO	205.85	0.91	L & T	1369.60	-1.65
WIPRO	328.70	0.91	GAIL (INDIA)	338.60	-1.54
TECH MAHINDRA	699.20	0.67	YES BANK	184.25	-1.42


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	64.02	74.24	బ్రహెయిన్ దీనార్	173.29	198.27
పౌండ్ స్టెర్లింగ్	81.66	94.69	కువైట్ దీనార్	192.20	239.25
యూరో	73.78	85.56	ఒమన్ రియాల్	169.57	194.25
జపనీస్ యెన్/100	59.10	68.52	సౌదీ రియాల్	17.02	20.17
ఆస్ట్రేలియా డాలరు	46.08	53.33	యూఏఈ దిర్హమ్	17.42	20.36
సింగపూర్ డాలరు	47.36	56.09	మలేషియా రింగిట్	15.29	18.81
థాయ్ బాత్/100	200.59	239.90	చైనీస్ యువాన్	7.37	11.95

శుక్రవారం నిఫ్టీ కదలికలు



రొమ్ము కేన్సర్ ఔషధాన్ని విడుదల చేసిన 'హెటెరో'

ఈనాడు, హైదరాబాద్: హెటెరో డ్రగ్స్, రొమ్ము కేన్సర్ చికిత్సలో వినియోగించే లపాటినిబ్ ట్యాబ్లెట్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ట్యాబ్లెట్‌ను 'హెర్‌ట్యాబ్' అనే బ్రాండు పేరుతో 250 ఎంజీ డోసులో రూపొందించినట్లు కంపెనీ పేర్కొంది. హెటెరో హెల్త్ కేర్ లిమిటెడ్ ఈ ఔషధం మార్కెటింగ్, పంపిణీ బాధ్యత చేపడుతుంది. రొమ్ము కేన్సర్ బాధితుల్లో కేన్సర్ కణాలు విస్తరించకుండా నిరోధించటానికి లెట్రోజోల్ ఔషధంతో కలిసి లపాటినిబ్ ట్యాబ్లెట్‌ను చికిత్స కింద ఇస్తారు.


క్రెబ్స్ బయో రైట్స్ ఇష్యూ

ఈనాడు, హైదరాబాద్: క్రెబ్స్ బయోకెమికల్స్ రైట్స్ ఇష్యూకు రానుంది. తద్వారా సుమారు రూ.24.82 కోట్లు సమీకరిస్తుంది. రైట్స్ ఇష్యూ ప్రతిపాదనను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో ఆమోదించారు. దీని ప్రకారం ప్రస్తుత వాటాదార్లకు 28,86,300 షేర్లను రైట్స్ పద్ధతిలో జారీ చేయాలని నిర్ణయించింది. రికార్డు తేదీ నాటికి వాటాదార్లుగా ఉన్న వారికి ప్రతి 100 షేర్లకు 21 షేర్లను రైట్స్ పద్ధతిలో ఇస్తారు. ఒక్కో షేర్‌కు రూ.76 ప్రీమియంతో జారీ ధరను రూ.86గా నిర్ణయించారు. వచ్చే నెల 1వ తేదీని రికార్డు తేదీ.

కొనసాగిన నష్టాలు

- 97 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- టీసీఎస్ షేరు డీలా

సమీక్ష



టీసీఎస్ షేర్లు నిరాశపరిచాయి. కంపెనీ ప్రకటించిన మూడో త్రైమాసిక ఫలితాల్లో మార్జిన్లు అంచనాలు అందుకోకపోవడమే ఇందుకు నేపథ్యం. ఇంట్రాడేలో 2.75 శాతం కోల్పోయిన షేరు రూ.1,836.10 వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 2.45 శాతం నష్టంతో రూ.1841.95 దగ్గర స్థిరపడింది. ఇక టీసీఎస్ ప్రభావంతో మార్కెట్లు రెండో రోజూ నీరసపడ్డాయి. మరో ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ ఫలితాలు ప్రకటించనుండటంతో మదుపర్లు జాగ్రత్త పడ్డారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం, ముడిచమురు ధరలు పెరగడం సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఇక వారం ప్రాతిపదికన చూస్తే.. సెన్సెక్స్ 314.74 పాయింట్లు, నిఫ్టీ 67.60 పాయింట్లు చొప్పున లాభాలు నమోదు చేశాయి. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు రాణించగా, ఐరోపా షేర్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 36,191.87 పాయింట్ల వద్ద లాభాల్లోనే ప్రారంభమైంది. అయితే కొద్ది సేపటికే మదుపర్ల అమ్మకాలతో డీలాపడిన సూచీ.. నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 35,840.60 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సూచీ.. అనంతరం స్వల్పంగా కోలుకుంది. చివరకు 96.66 పాయింట్ల నష్టంతో 36,009.84 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 26.65 పాయింట్లు కోల్పోయి 10,794.95 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,739.40-10,850.15 పాయింట్ల మధ్య కదలాడింది.

- ✦ కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్‌ను ప్రకటించడంతో ప్రజ్ ఇండస్ట్రీస్ షేరు రాణించింది. ఇంట్రాడేలో 161.50 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకిన షేరు.. చివరకు 10.24 శాతం లాభంతో రూ.151.80 వద్ద ముగిసింది.
- ✦ టాటా గ్రూప్‌తో వాటా విక్రయ చర్చలు జరపొచ్చన్న వార్తలతో జెట్ ఎయిర్‌వేస్ షేరు వెలుగులోకి వచ్చింది. 4.67 శాతం పెరిగిన షేరు.. రూ.253.50 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 నష్టాలు చవిచూశాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 3.26%, టాటా మోటార్స్ 2.83%, యెస్ బ్యాంక్ 1.47%, ఎల్ అండ్ టీ 1.44%, టాటా స్టీల్ 1.17%, పవర్‌గ్రిడ్ 1.07%, హిందుస్థాన్ యునిలీవర్ 0.98%, భారతీ ఎయిర్‌టెల్ 0.95% చొప్పున డీలాపడ్డాయి. ఐటీసీ 2.02%, ఓఎన్‌జీసీ 0.80%, వేదాంతా 0.74%, ఇన్ఫోసిస్ 0.58%లు రాణించిన వాటిలో ఉన్నాయి. రంగాల వారీ సూచీల్లో బ్యాంకింగ్, యంత్ర పరికరాలు, వాహన, మన్నికైన వినిమయ వస్తువులు, ఐటీ షేర్లు 1 శాతం వరకు పడ్డాయి. చమురు- గ్యాస్ స్క్రిప్‌లు మాత్రం స్వల్పంగా రాణించాయి. బీఎస్ఈలో 1411 షేర్లు ప్రతికూలంగా, 1199 స్క్రిప్‌లు సానుకూలంగాను ముగిశాయి. 179 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

17 నెలల కనిష్ఠానికి..

నవంబరు పారిశ్రామికోత్పత్తి 0.5%

దిల్లీ: భారత పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 17 నెలల్లోనే అత్యల్ప వృద్ధి నమోదు చేసింది. నవంబరులో 0.5 శాతంగా నమోదైంది. మన్నికైన వినిమయ వస్తువులు, యంత్ర పరికరాలు సహా తయారీ రంగాలు నిరాశపరచడమే ఇందుకు కారణం. పారిశ్రామికోత్పత్తిని పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఆధారంగా లెక్కిస్తారు. 2017 నవంబరులో పారిశ్రామికోత్పత్తి సూచీ 8.5 శాతం మేర వృద్ధి చెందింది. ఇక అత్యల్పంగా 2017 జూన్‌లో ఐఐపీ 0.3 శాతంగా నమోదైంది. ఇక అక్టోబరు పారిశ్రామికోత్పత్తి గణాంకాలను 8.1 శాతం నుంచి 8.4 శాతంగా సవరించారు. కేంద్ర గణక కార్యాలయం (సీఎస్ఓ) విడుదల చేసిన మరికొన్ని వివరాలు ఇలా..

- ✦ ఐఐపీ సూచీలో 77.63 శాతం వాటా ఉన్న తయారీ రంగం -0.4 శాతం ప్రతికూల వృద్ధి నమోదుచేసింది. ఏడాది క్రితం ఇదే సమయంలో ఇది 10.4 శాతంగా ఉంది. ఈ రంగంలోని 23 విభాగాల్లో 10 విభాగాలు పురోగతి సాధించాయి.
- ✦ గనుల రంగ ఉత్పత్తి 2.7 శాతం వృద్ధి చెందింది. అంతక్రితం ఏడాది ఇది 1.4 శాతంగా ఉంది. విద్యుత్ రంగ వృద్ధి 3.9 శాతం నుంచి 5.1 శాతానికి పెరిగింది.
- ✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- నవంబరు విషయానికొస్తే పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటు 5 శాతంగా నమోదైంది.

జీఎంఆర్ హైదరాబాద్ విమానాశ్రయానికి సీఎస్ఆర్ అవార్డు

ఈనాడు, హైదరాబాద్: జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) కు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) అవార్డు లభించింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ), 2018 సీఎస్ఆర్ ఎక్సలెన్స్ అవార్డుల్లో ఉత్తమ కార్పొరేట్ సంస్థగా అవార్డు దక్కించుకున్నట్లు జీహెచ్ఐఏఎల్ తెలియజేసింది. ఇండియా ప్రొఫెషనల్స్ ఫోరమ్- యూకే అధ్యక్షుడు డాక్టర్ మోహన్ కౌల్, సెబీ మాజీ ఛైర్మన్ జీఎన్ బాజ్‌పాయ్ చేతుల మీదగా జీహెచ్ఐఏఎల్ సీఎఫ్ఓ రాజేష్ అరోరా ఈ అవార్డు అందుకున్నారు. సమాజసంక్షేమానికి చేయూత అందించటానికి తాము ఎప్పుడూ ముందుంటామని జీహెచ్ఐఏఎల్ సీఈఓ ఎస్‌జీకే కిషోర్ పేర్కొన్నారు.

మార్కెట్ కబుర్లు

- ✦ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) నుంచి హర్యానాలో రూ.565 కోట్ల విలువైన రహదారి ప్రాజెక్టు లభించిందని **హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్** వెల్లడించింది.
- ✦ అమెరికాకు చెందిన రెండు సంస్థలు కేపీఐ రీసెర్చ్, డాటాసెటిక్స్‌లను 72 మిలియన్ డాలర్లతో పూర్తిగా నగదు రూపేణా కొనుగోలు చేయనున్నట్లు **టేక్ సొల్యూషన్స్** వెల్లడించింది. ఇప్పటికే ఐరోపా, ఆసియాలో సేవలు అందిస్తున్న ఈ సంస్థ తాజా కొనుగోళ్లతో అమెరికాలోనూ కార్యకలాపాలను విస్తరించనుంది.
- ✦ రుణ, బ్యాంకింగ్ సొల్యూషన్లను అందించే నిమిత్తం యెస్‌బ్యాంక్‌తో **కియామోటార్స్** ఒప్పందం కుదుర్చుకుంది.
- ✦ దీర్ఘకాలిక బాండ్ల విక్రయం ద్వారా రూ.5000 కోట్లను సమీకరించినట్లు **పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్** వెల్లడించింది. ఇదే సమయంలో గ్రూపు అనుబంధ సంస్థ పిరమాల్ కేపిటల్ హౌసింగ్ అండ్ ఫైనాన్స్ కూడా 5000 కోట్లను సమీకరించింది.
- ✦ ప్రైవేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో బాండ్ల జారీ ద్వారా **ఎన్‌టీపీసీ** రూ.4000 కోట్ల వరకు సమీకరించింది.
- ✦ ఎవరెడీ కోసం వ్యూహాత్మక భాగస్వామిని ఎంపిక చేసే బాధ్యతను కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు అప్పగించినట్లు **విలియమ్‌సన్ మాగర్** గ్రూపు వెల్లడించింది. ఎవరెడీని నుంచి పూర్తిగా వైదొలిగే ఉద్దేశం లేకపోవడంతో విలియమ్‌సన్ మాగర్ గ్రూపు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.


లివ్‌ఫాస్ట్ నుంచి సరికొత్త ఇన్వర్టర్లు

- సీఈవో గురుప్రీత్‌సింగ్ భాటియా

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: వేగంగా ఛార్జింగ్ కావడంతోపాటు అదనపు బ్యాటరీ బ్యాకప్ ఉండేలా సరికొత్త ఇన్వర్టర్ల శ్రేణిని లివ్‌ఫాస్ట్ సంస్థ మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను జూబ్లీహిల్స్‌లో ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో లివ్‌ఫాస్ట్ సంస్థ సీఈవో గురుప్రీత్‌సింగ్ భాటియా వివరించారు. దాదాపు 25 శాతం వేగవంతమైన ఛార్జింగ్, అదనపు బ్యాటరీ బ్యాకప్‌తో ఇన్వర్టర్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. సంస్థను ఈ ఆర్థిక సంవత్సరానికి రెండువేల కోట్ల టర్నోవర్‌కు తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. 2019 మార్చినాటికి దేశవ్యాప్తంగా 25వేల అవుట్‌లెట్స్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ ఆర్థిక సంవత్సరానికి సుమారు 5వేల ఇన్వర్టర్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 22 మంది పంపిణీదారులతో మూడు వేల మంది డీలర్లతో ఇక్కడ వ్యాపార విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మొత్తం 18 రకాలుగా ఇన్వర్టర్ బ్యాటరీలను మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. తమ గ్రూప్ ఆధ్వర్యంలో ఇప్పటికే దాదాపు రూ.25 వేల కోట్లు పెట్టుబడులను పెట్టినట్లు తెలిపారు.

11న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు				
	హైదరాబాద్	443	వరంగల్	445
	చిల్లరగా(ఒక గుడ్డు)	5.05	విశాఖపట్నం	458
	బెంగళూరు	455	చెన్నై	460
	12వ తేదీకి		చిత్తూరు	453
	విజయవాడ/గోదావరి	453	నమక్కల్	445

పట్టాలెక్కలేదు... పైసలు దక్కలేదు

- భూమి ఉన్నా అందని పాసుపుస్తకం
- 5.43 లక్షల మంది రైతుల నిరీక్షణ
- రైతుబంధు, బీమాలు వర్తించడం లేదని ఆవేదన
- అన్నదాతల అవస్థలు



ఈనాడు, హైదరాబాద్: ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు రాకపోవడంతో రైతులు నానాయాతన అనుభవిస్తున్నారు. వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, రైతు బీమా పథకాలు అందడం లేదు. బ్యాంకులు అప్పులు ఇవ్వడం లేదు. కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో 72 లక్షల భూ ఖాతాలు ఉండగా 58.43 లక్షల మంది రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. ఇప్పటివరకు 53 లక్షల మందికి మాత్రమే అందాయి. వీరిలోనూ కొందరి పుస్తకాల్లో తప్పులు ఉన్నాయి. నేటికీ పుస్తకాలు రాని ఐదున్నర లక్షల మంది కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుకున్నట్లు.. ప్రభుత్వం సాయం చేస్తున్నా పాసుపుస్తకాలు లేక వాటిని అందుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు.


తప్పులతో తిప్పలు

కొత్త పాసుపుస్తకాల ముద్రణ, పంపిణీ సందర్భంగా చోటుచేసుకున్న పొరపాట్లు రైతులకు తలనొప్పిగా మారాయి. భూదస్త్రాల ప్రక్షాళనలో సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే సమయంలో భారీగా తప్పులు దొర్లాయి. దాదాపు ఇరవై లక్షల సర్వే సంఖ్యలు కనిపించకుండా పోగా, అచ్చయిన పుస్తకాల్లోనూ తప్పులు వచ్చాయి. దీంతో దాదాపు తొమ్మిది లక్షల పుస్తకాలు తిరిగి ముద్రించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పుస్తకంలోని రెండో పేజీలో దొర్లిన తప్పులను తహసీల్దార్ కార్యాలయాల్లోనే ముద్రించే అవకాశమిచ్చినా ముందుకు సాగడం లేదు. రెవెన్యూ సిబ్బంది ఎన్నికల విధులకు వెళ్లడంతో కొంత జాప్యం జరిగింది. తహసీల్దార్లు డిజిటల్ సంతకాలు చేయడంలో జాప్యంతో పుస్తకాల పంపిణీకి ఆటంకాలు కొనసాగుతున్నాయి. కొత్త పాసుపుస్తకాల జారీతో పాతవాటికి కాలం చెల్లింది. దీంతో వాటిని కుదవ పెట్టి ప్రైవేట్‌గా అప్పులు తెచ్చుకునే వీలు కూడా లేకపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారికి సాయం ఎప్పటికి?

ప్రభుత్వం ఎకరాకు రూ.4 వేల చొప్పున పెట్టుబడి సాయం కింద వానాకాలం, యాసంగి పంటలకు ఆర్థిక సాయం అందించింది. వానాకాలంలో వ్యవసాయ శాఖ 58 లక్షల చెక్కులు ముద్రించగా అందరి దగ్గరా పాసుపుస్తకాలు లేకపోవడంతో 50 లక్షల చెక్కులను మాత్రమే పంపిణీ చేశారు. యాసంగికి వచ్చేసరికి 45 లక్షల మందికే సాయం అందింది. పాసుపుస్తకాలు అందని అయిదున్నర లక్షల మంది అన్నదాతలకు.. రైతుబంధు, రైతు బీమా అందేది ఎలా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

పేరు.. ఫొటో తప్పు అని తిప్పుతున్నారు



సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మంగళంపల్లికి చెందిన ఈ రైతు పేరు ఉప్పల శేఖర్. మూడెకరాల పొలం ఉంది. కొత్త పాసుపుస్తకం ఇస్తామని ప్రక్షాళనలో 1బీ వివరాలు తీసుకున్నారు. పేరు తప్పు పడిందని కొద్దిరోజులు ఇవ్వలేదు. ఎందుకు ఇవ్వడం లేదని అడిగితే ఫొటో కూడా తప్పు వచ్చిందంటున్నారన్నారని శేఖర్ చెప్పారు. నేటికీ పాసుపుస్తకం అందకపోవడంతో రెండు విడతల రైతుబంధు సాయం అందలేదని, రైతు బీమా కూడా వర్తించలేదని వాపోయారు.

పరిష్కారానికి ప్రత్యేక బృందాలు

కొన్నిచోట్ల పాసుపుస్తకాలు అందలేదని ఫిర్యాదులు అందుతున్నాయి. వెంటనే ఆ సమస్యలు పరిష్కరిస్తున్నాం. పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గ్రామాలకు పంపిస్తున్నాం. అందరికీ పుస్తకాలు వస్తాయి. ఆందోళన చెందొద్దు.

– వాకాటి కరుణ, డైరెక్టర్, ఎల్ఆర్‌యూపీ

రెవెన్యూ సిబ్బందిపై భారం

క్షేత్రస్థాయి విచారణకే ఎక్కువ సమయం పడుతుంది. ఆన్‌లైన్ తప్పిదాలకు కూడా రెవెన్యూ సిబ్బందినే బాధ్యులను చేస్తున్నారు. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికలు, ఇతర ప్రభుత్వ విధులతో రెవెన్యూ సిబ్బంది అధిక ఒత్తిడికి గురవుతున్నారు. పాసుపుస్తకాల పంపిణీని పూర్తి చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం.

– గౌతం కుమార్, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం



నాకు పూర్వీకుల నుంచి సంక్రమించిన రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో పాసుపుస్తకం ఉండేది. 1బీ దస్త్రాల్లో, కాస్తులో నేనే ఉన్నాను. భూమిపై ఎలాంటి వివాదాలు లేకపోయినా కొత్త పాసుపుస్తకం ఇవ్వలేదు. రైతు బంధు, బీమా అమలు కాలేదు. ఇప్పటికీ పాసుపుస్తకం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.

– రౌతు అశోక్, ధర్మారావుపేట, గణపురం మండలం, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా

నాలుగెకరాలకు పైసలు రాలే



నాకు నాలుగెకరాల భూమి ఉంది. కొత్త పాసుపుస్తకం ఇవ్వలేదు. ఎందుకు ఇవ్వలేదని రెవెన్యూ అధికారులను అడిగితే నీ సర్వే నంబర్లలో ఇతరుల భూమి నమోదయింది. . దాన్ని మార్చాలని చెబుతున్నారు. రైతు బంధు పైసలు రాలేదు.

– వేల్పుల నర్సయ్య, కిష్టాపూర్, రామడుగు మండలం, కరీంనగర్ జిల్లా

జులై నుంచి గిరిజన వర్సిటీ తరగతులు

- భూపాలపల్లి జిల్లా జాకారంలో ఆరు కోర్సులతో ప్రారంభం
- సమీక్షలో సీఎస్ జోషి ఆదేశం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటుకు కీలక అడుగు పడింది. జులై నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. శుక్రవారం ఆయన గిరిజన సంక్షేమశాఖ, విద్యాశాఖ, అటవీశాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ.. బీఏ (హోటల్ మేనేజ్‌మెంట్), బీసీఏ, ఎంసీఏ, ఎంబీఏ (మార్కెటింగ్, అటవీ ఉత్పత్తులకు అనుగుణమైన ప్యాకేజింగ్), బీబీఏ, గిరిజన సంస్కృతి, జానపదంపై మాస్టర్ డిగ్రీ వంటి ఆరు కోర్సుల్లో తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. స్థానిక గిరిజన యువతకు తప్పనిసరిగా 30శాతం సీట్లను కేటాయించాలన్నారు. గిరిజన వర్సిటీ కమిటీలో ఉన్నత విద్య, గిరిజన సంక్షేమం, అటవీశాఖ ముఖ్య కార్యదర్శులను సభ్యులుగా చేర్చాలని సూచించారు. తరగతుల నిర్వహణకు అనుగుణంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా జాకారం వద్ద ఉన్న యువజన శిక్షణ కేంద్రాన్ని (వైటీసీ) తీర్చిదిద్దాలని హెచ్‌సీయూ అధికారులకు సూచించారు. వర్సిటీ భూసేకరణ నిమిత్తం జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్‌కు రూ.10కోట్లు ఇవ్వాలని గిరిజన సంక్షేమశాఖను ఆదేశించారు.

ప్రలోభాలకు గురికావద్దు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు వీహెచ్ లేఖ

హైదరాబాద్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడవద్దని ఏఐసీసీ కార్యదర్శి వి.హన్మంతరావు కోరారు. తాజాగా ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆయన శుక్రవారం లేఖ రాశారు. గతంలో ఇతర పార్టీల్లో గెలిచిన ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రలోభాలకు గురిచేసి తెరాసలో చేర్చుకున్నారని.. ఇప్పుడు అలాంటి అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని లేఖలో పేర్కొన్నారు.



హైదరాబాద్‌లోని సన్‌షైన్ ఆసుపత్రిలో వైద్యుడు గురువారెడ్డితో శివసాయి. పక్కన తెరాస నేత శ్రీనివాస్‌యాదవ్, బాలుడి తల్లిదండ్రులు

శివసాయికి శస్త్రచికిత్స

- వైద్యుల నిర్ణయం
- కేటీఆర్ సాయంతో ఏర్పాట్లు

ఈనాడు, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సాయంతో రామగుండానికి చెందిన పోలియో బాధిత బాలుడు శివసాయి శస్త్రచికిత్సకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల శివసాయి తెలంగాణభవన్‌కు వచ్చి కేటీఆర్‌ను కలవగా ఆయన వెంటనే బాలుడిని ఆసుపత్రికి పంపించి, చికిత్స చేయించాలని పార్టీ నేత కట్టెల శ్రీనివాస్‌యాదవ్‌ను ఆదేశించారు. వైద్యానికయ్యే మొత్తం ఖర్చు భరిస్తామని చెప్పారు. ఈ మేరకు శ్రీనివాస్‌యాదవ్ బాలుడిని హైదరాబాద్‌లోని సన్‌షైన్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యుడు గురువారెడ్డి శివసాయికి పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స చేయాలని శుక్రవారం నిర్ణయించారు. కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించి, సన్నద్ధత అనంతరం ఫిబ్రవరి మొదటి వారంలో శస్త్రచికిత్స చేస్తామని చెప్పారు. శస్త్రచికిత్సతో కచ్చితంగా నయమవుతుందని, బాలుడు నడుస్తాడని ఆయన పేర్కొన్నారు. తమ ఆసుపత్రికి ఈ బాధ్యత అప్పగించినందుకు కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుమారుడి దీనస్థితిపై ఇన్ని రోజులు తల్లడిల్లుతూ అందరి చుట్టూ తిరగామని, కేటీఆర్ దేవునిలా తమను ఆదుకున్నారని బాలుడి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

చంద్రబాబు వల్లే తెలంగాణ వాదం తెరపైకి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

ఈనాడు, దిల్లీ: శాసనసభ ఎన్నికల్లో ఏపీ సీఎం చంద్రబాబు ప్రచారం చేయడం వల్లే మళ్లీ తెలంగాణ వాదం తెరపైకి వచ్చిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం దిల్లీలో భాజపా జాతీయ మండలి సమావేశానికి హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పర్యటన వల్ల తెలంగాణ అస్తిత్వం ఎక్కడ మరుగున పడుతుందోనని ప్రజల్లో ఆందోళన నెలకొందన్నారు. ఆ అభద్రతాభావంతోనే మళ్లీ కేసీఆర్‌కే పట్టం కట్టారని చెప్పారు. సమావేశానికి తెలంగాణ నుంచి వందల మంది నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఎంపీ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, పార్టీ నేతలు ఇంద్రసేనారెడ్డి, వెదిరె శ్రీరాం, నూనె బాలరాజ్, ప్రేమేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లుగా భారత్‌లో అసహనం

- భాజపా పాలనను పరోక్షంగా విమర్శించిన రాహుల్‌గాంధీ
- దుబాయ్‌లో ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగం

దుబాయ్: నాలుగున్నరేళ్లుగా భారతదేశం ‘అసహనం’తో బాధపడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విచారం వ్యక్తం చేశారు. మొదటిసారిగా దుబాయ్ పర్యటనకు వచ్చిన ఆయన ‘దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం’లో హాజరైన వేలాది మంది ప్రవాస భారతీయులనుద్దేశించి మాట్లాడారు. 2019ను ‘‘సహనం ఏడాది’’గా ప్రకటించిన యూఏఈని రాహుల్‌గాంధీ ఈ సందర్భంగా ప్రశంసలతో ముంచెత్తారు.

‘‘కేవలం ఒకేఒక్క ఆలోచన సరైనది, మిగిలినవి తప్పు అనే ఆలోచనతో భారత్‌లాంటి దేశాన్ని ముందుకు నడిపించలేం. ప్రస్తుతం నా ప్రియమైన దేశం రాజకీయ కారణాలతో విడిపోయింది. నోట్ల రద్దు, జీఎస్టీతో దేశం నాశనమైపోయింది. నిరుద్యోగిత అనే పెద్ద సమస్య దేశాన్ని ప్రధానంగా పట్టిపీడిస్తోంది. మనం తలుచుకుంటే చైనాను మించి ఉద్యోగాలు కల్పించగలం. రెండోది మన రైతులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరో హరితవిప్లవం అవసరం’’ అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. యూఏఈ ఉపాధ్యక్షుడు, ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మఖ్తౌమ్ ఆతిథ్యం తనను ముగ్ధుణ్ని చేసిందన్నారు.



గురువారం రాత్రి దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో సెల్ఫీ తీసుకుంటున్న ఓ మహిళ

అధికారంలోకి రాగానే ‘ఆంధ్ర’కు ప్రత్యేక హోదా

తాము అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని రాహుల్ పునరుద్ఘాటించారు. 2019లో అధికారంలోకి రాగానే చేసే మొదటిపని అదేనన్నారు. దుబాయ్ ప్రగతికి కార్మికులు చేస్తున్న కృషిని అభినందించారు. తాను మనసులోని మాట (మన్ కీ బాత్) చెప్పడానికి ఇక్కడికి రాలేదని, కార్మికుల సమస్యలు తెలుసుకోవడానికే వచ్చానంటూ ప్రధాని మోదీ నిర్వహిస్తున్న ‘‘మన్ కీ బాత్’’ కార్యక్రమాన్ని పరోక్షంగా విమర్శించారు. ఆయన వెంట కేరళ కాంగ్రెస్ నాయకుడు ఊమెన్ చాందీ, భారత ప్రవాస కాంగ్రెస్ ఛైర్మన్ శ్యాం పిట్రోడా ఉన్నారు.

వైద్య రంగం అభివృద్ధికి సీఎం కృషి

- రాష్ట్ర వైద్య, విద్యా సంచాలకులు డాక్టర్ రమేశ్‌రెడ్డి
- సందడిగా ఉస్మానియా దంత వైద్యశాల వజ్రోత్సవాలు

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: దేశంలో ఎక్కడా లేనివిధంగా ఉస్మానియా దంత వైద్యశాలలో 21 మంది సహాయ ఆచార్యుల పోస్టులను భర్తీ చేశామని తెలంగాణ రాష్ట్ర వైద్య, విద్యా సంచాలకులు డాక్టర్ రమేశ్‌రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో వైద్య రంగాన్ని మెరుగుపర్చేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం అఫ్జల్‌గంజ్‌లోని ఉస్మానియా దంత వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్, డాక్టర్ ఎ.ఎస్.నారాయణ ఆధ్వర్యంలో ఆ కళాశాల వజ్రోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమ ముఖ్యఅతిథి రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ 55 ఏళ్లుగా జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాలుగున్నరేళ్లలో జరిగిందన్నారు. డాక్టర్ ఎ.ఎస్.నారాయణ మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఈ వేడుకల్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పోస్టల్ కవరుతో పాటు ఉస్మానియా దంత వైద్యకళాశాలపై రూపొందించిన సావనీరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో దంత వైద్యశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, గుంటూరులోని సిబార్ దంత వైద్యశాల యజమాని ఎల్.కృష్ణప్రసాద్, తపాలా అధికారులు, సావనీరు కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎస్.ఎస్.యాదవ్, అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నర్సింహస్వామి పాల్గొన్నారు. విశ్రాంత ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాంచంద్రారెడ్డి, డాక్టర్ బీకేరెడ్డి, డాక్టర్ బాల్‌రెడ్డిలను సన్మానించారు.

అధ్యాపకులుగా సేవలందించి పదవీ విరమణ చేసిన, విదేశాల్లో స్థిరపడిన కొంతమంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలిశారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పలువురు విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఇక్కడికంటే విదేశాల్లో దంత వైద్యానికి విపరీతమైన డిమాండ్ ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉస్మానియా దంత వైద్యశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, ఆర్ఎంవో డాక్టర్ జగదీశ్వరరావు, డాక్టర్ ఎస్.ఎస్.యాదవ్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఉస్మానియా దంత వైద్యశాల వజ్రోత్సవ వేడుకలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డా.రమేశ్‌రెడ్డి, డా.వెంకటేశ్వర్లు, డా.చంద్రశేఖర్, డా.కృష్ణప్రసాద్


మరో రికార్డు దిశగా మేడిగడ్డ పనులు!

24 గంటల్లో 24వేల క్యూ.మీ. కాంక్రీటు పనులే లక్ష్యం

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎలాగైనా వచ్చే ఖరీఫ్‌కల్లా సాగునీటిని అందించాలన్న ఏకైక లక్ష్యంతో పనులన్నీ ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని రికార్డులూ నమోదవుతుండటం విశేషం. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణాల్లో భాగంగా ఇంజినీర్లు గతేడాది డిసెంబరు 23, 24 తేదీల్లో 16,722 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు చేపట్టి రికార్డు నెలకొల్పారు. అంతకుముందు కూడా వారు ఒకేరోజు 7,212 క్యూ.మీ. మేర పనులు సాగించి ప్రశంసలందుకున్నారు. ఇక 24 గంటల్లో 24,000 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని పూర్తిచేసేందుకు ఇంజినీర్లు సంసిద్ధమవుతున్నారు.

ఏపీలో పింఛను రూ.2 వేలకు పెంపు

సీఎం చంద్రబాబు వెల్లడి



ఈనాడు, నెల్లూరు, ఈనాడు డిజిటల్, అమరావతి: ‘సంక్రాంతికి కానుక ఇస్తున్నా. ఎంత భారమైనా ఫర్వాలేదు. నాకు కావాల్సింది పేదలు. అందుకే ఆలోచించా. ప్రతి నెలా ఇచ్చే పింఛను మొత్తాన్ని రూ.2వేలకు పెంచుతున్నా. నెల్లూరు జిల్లా బోగోలు వేదిక నుంచి అధికారికంగా ప్రకటిస్తున్నా. జనవరి నెల రూ.వెయ్యి బకాయి కలిపి ఫిబ్రవరిలో మొత్తం రూ.3వేలు చెల్లిస్తాం. మార్చి నుంచి రూ.2వేల చొప్పున ఇస్తాం. గత ఎన్నికల సమయంలో ఇంటికి పెద్ద కొడుకు మాదిరి ఉంటానని హామీ ఇచ్చా. అందుకే పింఛను మొత్తాన్ని పెంచా. ఇంకా ఎంతో చేయాలనుకున్నా. సంపద సృష్టించి ఆదాయాన్ని పెంచి మళ్లీ మీకు పంచుతా...’ అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. శుక్రవారం జన్మభూమి-మావూరు ముగింపులో భాగంగా నెల్లూరు జిల్లా బోగోలులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో, అమరావతిలో అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.

యాదాద్రి ఆలయ స్థానాచార్యులకు మెమో

గవర్నర్ దంపతులకు నిర్వహించిన వేదాశీర్వచనం వ్యవహారంలో..

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: గవర్నర్ నరసింహన్ దంపతులకు నిర్వహించిన వేదాశీర్వచనం వ్యవహారంలో యాదాద్రి ఆలయ స్థానాచార్యులకూ దేవస్థానం శుక్రవారం మెమో జారీ చేసింది. డిసెంబర్ 31న యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర సందర్శనకు వచ్చిన సందర్భంగా వేదాశీర్వచనంలో జరిగిన పొరపాటుపై గవర్నర్ నరసింహన్ ఆలయ నిర్వాహకుల మీద ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో నిత్యపూజారులు ఇద్దరికి ఇప్పటికే మెమో జారీ చేసిన ఈవో గీతారెడ్డి శుక్రవారం స్థానాచార్యులకు సైతం అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పాల పైసలు రాలే..

నెలన్నరగా విజయ రైతుల ఎదురుచూపు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య (టీఎస్‌డీడీసీఎఫ్) విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు బిల్లులు రావడం లేదు. ప్రతి 15-20 రోజులకు ఒకసారి రావాల్సిన పైసలు డిసెంబరు 1వ తేదీ నుంచి చెల్లించడం లేదని, దీంతో సంక్రాంతి పండుగకు చేతిలో సొమ్ము లేకుండా పోయిందని పాడి రైతులు వాపోతున్నారు. సహకార సంఘాల నుంచి పాలు పోసిన రైతుల వివరాలు డెయిరీకి రావడం ఆలస్యం అవుతోందని, అందుకే సమయానికి చెల్లించలేకపోతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి పది జిల్లాల పరిధిలో ఖమ్మం, నల్గొండ మినహా అన్ని జిల్లాల సహకార సంఘాల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని పేర్కొంటున్నారు.

అందని ప్రోత్సాహకం

నాణ్యమైన పాలు పోసే రైతులకు లీటరుకు రూ.4 ప్రోత్సాహకం 8 నెలలుగా ఇవ్వడం లేదు. సుమారు 3 లక్షల మంది రైతులకు గతేడాది ఏప్రిల్ ప్రోత్సాహకం కింద సెప్టెంబరులో ప్రభుత్వం రూ.4.41 కోట్లు విడుదల చేసింది. వెంటనే అక్టోబరు వరకు ప్రోత్సాహకం చెల్లించాలని డెయిరీ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి.

బకాయిలు చెల్లిస్తాం: టీఎస్‌డీడీసీఎఫ్ ఎండీ, శ్రీనివాసరావు

విజయ డెయిరీలో నిధుల కొరత లేదు. మార్కెట్ నుంచి రూ.5.5 కోట్లు సొమ్ము రావాల్సి ఉంది. అవి రాగానే రైతులకు చెల్లింపులు పూర్తి చేస్తాం. రెండు రోజులు సెలవులు వచ్చినందున సోమవారం ఎట్టి పరిస్థితుల్లో డబ్బులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

ఎన్ఐఏ కస్టడీకి జె.శ్రీనివాసరావు

- జగన్‌పై దాడి కేసు నిందితుడికి 25 వరకు రిమాండ్
- విజయవాడ న్యాయస్థానం ఆదేశాలు

ఈనాడు, విజయవాడ, విశాఖపట్నం; న్యూస్‌టుడే, విజయవాడ న్యాయవిభాగం: విశాఖ విమానాశ్రయంలో ఏపీ ప్రతిపక్ష నేత జగన్‌పై జరిగిన దాడి కేసులో నిందితుడు జె.శ్రీనివాసరావును వారం రోజులు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీకి అనుమతిస్తూ విజయవాడ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి పార్థసారథి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. కస్టడీకి తీసుకునే ముందు, ప్రతి మూడు రోజులకోసారి నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించాలని, థర్డ్ డిగ్రీ పద్ధతులు ప్రయోగించరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిందితుడు కోరితే న్యాయవాది సమక్షంలో విచారణ జరపాలని ఆదేశించారు. విచారణ అనంతరం నిందితుడికి ఈ నెల 25 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. ఈ దశలో ఎన్ఐఏ అధికారులు శ్రీనివాసరావును వారం రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేయగా.. న్యాయమూర్తి అనుమతించారు. విజయవాడలోని జిల్లా కారాగారంలో నిందితుడికి వైద్య పరీక్షలు పూర్తయ్యాక హైదరాబాద్‌లోని ఎన్ఐఏ కార్యాలయానికి తరలించే అవకాశం ఉందని సమాచారం.

ఉచితంగా వినికిడి యంత్రాలు

వైద్య శిబిరాల్లో అందజేయడానికి సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న చెవి, ముక్కు, గొంతు, దంత వైద్య పరీక్షల శిబిరాల్లో వినికిడి ఉపకరణాలను ఉచితంగా అందజేయనున్నారు. ఒక్కో వినికిడి యంత్రం విలువ రూ. 2,500-3,000 వరకూ ఉంటుందని అంచనా. కంటి వైద్య శిబిరాల్లో కళ్లద్దాలను ఉచితంగా అందజేసినట్లే ఈఎన్‌టీ శిబిరాల్లోనూ అవసరమైన ఉపకరణాలను అందించడానికి వైద్యఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఎంతమందికి వినికిడి యంత్రాలు అవసరమవుతాయనే స్పష్టత లేకపోయినా సుమారు లక్షన్నరమందికి పైగా ఇవి అవసరమవుతాయని ప్రాథమికంగా వైద్య అధికారులు అంచనా వేశారు. చెవి పరీక్షలకు ‘శ్రవణం’ అనీ, దంత పరీక్షలకు ‘దంత క్రాంతి’ అని పథకాలకు పేర్లను ఆరోగ్యశాఖ ప్రతిపాదించనున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ఆమోదంతో ఈ పథకాల పేర్లు ఖరారు అవుతాయని వైద్యవర్గాలు తెలిపాయి.

ఆ పల్లెకు తలుపులుండవు!



ఒడిశా: అదో చిన్న గ్రామం.. ఆ ఊళ్లోకి వెళితే ఏ ఇంటికీ తలుపులు కనిపించవు. ఆ మాటకొస్తే తలుపులు పెట్టాల్సిన అవసరమే లేదని గ్రామస్థులు ధీమాగా చెబుతుంటారు. దీంతో ఇప్పుడు ఆ పల్లెను చూసేందుకు అనేక ప్రాంతాల నుంచి పలువురు తరలి వస్తుండటంతో పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందుతోంది. ఒడిశాలోని కేంద్రపడా జిల్లా సియాలియా గ్రామం ప్రత్యేకత ఇది. మొత్తం 105 ఇళ్లుంటాయి. గ్రామ జనాభా 750.. చుట్టుపక్కల ప్రాంతాల్లో వరుస దొంగతనాలతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడిపిన సమయంలోనూ సియాలియా వాసులు తలుపుల్లేకుండానే ఆదమరిచి నిద్రపోతుంటారు. తమ ఊరిని గ్రామదేవత ఖారఖాయి కాపాడుతుందన్నది గ్రామస్థుల ప్రగాఢ విశ్వాసం. ఇంతవరకూ గ్రామంలో ఒక్క దొంగతనం కూడా జరగకపోవడం విశేషం. తమ ఇళ్ల గుమ్మం వద్ద గ్రామదేవత ఉంటుందని, ఒకవేళ తలుపులు ఏర్పాటు చేస్తే అది దేవతను అపవిత్రం చేయడం అవుతుందని గ్రామస్థులు నమ్ముతుంటారు. తలుపులు పెట్టుకోకపోవడానికి ఇదే కారణం. ఎవరైనా దొంగతనం చేస్తే గ్రామదేవత వారిని తప్పకుండా శిక్షిస్తుందని గ్రామస్థులు నమ్ముతారు.

వి శ్వా సం

ఈటీవీ భారత్

వి జ యం

గాజుల 'కొండ'గావ్!



ఛత్తీస్‌గఢ్: గాజులంటే ముందు గుర్తొచ్చే ప్రాంతాలు హైదరాబాద్, ఫిరోజాబాద్ (యూపీ). వీటి కోవలోనే తాజాగా ప్రాచుర్యంలోకి వస్తోంది కొండగావ్. ఛత్తీస్‌గఢ్‌లోని ఈ జిల్లాకేంద్రంలో గాజుల తయారీ పరిశ్రమ ప్రముఖంగా విస్తరిస్తోంది. మొదట్లో చిన్నగా ప్రారంభమైన పరిశ్రమ నేడు జిల్లాకే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. ఎంతలా అంటే ఇప్పుడు గాజుల పేరుతోనే జిల్లాను పిలిచేంతలా.. ఇక్కడ తయారైన గాజులు దేశ, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అంతేకాదు ఇక్కడ ఓ సంస్థను ఏర్పాటు చేసి దానిద్వారా పలువురికి శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తున్నారు. మహిళలకు స్వయంఉపాధి కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. పరిశ్రమ అభివృద్ధికి కలెక్టర్ కూడా విశేషంగా కృషి చేస్తున్నారు. దీంతో జిల్లా మహిళలు మంచి ఆదాయం పొందుతూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. ఇక్కడ పనిచేసే మహిళలు రోజుకు రూ. 200-300 వరకు ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం ముడిసరుకు లభ్యత కొంత ఇబ్బందిగా ఉన్నా త్వరలోనే దాన్ని అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

బుద్ధుడి అవశేషాల దర్శన భాగ్యం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: థాయిలాండ్ నుంచి తెచ్చిన బుద్ధుడి అవశేషాలను శుక్రవారం హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధ విగ్రహం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన బౌద్ధులు ఈ ధాతువులను దర్శించుకున్నారు. మాదాపూర్ మహేంద్ర హిల్స్‌లోని మహాబోధి బుద్ధ విహార కేంద్రంలో భారీ స్తూపాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా శుక్రవారం నుంచి ఆదివారం వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అక్కడికి వచ్చేవారికి బుద్ధ ధాతువుల దర్శనం కల్పించాలని వాటిని నగరానికి తెచ్చారు. మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమెరికాకు చెందిన ప్రముఖ బౌద్ధ బిక్షువు బిక్కు బోధితో పాటు, శ్రీలంక నుంచి పెద్ద సంఖ్యలో బౌద్ధ బిక్షువులు పాల్గొన్నారు. అనంతరం ఊరేగింపుగా లుంబినీ పార్కు నుంచి మహేంద్ర హిల్స్ వరకు తీసుకెళ్లారు.



బుద్ధుడి ధాతువులను హుస్సేన్‌సాగర్‌లోని విగ్రహం వద్దకు తెస్తున్న బౌద్ధులు

సీట్ల పంపకంపై అఖిలేశ్, మాయావతి ప్రకటన నేడు!

లఖ్‌నవూ: లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపకంపై సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ అగ్రనేత మాయావతి శనివారం సంయుక్తంగా ప్రకటించే అవకాశముంది. ఉభయులు కలిసి పాత్రికేయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమాచారాన్ని ఎస్పీ జాతీయ కార్యదర్శి రాజేంద్ర చౌధరి, బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి మిశ్ర శుక్రవారం వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో కలిసి సాగాలని భావిస్తున్న నేపథ్యంలో తొలి సమావేశమిది. వచ్చే ఎన్నికల్లో పొత్తుకు సంబంధించి ఇరుపార్టీల నేతలూ ఇప్పటికే సూత్రప్రాయ అంగీకారానికి వచ్చారు. కాంగ్రెస్‌కు తలుపులు మూసివేసినట్లేనని భావిస్తున్నారు. ఎస్పీ, బీఎస్పీలు చెరో 37 సీట్లలో పోటీ చేయాలని, రాయబరేలి, అమేథి స్థానాల్ని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకోసం విడిచిపెట్టాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్ఎల్‌డీ, నిషాద్ పార్టీ వంటి చిన్నపక్షాలు వీరికూటమిలో ఉండే అవకాశముంది.

తాతీల్లలో సొంతూళ్లకు వెళ్లేదెలా?



కిటికీ ద్వారా బోగీలోకి వెళ్లేందుకు నానా పాట్లు పడుతున్న ఓ వృద్ధుడు

- **రైళ్లు కిటకిట...ప్రయాణం కటకట**
- **నేడు విపరీతంగా రద్దీ!**
- **7 జన సాధారణ్ బండ్లు: ద.మ.రైల్వే**

ఈనాడు-హైదరాబాద్: సంక్రాంతి రద్దీతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రైల్వేస్టేషన్లు మరింతగా కిటకిటలాడుతున్నాయి. పండగకు ముందు రెండో శనివారం, ఆదివారం కారణంగా వరస సెలవులు(తాతీల్లు) కలిసి రావడంతో... శుక్రవారం సాయంత్రం నుంచే ప్రయాణికులు ఉభయ రాష్ట్రాల్లోనూ సొంత ఊళ్ల బాటపట్టారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి, లింగంపల్లితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ రైల్వేస్టేషన్లలో రద్దీ విపరీతంగా పెరిగింది. టికెట్ కౌంటర్లు, ప్లాట్‌ఫారాలు జనంతో పూర్తిగా నిండిపోయాయి. జనరల్ బోగీల్లో కాలు మోపేంత సందు కూడా లేనంతగా అన్నీ కిక్కిరిసిపోయాయి. తోపులాటలు జరగకుండా రైల్వేపోలీసులు క్యూలు పెట్టించి జనాన్ని రైళ్లు ఎక్కించారు. శనివారంనాడు రద్దీ మరింతగా పెరగనుంది. దూరప్రాంత రైళ్లలో నెల, రెండు నెలలకు ముందే రిజర్వేషన్లు పూర్తయిపోయాయి. అదనపు ఛార్జీలతో నడిపే ప్రత్యేక రైళ్లలోనూ నిరీక్షణ జాబితా (వెయిటింగ్ లిస్ట్) పరిమితి దాటేసింది. ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు రెండు లేదా మూడే ఉండటం, అందులోనూ అడుగు పెట్టే అవకాశమైనా లేనంతగా రద్దీ పెరిగిపోవడంతో... జనరల్ ప్రయాణికులు రిజర్వేషన్ బోగీలు, మహిళలు, వికలాంగుల బోగీలనూ ఆశ్రయించారు.

ఉత్తరాంధ్ర జిల్లాలకూ...

పండగకు ముందు, తర్వాత మొత్తం 203 ప్రత్యేక రైలు సర్వీసులు ప్రకటించామని దక్షిణమధ్య రైల్వే చెబుతున్నా- ఏ రైల్లోనూ రిజర్వేషన్ దొరకడం లేదని, రద్దీకి తగ్గట్లు బండ్లు లేవని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. సువిధ రైళ్లలో భారీ ఛార్జీలు, ప్రయాణంలో నానారకాల ఇబ్బందులపై 'ఈనాడు'లో కథనాలు వెలువడటం విదితమే. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు స్పందన అనంతరం ద.మ. రైల్వే జనసాధారణ్ బండ్లను ప్రకటించడం పేద ప్రయాణికులకు ఊరటగా అనిపించింది. అవి నేరుగా సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లేలా లేకపోవడంతో, అది ఫలక్‌నుమా, గోదావరి ఎక్స్‌ప్రెస్ వంటి దూరప్రాంత రైళ్లపై ఎంతగానో ప్రభావం చూపుతోంది.

ఈ రైళ్లలో అన్ని జనరల్ బోగీలే!

తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల మధ్య ద.మ. రైల్వే శనివారం ఏడు జనసాధారణ్ బండ్లు నడుపుతుంది. ఒక్కో రైల్లో 16 జనరల్ బోగీలు ఉంటాయి. ఇందులో ప్రయాణానికి రిజర్వేషన్ అక్కరలేదు. జనరల్ టికెట్‌తోనే రైల్లో ఎక్కవచ్చు.

నేడు బయల్దేరే జనసాధారణ్ రైళ్లు

- సికింద్రాబాద్-విజయవాడ (నెం. 07192): మధ్యాహ్నం 12కు
- సికింద్రాబాద్-విజయవాడ (నెం. 07194): రాత్రి 11.30
- విజయవాడ-సికింద్రాబాద్ (నెం. 07195): ఉదయం 8.35
- విజయవాడ-హైదరాబాద్ (నెం. 07193): రాత్రి 8.25
- తిరుపతి-కాకినాడ (నెం. 07190): రాత్రి 9.50
- విజయవాడ-విజయనగరం (నెం. 07184): రాత్రి 9.10
- విజయనగరం-విజయవాడ (నెం. 07185): ఉదయం 7.45

టికెట్ ఛార్జీల వివరాలు

- సికింద్రాబాద్-విజయవాడ: రూ. 130
- విజయవాడ-హైదరాబాద్: రూ. 135
- తిరుపతి-కాకినాడ: రూ. 175
- విజయవాడ-విజయనగరం: రూ. 145



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ వచ్చిన సమయంలో జనం రద్దీ. సీటు దొరుకుతుందో లేదోనని అందరిలోనూ ఆందోళన..

చట్టసభలో బీసీలకు రిజర్వేషన్లను పట్టించుకోరా?

- **112 బీసీ కుల సంఘాల సమావేశంలో ఆర్.కృష్ణయ్య**

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని దశాబ్దాలుగా పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం, రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. అగ్రకులాల వారికి రిజర్వేషన్లు కల్పించేందుకు మాత్రం 24గంటల్లోనే నిర్ణయం తీసుకోవడమంటే దేశంలోని బడుగు, బలహీనవర్గాలను అవమానించడమేనని విమర్శించారు. అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 112 బీసీ కుల సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పార్లమెంట్ ముట్టడి చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..ఇప్పటివరకు పార్లమెంట్‌లో 124 బిల్లులు ఆమోదం పొందితే, వీటిలో బీసీలకు చెందిన ఒకే ఒక్క బిల్లుకే ఆమోదముద్ర పడిందన్నారు. అదీ జాతీయ బీసీ కమిషన్‌కు అధికారాలకు సంబంధించిన చిన్న బిల్లు ఆమోదం పొందేందుకే 12ఏళ్లు పట్టిందని గుర్తుచేశారు. మరోవైపు పంచాయతీరాజ్ ఎన్నికల రిజర్వేషన్లను 34శాతం నుంచి 22 శాతానికి తగ్గించి బీసీల నోటికాడి ముద్దను లాక్కున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, పలు కుల సంఘాల నేతలు ఏఎల్ మల్లయ్య(గంగపుత్ర), లాలుకోట వెంకటాచారి (విశ్వబ్రాహ్మణ), కర్నె ఉపేందర్(వీరభద్రీయ), ఓ.బాలయ్య(సంచార జాతుల సంఘం), దినేశ్ సింగ్ (కాచిసంఘ్), బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి కోలా జనార్దన్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేశ్, ప్రతినిధులు దాసు, సురేశ్‌లతోపాటు యాదవ, గౌడ, ముదిరాజ్, విశ్వకర్మ, వడ్డెర, పద్మశాలి తదితర సంఘాల నేతలు పాల్గొని మాట్లాడారు.



హైదరాబాద్ నగరవాసులు సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు పయనమవడంతో బాహ్యవలయ రహదారిపై ఒక్కసారిగా వాహన తాకిడి అధికమైంది. దీంతో నానక్‌రామ్‌గూడ టోల్‌గేట్ వద్ద శుక్రవారం రాత్రి నిలిచిపోయిన అనేక వాహనాలు ఇవి...

అంబులెన్స్‌ను ఢీ కొట్టిన కారు

- **నలుగురి దుర్మరణం.. ముగ్గురికి తీవ్రగాయాలు**
- **ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం**

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ కారు డ్రైవర్ అతివేగం.. నాలుగు నిండు ప్రాణాలను బలిగొన్న ఘటన ఇది. హైదరాబాద్ నగరంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై మితిమీరిన వేగంతో వచ్చిన కారు అదుపు తప్పి అంబులెన్స్‌ను ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల ఠాణా పరిధిలోని బొంగుళూరు- రావిర్యాల మార్గమధ్యలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ నరేందర్ వివరాల ప్రకారం.. కర్ణాటకలోని గంగావతి తాలూకా మస్తూర్ క్యాంప్‌నకు చెందిన బొల్లిరెడ్డి వెంకటేశ్వరరావు వ్యవసాయ కూలీ. కొద్ది కాలం నుంచి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. చికిత్స కోసం భార్య సుబ్బలక్ష్మి, కుమారుడు హేమచందర్, అల్లుడు శ్రీనివాస్‌రావు, సోదరుడు రామారావుతో కలిసి బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరుకు వెళ్లారు. క్యాన్సర్ చివరి దశలో ఉందని, వెంకటేశ్వరరావు బతకడం చాలా కష్టమని, ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు కుటుంబసభ్యులకు సూచించారు. దీంతో వారు స్వగ్రామానికి వెళ్లేందుకు అంబులెన్స్ మాట్లాడుకున్నారు. అంబులెన్స్ డ్రైవర్లు పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన శివశంకరప్రసాద్, ఏలూరుకు చెందిన మహ్మద్ తాహేత్‌తోపాటు వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో బయల్దేరారు. రంగారెడ్డి జిల్లా బొంగుళూరు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రావిర్యాలకు వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా డివైడర్‌ను దాటుకుని వచ్చి అంబులెన్స్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు (60), సుబ్బలక్ష్మి (55), డ్రైవర్ శివశంకరప్రసాద్ (24) అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడిన రామారావు (70) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హేమచందర్, శ్రీనివాస్‌రావు, తాహేత్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మనోజ్ (30)కు స్వల్పగాయాలయ్యాయి.

ఎయిర్‌బ్యాగులు లేకపోతే వారు కూడా..

కారు వేగం ధాటికి అంబులెన్స్‌లో ఉన్నవారు తీవ్రగాయాలతో రోడ్డు మీదకు ఎగిరిపడ్డారు. డ్రైవర్‌కు ఎడమ పక్కన కూర్చున్న రామారావు, ఆయన వెనకాల కూర్చున్న సుబ్బలక్ష్మి, వెంకటేశ్వరరావు తలకు తీవ్రగాయాలు కావడంతో మృతి చెందారు. కారు బలంగా తాకడంతో అంబులెన్స్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ శివశంకరప్రసాద్‌ను ఔటర్ సిబ్బంది అతికష్టం మీద బయటికి తీశారు. ప్రమాదానికి కారణమైన కారులో హస్తినాపురం ప్రాంతానికి చెందిన డ్రైవర్ మనోజ్ తోపాటు మరో నలుగురు ఉన్నారు. వీరంతా నగరంలో షికారుకు వెళ్లి ఔటర్ మీదుగా తిరిగి వెళ్తుండగా అధిక వేగంతో కారుపై నియంత్రణ కోల్పోయి ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాద సమయంలో కారులోని ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. అతివేగానికి సంబంధించి గతంలో ఆ కారుపై పెద్దఅంబర్‌పేట, ఘట్‌కేసర్ ఔటర్ పరిధిలో రెండు చలాన్లు ఉండటం గమనార్హం. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

బాధిత కుటుంబాల దైన్యం

ఒకే కుటుంబంలో ముగ్గురు చనిపోవడంతో వారి బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. మూడు మృతదేహాలను తీసుకెళ్లేందుకు వారి స్వగ్రామం నుంచి అయిదుగురు మాత్రమే వచ్చారంటే బాధిత కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మృత్యు కాటు..



వెంకటేశ్వరరావు



సుబ్బలక్ష్మి



అంబులెన్స్ డ్రైవర్ శివ



దుర్ఘటనకు కారణమైన కారు ఇదే

తృటిలో తప్పిన పెనుముప్పు

45 మంది ప్రయాణికులు సురక్షితం

ఈనాడు డిజిటల్, వికారాబాద్: 'కొండగట్టు ఘటన'ను మరవకముందే మరో ఆర్టీసీ బస్సు ప్రమాదం శుక్రవారం కలకలం రేపింది. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదం నుంచి ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం నాగిరెడ్డిపల్లి సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి కల్వర్టును ఢీకొని, అదే వేగంతో బోల్తా పడింది. ఈ ఘటనలో కల్వర్టుపై ఉన్న రెండు స్తంభాలు, గోడ విరిగిపోయాయి. బస్సు ముందు చక్రాలు ఊడిపోయాయి. ఆ సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నట్లు కండక్టర్ తెలిపారు. కొందరికి గాయాలు కావడంతో.. క్షతగాత్రులను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



కల్వర్టును ఢీకొని బోల్తాపడిన బస్సు

వద్దన్న వారే కలిసి రమ్మంటున్నారు

- **తెరాస నేతలతోనూ మాట్లాడిస్తున్నారు**
- **జనసేన సత్తాకు ఇదే నిదర్శనం**
- **'పశ్చిమ', కృష్ణా జిల్లాల కార్యకర్తల సమావేశంలో పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు**

ఈనాడు, అమరావతి: జనసేనకు తగిన సంఖ్యలో సీట్లురావని గతంలో చెప్పిన వారే, వచ్చే ఎన్నికల్లో కలిసి రావాలంటూ తమను ఆహ్వానిస్తున్నారని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఇందుకు సంబంధించి తెరాస నాయకులతో కూడా మాట్లాడిస్తున్నారని ఆయన చెప్పారు. ప్రజల్లో తమ పార్టీకున్న బలానికి ఇదే నిదర్శనమన్నారు. శుక్రవారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల కార్యకర్తలు, నాయకులతో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రాజకీయాలతో ప్రజలు విసిగిపోయి మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పునకు జనసేన ఆలంబనగా నిలవాలని పవన్‌కల్యాణ్ ఈ సందర్భంగా శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో వివిధ పార్టీల నుంచి జనసేనలోకి వచ్చే నేతలను మనస్ఫూర్తిగా ఆహ్వానిద్దామన్నారు.

గాజుగ్లాసు గుర్తు కలిసొచ్చింది..

జనసేన పార్టీకి సామాన్యుడి టీ గ్లాసు ఎన్నికల గుర్తుగా రావడం అనుకూలించే విషయమన్నారు. తనకు చిన్ననాటి నుంచి తేనీరు అంటే ఎక్కువ ఇష్టమని, ఇప్పుడు అదే టీ గ్లాసు పార్టీ గుర్తుగా వచ్చిందని ఆయన పేర్కొన్నారు.





దిల్లీలో శుక్రవారం నిర్వహించిన భాజపా జాతీయ సమ్మేళనంలో ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాల అభివాదం ★ కార్యకర్తల జేజేలు

ఇటు మోదీ.. అటు ఏరీ?

- నాయకత్వం, సిద్ధాంతాల్లేని ప్రతిపక్షాల కూటమి
- భాజపా అధ్యక్షుడు అమిత్ షా

ఈనాడు - దిల్లీ

భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. శుక్రవారం దిల్లీలోని రాంలీలా మైదాన్‌లో జరిగిన ఆ పార్టీ జాతీయ సమ్మేళనంలో ప్రారంభోపన్యాసం చేస్తూ వచ్చే ఎన్నికల ప్రాధాన్యాన్ని వివరించి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గంటసేపు చేసిన ప్రసంగంలో హిందుత్వ ఓటర్లను బుజ్జగిస్తూ, తటస్థులను ఆకర్షించేందుకు 'వికాస్'నూ ప్రస్తావించారు. రానున్న ఎన్నికలు రెండు భిన్నమైన సిద్ధాంతాల మధ్య జరిగే పోటీ అని చెప్పారు. "ప్రపంచంలోనే ప్రజాదరణ పొందిన ప్రధాని నరేంద్ర మోదీ, నాయకత్వం లేని కూటమి మధ్య పోటీ జరుగుతుంది. గతంలో కాంగ్రెస్...ఇతరుల మధ్య పోటీ ఉండేది. ఇప్పుడు భాజపా...ఇతరుల మధ్య పోటీ జరుగుతుంది. మోదీని గద్దె దించడం సాధ్యం కాదని గుర్తించే అపవిత్రంగా భాజపా వ్యతిరేక కూటమిని ఏర్పాటు చేశారు. ఇది మోదీ శక్తిని, భాజపా బలాన్ని అంగీకరించడం కిందకే వస్తుంది. ప్రతిపక్షాల నిస్సహాయతను తెలియజేస్తోంది" అని అన్నారు. "ప్రజలు 'మజ్బూత్ సర్కార్' (బలమైన ప్రభుత్వం) కావాలని కోరుకుంటుంటే ప్రతిపక్షాలు 'మజ్బూర్ సర్కార్' (నిస్సహాయ ప్రభుత్వం) ఇవ్వాలని అనుకుంటున్నాయి. నరేంద్ర మోదీ తప్ప ఇంకెవ్వరూ దృఢమైన ప్రభుత్వాన్ని ఇవ్వలేరు. దేశం సుస్థిర అభివృద్ధి సాధించేందుకు, పార్టీ బలపడేందుకు ఇవే కీలక ఎన్నికలు" అని చెప్పారు. ఆ కూటమికి నాయకుడు లేరు, సిద్ధాంతాలు అసలే లేవని అన్నారు. కేవలం పదవీ కాంక్షే ఆ పార్టీలను ఏకం చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. ఆ పార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్‌లు ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారని అన్నారు.



సమ్మేళనంలో భాజపా ఏపీ, తెలంగాణ శాఖల అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, కె.లక్ష్మణ్, ఇతర నేతలు

పానిపట్టు యుద్ధంలాంటి ఎన్నికలు

వచ్చే ఎన్నికలు మూడో పానిపట్టు యుద్ధంలాంటివని అమిత్ షా సరిపోల్చారు. "శివాజీ ఆధ్వర్యంలో మరాఠాలు దేశంలోని పలు ప్రాంతాల్లో జరిగిన 131 యుద్ధాల్లో విజయం సాధించారు. పానిపట్‌లో జరిగిన ఒకే ఒక్క యుద్ధంలో అఫ్గాన్ల చేతిలో ఓడిపోయారు. ఇది కేవలం ఓటమి కాదు. దేశాన్ని బానిసత్వంలో ముంచిన పరాజయం. ఆ తరువాత 200 ఏళ్ల పాటు దేశం బ్రిటిష పాలనలో మగ్గింది. అందువల్ల ఈ ఎన్నికలు కీలక యుద్ధంలాంటివి. దీర్ఘకాలిక ప్రభావం చూపేవి. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే ఈసారి కేరళ సహా దక్షిణాది రాష్ట్రాల్లో భాజపా ప్రభుత్వాలు ఏర్పాటవుతాయి. 1987 నుంచి మోదీ నాకు తెలుసు. అప్పటి నుంచి ఆయన ఆధ్వర్యంలో జరిగిన ఏ ఒక్క ఎన్నికల్లోనూ పార్టీ ఓడిపోలేదు" అంటూ శ్రేణులకు కర్తవ్యబోధ చేశారు.

రామ మందిరానికి కాంగ్రెస్సే అడ్డు

అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీయే అడ్డంకిగా మారిందని అమిత్ షా ఆరోపించారు. సమస్య పరిష్కారం కాకుండా అడ్డంకులు సృష్టిస్తోందని అన్నారు. "అదే స్థలంలో త్వరగా మందిరం నిర్మించాలని భాజపా కోరుకుంటోంది" అని స్పష్టం చేశారు. న్యాయ ప్రక్రియను కాంగ్రెస్ అడ్డుకుంటోందన్నారు.

కల నెరవేరింది

ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు జనరల్ కేటగిరీలో రిజర్వేషన్లు కల్పించాలన్నది ఎన్నో ఏళ్లుగా ఉన్న డిమాండు అని, ఆ కలను మోదీ నెరవేర్చారని చెప్పారు. ఎన్నో పార్టీలు దీనిని ఎన్నికల ప్రణాళికల్లో పెట్టినా అమలు చేయలేకపోయాయని అన్నారు. చిన్నవ్యాపారులకు జీఎస్టీలో మినహాయింపులు ఇచ్చినందుకు ప్రభుత్వాన్ని అభినందించారు.

మోదీ సమక్షంలో ముస్లిం మహిళ వందేమాతరం ఆలాపన

ప్రధాని మోదీ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లిం రాష్ట్రీయ మంచ్ సభ్యురాలు హీనా ఫరూకీ వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

ఉగ్రవాదం తగ్గింది

మోదీ పాలనలో ఉగ్రవాదం తగ్గిందని షా అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశ భద్రతపై రాజీ పడ్డాయని ఆరోపించారు. "కాంగ్రెస్ పాలనలో దేశానికి రక్షణ లేదు. కానీ సీమాంతర ఉగ్రవాదాన్ని మోదీ ప్రభుత్వం సహించడం లేదు. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం ఇచ్చాం" అని చెప్పారు. అమిత్ షా తన ప్రసంగంలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించారు.

వారణాసిలో ప్రవాస భారతీయుల దినోత్సవాలు

దిల్లీ: ప్రవాస భారతీయుల దినోత్సవాలు ఈసారి ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి నియోజకవర్గంలో జరగనున్నాయి. ఈనెల 21-23 మధ్య వీటిని నిర్వహించనున్నట్లు విదేశీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి వీకే సింగ్ శుక్రవారమిక్కడ వెల్లడించారు. 1915 జనవరి 9న మహాత్మాగాంధీ భారత్‌కు తిరిగి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా అదే రోజున 'ప్రవాసీ భారతీయ దివస్'ను నిర్వహించడం ఆనవాయితీ. అయితే- కుంభమేళా, గణతంత్ర దినోత్సవాల్లో ఎన్ఆర్ఐలు పాల్గొనేందుకు వీలుగా ఈసారి తేదీల్లో మార్పు చేసినట్లు మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇప్పటివరకూ 5 వేల మంది ప్రవాస భారతీయులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. "21న యువజన ప్రవాస భారతీయుల దినోత్సవం జరుగుతుంది. 22న ప్రధాని ఈ వేడుకలను లాంఛనంగా ప్రారంభిస్తారు. మారిషస్ ప్రధాని ప్రవీణ్ జగన్నాథ్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. చివరి రోజు రాష్ట్రపతి కోవింద్ పాల్గొని, ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డులను ప్రదానం చేస్తారు" అని సింగ్ వివరించారు.

మిత్రులు దూరమైన కమలం

- అయిదేళ్లలో ఎన్డీయేను వీడిన 16 రాజకీయ పక్షాలు
- తగిన గౌరవం ఇవ్వడం లేదని ప్రాంతీయ పార్టీల అసంతృప్తి

ఈనాడు, దిల్లీ: "మర్రి చెట్టు నీడన మొక్క మొలవదు... ఈ సామెతను నిజం చేసేలా భాజపా వ్యవహార శైలి ఉంది. కమలం వటవృక్షంగా మారింది" దేశ రాజకీయాలపై ఇవీ కొన్ని పార్టీల నేతల తాజా వ్యాఖ్యానాలు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దిల్లీలో నిర్వహిస్తున్న ఆ పార్టీ జాతీయ మహాసభల సందర్భంగా ఈ వ్యాఖ్యలు వినిపించాయి. 2014 ఎన్నికల సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన గల భాజపాను, ప్రస్తుతం అమిత్ షా ఆధ్వర్యంలోని పార్టీని రాజకీయ వర్గాలు పోల్చిచూస్తున్నాయి. మిత్రపక్షాలతో సవ్యంగా మెలగడం లేదని, ప్రాంతీయ పార్టీల మనుగడను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని అంటున్నాయి. అందుకే గత అయిదేళ్లలో ఎన్డీయే కూటమి నుంచి 16 పార్టీలు వైదొలగాయని గుర్తు చేస్తున్నాయి.

నాటి పరిస్థితి

2014 ఎన్నికల సందర్భంగా ఎన్డీయే కూటమిలో 28 పార్టీలు ఉండేవి. భాజపా సొంతంగా 282 సీట్లు పొందింది. 22 పార్టీలు కలిసి 54 సీట్లు సంపాదించాయి. మిగిలిన ఆరు పార్టీలు ఎలాంటి సీట్లు పొందకపోయినా ఎన్డీయేకు ఓట్లు పడేలా సహకరించాయి. ఎన్నికల తరువాత జమ్ముకశ్మీర్‌కు చెందిన పీడీపీ, బిహార్‌కు చెందిన జేడీయూ, హామ్ వంటి పార్టీలు ఎన్డీయేకు మద్దతు తెలిపాయి. గత ఎన్నికల సందర్భంగా మోదీ అనుకూల పవనాలు వీయడంతో పాటు, అంతే తీవ్రంగా కాంగ్రెస్ వ్యతిరేకతా కనిపించింది. రాజకీయ పరిస్థితులను అంచనా వేసిన లౌకికవాద ప్రాంతీయ పార్టీలు భాజపా వైపు మొగ్గు చూపాయి. గుజరాత్ అల్లర్లలో ఆరోపణలు ఎదుర్కొన్న నరేంద్ర మోదీ ప్రధాని అభ్యర్థి అని తెలిసినా మద్దతు ఇచ్చాయి. క్షేత్రస్థాయిలో హిందుత్వ ఓట్లకు, ప్రాంతీయ పార్టీల ఆధ్వర్యంలోని లౌకిక ఓట్లు కలవడం వల్లనే భాజపా 282 సీట్లు సంపాదించగలిగిందని విశ్లేషకుల అంచనా. అప్పటి భాజపా అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్ అన్ని పార్టీలతో స్నేహపూర్వకంగా మెలగడం బాగా కలిసొచ్చింది.

నేటి పరిస్థితి

2019 లోక్‌సభ ఎన్నికలు వచ్చేసరికి పరిస్థితి బాగా మారింది. వివిధ వర్గాలపై దాడులు జరగడం పలుచోట్ల ప్రాంతీయ పార్టీలపై ప్రభావం చూపించింది. ఫలితంగా గత అయిదేళ్లలో మొత్తం 28 మిత్రపక్షాల్లోనూ 16 పార్టీలు ఎన్డీయేను వీడాయి. రాజ్‌నాథ్ సింగ్ హయాం నాటి స్నేహ హస్తం ప్రస్తుతం కరవయిందని పలువురు నాయకులు అంగీకరిస్తున్నారు. అయితే పాతవారు పోతే కొత్తవారు వస్తారన్న ధోరణిలో భాజపా నాయకులు వ్యవహరిస్తున్నారు.

వీడిన మిత్రపక్షాలు ఇవే

హరియాణా: ప్రాంతీయ పార్టీలను నాశనం చేయడానికి భాజపా యత్నిస్తోందంటూ 2014 అక్టోబరులో హరియాణా జన్‌హిత్ పార్టీ వైదొలగింది.

తమిళనాడు: 2014 డిసెంబరులో వైగో ఆధ్వర్యంలోని ఎండీఎంకే, అనంతరం విజయ్‌కాంత్‌కు చెందిన డీఎండీకే, తరువాత ఎస్.రాందాస్ ఆధ్వర్యంలోని పీఎంకేలు దూరమయ్యాయి.

కేరళ: 2016లో రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, సి.కె.జాను ఆధ్వర్యంలోని జనాధిపత్య రాష్ట్రీయ సభ పార్టీలు కూటమి నుంచి తప్పుకొన్నాయి.

మహారాష్ట్ర: స్వాభిమాన్ పక్ష దూరమయింది.

బిహార్: 2018లో మాజీ ముఖ్యమంత్రి జితన్ రాం మాంఝి ఆధ్వర్యంలోని హిందుస్థాన్ ఆవాం మోర్చా (హామ్), 2018 డిసెంబరులో రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ, అనంతరం వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీలు కూటమిని వీడాయి.

నాగాలాండ్: 2018 ఫిబ్రవరిలో 15 ఏళ్ల అనుబంధాన్ని నాగా పీపుల్స్ ఫ్రంట్ తెంచుకొంది.

ఆంధ్రప్రదేశ్: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వనందుకు 2018 మార్చిలో తెలుగుదేశం పార్టీ ఎన్డీయే నుంచి బయటకు వచ్చింది.

పశ్చిమ బెంగాల్: 2018 మార్చిలో గూర్ఖా జన ముక్తి మోర్చా తప్పుకొంది.

కర్ణాటక: అసెంబ్లీ ఎన్నికల అనంతరం 2018 జూన్‌లో కర్ణాటక ప్రజ్ఞావంత జనతా పార్టీ బయటకు వచ్చింది.

అసోం: అసోం గణతంత్ర పరిషత్ కూటమి నుంచి తప్పుకొంది.

జమ్ము- కశ్మీర్: ఇక్కడ పరిస్థితి వేరుగా ఉంది. అధికారంలోని పీడీపీకి భాజపాయే మద్దతు ఉపసంహరించింది.

ఉత్తర్‌ప్రదేశ్: తమతో సక్రమంగా వ్యవహరించడం లేదన్న కారణంతో కూటమి నుంచి వైదొలగుతామని అప్నాదళ్, సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీలు సంకేతాలు ఇచ్చాయి.

మేఘాలయ: పౌరసత్వ బిల్లు వ్యవహారంలో ఎన్డీయే నుంచి వైదొలగుతామని మేఘాలయ ముఖ్యమంత్రి కొనార్డ్ సంగ్మా ఆధ్వర్యంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ హెచ్చరించింది.




అబుదాబీలో అమానుషం!

గురువారం అబుదాబీలో ఏఎఫ్‌సీ ఆసియా కప్ ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. యూఏఈ బృందం చేతిలో భారత్ పరాజయం పాలైంది. అయితే, ఈ పోటీలకు ముందు ఓ యజమాని... భారత టీంకు మద్దతు పలుకుతున్నారంటూ తన పనివారిని పక్షుల గూటిలో నిర్బంధించాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారింది. దీంతో షార్జా పోలీసులు సదరు యజమానితో పాటు మరికొందరిని అరెస్ట్ చేశారు. అయితే... తాను సరదా కోసమే ఇదంతా చేశానని, తన వద్ద పనిచేసేవారితో 20 ఏళ్లుగా కలిసిమెలిసి జీవిస్తున్నానని నిందితుడు చెప్పినట్లు తెలిసింది.

అత్యయిక స్థితి దిశగా ట్రంప్ అడుగులు!

- సరిహద్దు గోడకు నిధుల కోసమే

వాషింగ్టన్: అమెరికాలో అత్యయిక స్థితి విధించే దిశగా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. మెక్సికోతో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించడంలో కాంగ్రెస్ అనుమతి అవసరం లేకుండా చేసేందుకు ఈ నిర్ణయం వైపు ఆయన మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. అత్యయిక స్థితి విధించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు బుధవారం ప్రకటించిన ట్రంప్ తాజాగా తన హెచ్చరికను పునరుద్ఘాటించారు. దక్షిణాది సరిహద్దు రాష్ట్రం టెక్సాస్‌లో ఆయన గురువారం పర్యటించారు. అక్రమ వలసలను అడ్డుకునేందుకు గోడ అవసరమని స్పష్టం చేశారు. అందుకోసం అవసరమైతే అత్యయిక స్థితి విధించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో న్యాయపరంగా సవాళ్లు ఎదురైనా వెనుకంజ వేయబోమన్నారు. సరిహద్దుల్లో గోడ నిర్మాణం కోసం 5.6 బిలియన్ డాలర్లు కేటాయించాలని ట్రంప్ చేసిన డిమాండ్‌కు కాంగ్రెస్ ససేమిరా అనడంతో ఇటీవల అమెరికా ప్రభుత్వం పాక్షికంగా మూతపడిన సంగతి తెలిసిందే. కాగా... స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఈనెల 21 నుంచి ఐదు రోజులపాటు జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సుకు ట్రంప్ హాజరుకావడం లేదు. ఈ సదస్సులో ప్రసంగించాలని తనకు బలమైన కోరిక ఉన్నా, ప్రభుత్వం మూతపడిన క్రమంలో తన పర్యటనను రద్దు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.



టెక్సాస్ మెక్అలెన్‌లో మాట్లాడుతున్న ట్రంప్



శుక్రవారం అమృత్‌సర్‌లో గాయపడిన పక్షి వేషధారణలో పెటా కార్యకర్త. గాలిపటాలు ఎగరేసేందుకు గాజురజను అద్దిన మాంజా వినియోగించడం పక్షులకు ప్రాణాంతకంగా మారుతోంది. దీంతో ఆ మాంజా వినియోగాన్ని అడ్డుకునేలా ప్రజల్లో అవగాహన పెంచేందుకు పెటా కార్యకర్త ఇలాంటి వేషధారణలో కనిపించారు.

పౌరసత్వ బిల్లుపై అసోంలో నిరసనలు

గువాహటి/ఇంఫాల్: పౌరసత్వ సవరణ బిల్లుపై అసోంలో నిరసనలు కొనసాగుతున్నాయి. బిల్లుకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన సాహితీవేత్త హిరెన్ గొహైన్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఇద్దరు వ్యక్తులు దుస్తులు విప్పి నిరసన తెలిపారు. దిల్లీలో అసోం విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. పార్లమెంటు భవనం ఎదుట అసోంకు చెందిన ఓ బృందం నిరసన తెలిపింది. మరోవైపు దేశద్రోహం కేసు నమోదైన గొహైన్‌తో పాటు, ప్రముఖ ఆర్టీఐ కార్యకర్త అఖిల్ గొగొయి, సీనియర్ పాత్రికేయుడు మంజిత్ మహంతలకు గువాహటి హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. కాగా ఈ ముగ్గురిపై దేశద్రోహం అభియోగాలు మోపడం పట్ల అసోం ప్రభుత్వాన్ని మాజీ సీఎం, కాంగ్రెస్ నేత తరుణ్ గొగొయి దుయ్యబట్టారు. పౌరసత్వ సవరణ బిల్లు పరిధి నుంచి మణిపుర్‌కు మినహాయింపు ఇవ్వాల్సిందిగా కేంద్రాన్ని కోరాలని భాజపా నేతృత్వంలోని ఆ రాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది.

సివిల్స్ పరీక్ష రాసేందుకు అదనంగా మూడు అవకాశాలు!

ఈనాడు, దిల్లీ: జనరల్ కోటాలోని ఆర్థికంగా వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు సివిల్స్ పరీక్ష రాసేందుకు అదనంగా మరో మూడు అవకాశాలు దక్కే అవకాశం ఉంది. వారికి 10% రిజర్వేషన్లను కల్పిస్తూ పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన బిల్లు చట్టంగా మారిన తర్వాత ప్రభుత్వం ఇందుకోసం చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతం సివిల్స్ పరీక్షకు గరిష్ఠ వయోపరిమితి జనరల్ అభ్యర్థులకు 32 ఏళ్లు, ఓబీసీలకు 35 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 37 ఏళ్లుగా ఉంది. జనరల్ అభ్యర్థులు ఆరు సార్లు, ఓబీసీలు తొమ్మిది సార్లకు మించి పరీక్ష రాసే వీలులేదు. జనరల్ కేటగిరీలో ఆర్థికంగా వెనకబడిన వారి వయోపరిమితిని పెంచేందుకు కేంద్రం వచ్చే బడ్జెట్ సమావేశాల్లో మరో బిల్లును తేనున్నట్లు తాజా సమాచారం. ఈ ఉద్దేశంతోనే 14 రోజులపాటు బడ్జెట్ సమావేశాలను నిర్వహించనున్నట్లు ప్రకటించిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఓబీసీలకు వర్తించే నిబంధనలనే జనరల్ కేటగిరీ పేదల విషయంలోనూ పాటించాలని భావిస్తున్నట్లు కేంద్ర మంత్రి ఒకరు తెలిపారు.

ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో చిదంబరం, కార్తీలకు ఊరట

దిల్లీ: ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ వ్యవహారంలో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పి.చిదంబరంతో పాటు ఆయన కుమారుడు కార్తీకి దిల్లీ న్యాయస్థానం శుక్రవారం ఊరట కల్పించింది. సీబీఐ, ఈడీలు దాఖలు చేసిన ఈ కేసుల్లో వీరిద్దరినీ ఫిబ్రవరి 1 వరకు అరెస్టు చేయకుండా వెసులుబాటును పొడిగించింది. ఈ వ్యవహారంలో దర్యాప్తు ఓ కొలిక్కి రావాల్సి ఉందని సీబీఐ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నివేదించడంతో విచారణను న్యాయమూర్తి ఆ తేదీకి వాయిదా వేశారు.

★ శారదా గొలుసుకట్టు కుంభకోణం కేసులో రూ.1.4 కోట్ల మేర ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం భార్య నళినిపై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది.

మళ్లీ పెరిగిన పెట్రోలు ధరలు

దిల్లీ: కొంతకాలంగా తగ్గుముఖం పట్టిన పెట్రోలు ధరలు శుక్రవారం మళ్లీ పెరిగాయి. లీటరు పెట్రోలుపై 19 పైసలు, డీజిల్‌పై 28 పైసలు పెరిగినట్లు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ప్రకటించాయి. దిల్లీలో లీటరు పెట్రోలు ధర రూ.69.07, డీజిల్ ధర 62.81గా నమోదయింది. ముంబయిలో పెట్రోలు రూ.74.72, డీజిల్ రూ.65.73గా పలుకుతోంది. ధరలు పెరగడం ఈ నెలలో ఇది మూడోసారి. ఈ నెలలో లీటరు పెట్రోలుపై 78 పైసలు, డీజిల్‌పై 55 పైసలు పెరిగాయి. గత అక్టోబరు 18 నుంచి దాదాపు ప్రతిరోజూ ధరలు తగ్గాయి. పెట్రోలుకు రూ.68.29, డీజిల్‌కు రూ.62.16 కనిష్ఠ ధరలుగా నమోదయ్యాయి.

ఏదైనా అద్భుతం జరిగితే బాగుంటుంది!

గనిలో చిక్కుకున్నవారిపై సుప్రీంలో కేంద్రం

దిల్లీ: మేఘాలయలోని జయంతియా జిల్లాలో గల లుంతారి గ్రామంలో ఉన్న అక్రమ గనిలో డిసెంబరు 13 నుంచి చిక్కుకుపోయిన పనివారిపై కేంద్రప్రభుత్వం ఆశలు వదిలేసుకున్నట్లు కనిపిస్తోంది. "ఏదో అద్భుతం జరిగితే బాగుండునని భావిస్తున్నాం" అని కేంద్రం తరఫున సుప్రీంకోర్టులో హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యాఖ్యానించారు. చిక్కుకుపోయినవారిని కాపాడటానికి అధికారులు, భారత నావికాదళం, వైమానికదళం అధికారులు శాయశక్తులా కృషి చేస్తున్నారని తెలిపారు. 70అడుగుల లోతైన నీటితో నిండిపోయిన బొగ్గు గనిలో చిక్కుకుపోయిన వారెవరూ ప్రాణాలతో బయటపడే అవకాశాలు లేవని నిపుణులు అభిప్రాయపడుతున్న సంగతి తెలిసిందే. తుషార్ వ్యాఖ్యలపై జస్టిస్ ఎ.కె.సిక్రి, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం స్పందించింది. "చిక్కుకుపోయినవారిని కాపాడటానికి మీ ప్రయత్నం మీరు చేస్తున్నారు. వారు బతికున్నారో, లేదో తెలియదు. మీ ప్రయత్నాలు మీరు చేయండి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఆప్ నాయకురాలు మీరా సన్యాల్ మృతి

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకురాలు, రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మీరా సన్యాల్ (57) శుక్రవారం కన్నుమూశారు. 2014లో లోక్‌సభ ఎన్నికల్లో ఆమె దక్షిణ ముంబయి స్థానం నుంచి పోటీ చేసి, ఓటమి పాలయ్యారు. అంతకుముందు ఆమె బ్యాంకింగ్ రంగంలో 30 ఏళ్ల పాటు సేవలు అందించారు.

డేరాబాబాకు కనీసం జీవిత ఖైదు!

పాత్రికేయుని హత్య కేసులో దోషిగా నిర్ధరణ

పంచకుల: పాత్రికేయుడి హత్య కేసులో డేరా సచ్చా సౌధా అధ్యక్షుడు గుర్మీత్ రామ్‌రహీం సింగ్(డేరా బాబా)ను ప్రత్యేక సీబీఐ న్యాయస్థానం శుక్రవారం దోషిగా తేల్చింది. ఇతనితోపాటు హత్యలో సహకరించిన కుల్‌దీప్‌సింగ్, నిర్మల్‌సింగ్, కృషన్‌లాల్ అనే మరో ముగ్గురు బాబా అనుచరులనూ దోషులుగా నిర్ధరించింది. ఈ కేసులో జనవరి 17న జడ్జి జగ్‌దీప్‌సింగ్ శిక్షను ఖరారు చేయనున్నారు. కనీసం జీవితఖైదు పడే అవకాశం ఉందని న్యాయవాదులు చెబుతున్నారు. ఇద్దరు మహిళా భక్తులపై అత్యాచారం చేసిన ఆరోపణలు రుజువు కావడంతో 2017 నుంచి డేరాబాబా రోహ్‌తక్‌లోని సునరియా జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. హరియాణాలో 'పూరా సచ్' అనే పత్రికలో ఛత్రపతి అనే పాత్రికేయుడు 16ఏళ్ల కిందట మహిళా భక్తులపై డేరా బాబా సాగిస్తున్న లైంగిక దోపిడీని వెలుగులోకి తెస్తూ రాసిన వార్త..2002లో ప్రచురితమైంది. దీంతో పాత్రికేయుడిని అక్టోబరు 2002న కాల్చి చంపారు.

సప్త శిఖరాలపై సగర్వంగా..

ఏడు ఖండాల్లోని ఎత్తైన పర్వతాలు అధిరోహించిన కర్నల్ రణ్‌వీర్ జామ్‌వాల్

దిల్లీ: ప్రపంచంలోని ఏడు ఖండాల్లో గల అత్యంత ఎత్తైన శిఖరాలు అధిరోహించిన మొట్టమొదటి భారతీయ సైనికాధికారిగా కర్నల్ రణ్‌వీర్ జామ్‌వాల్ రికార్డు సృష్టించారు. జనవరి 4న సాయంత్రం 5గంటలకు భారతీయ జాతీయ పతాకాన్ని అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌పై రెపరెపలాడించారు. జనవరి 1న కొండను అధిరోహించడానికి తొమ్మిది మందితో కూడిన బృందం ప్రయత్నించగా, ఉష్ణోగ్రత మైనస్ 37 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడంతో ముగ్గురు మధ్యలోనే విరమించుకున్నారు. రణ్‌వీర్ సహా ఆరుగురు మాత్రమే శిఖరాన్ని అధిరోహించగలిగారు. ఆయన ఇంతకుముందే ప్రపంచం(ఆసియా)లోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్, ఆఫ్రికాలో కిలిమంజారో, ఆస్ట్రేలియాలో కార్‌స్టెంజ్ పిరమిడ్, ఐరోపాలో ఎల్‌బ్రస్, దక్షిణ అమెరికాలో అకాన్కాగో, ఉత్తర అమెరికాలో డినాలి పర్వతాలను అధిరోహించారు. ఇప్పటి వరకు ఆరు ఖండాల్లో 30 సాహసయాత్రలను విజయవంతంగా పూర్తి చేశారు.

- మూడు వేర్వేరు పర్వతారోహకుల బృందాలకు మార్గదర్శకత్వం వహించి, 51 మందిని ఎవరెస్టును అధిరోహించడంలో తోడ్పడిన మొదటి భారతీయుడిగా కూడా ఇంతకుముందు చరిత్ర సృష్టించారు.
- 2015లో నేపాల్‌లో సంభవించిన భూకంపం సందర్భంగా ఎవరెస్టు శిఖరంపై చిక్కుకుపోయిన 60 మంది పర్వతారోహకులను క్షేమంగా ప్రాణాలతో రక్షించగలిగారు.
- మనదేశంలోనే అత్యున్నత సాహస అవార్డు "టెంజింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు"ను పొందారు. ఇది అర్జున అవార్డుతో సమానం. దీంతోపాటు పలు అవార్డులు వచ్చాయి.



కర్నల్ రణ్‌వీర్

● గత 82 ఏళ్లలో ఒక భారత ఆటగాడు క్రమ శిక్షణ చర్యలతో విదేశీ పర్యటన నుంచి అర్ధంతరంగా భారత్‌కు వచ్చేయడం ఇది రెండోసారి మాత్రమే. 1936లో ఓ ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో అదుపు తప్పినందుకు లాలా అమర్‌నాథ్‌ను ఇంగ్లాండ్ నుంచి స్వదేశానికి పంపించారు.



పడింది వేటు

● పాండ్య, రాహుల్‌లపై సస్పెన్షన్ ● టీవీ షోలో అభ్యంతర వ్యాఖ్యల ఫలితం
● విచారణ పూర్తయ్యే వరకు మైదానానికి దూరం
● ఆసీస్‌తో వన్డే సిరీస్ నుంచి ఔట్.. స్వదేశానికి పయనం!

ఒక టీవీ ఛానెల్ టాక్ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లపై బీసీసీఐ కఠిన చర్యలు చేపట్టింది. వీళ్లిద్దరిపై సస్పెన్షన్ వేటు వేసింది. పాండ్య, రాహుల్‌ల వ్యాఖ్యలపై విచారణకు ఆదేశించిన బోర్డు.. అది పూర్తయి తదుపరి చర్యలు చేపట్టే వరకు వీళ్లిద్దరూ మ్యాచ్‌లు ఆడేందుకు వీల్లేదని తేల్చింది. ఇప్పటికే ఒకసారి పాండ్య, రాహుల్‌లకు షోకాజ్ నోటీసులిచ్చిన బీసీసీఐ.. తాజా పరిణామాల నేపథ్యంలో మరోసారి నోటీసులివ్వడం విశేషం. శనివారం ఆస్ట్రేలియాతో ఆరంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌కు దూరమైన వీళ్లిద్దరూ.. స్వదేశానికి పయనం కానున్నారు. ఈ సిరీస్ తర్వాత పాండ్య, రాహుల్ న్యూజిలాండ్ పర్యటనలకు వెళ్లడమూ కష్టమే.

దిల్లీ

బాలీవుడ్ దర్శక నిర్మాత కరణ్ జోహార్ నిర్వహించే టాక్ షో.. భారత యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లను గట్టి దెబ్బే కొట్టింది. ఆ షోలో యధాలాపంగా చేసిన వ్యాఖ్యలు వారి మెడకు చుట్టుకున్నాయి. ఆ వ్యాఖ్యలు ఇద్దరి కెరీర్లనే ప్రభావం చేసే పరిస్థితి తలెత్తింది. రాహుల్, పాండ్యలకు అమ్మాయిలతో సంబంధాలపై కరణ్ అడిగిన కొన్ని ప్రశ్నలు.. వాటికి ఇద్దరూ ఇచ్చిన సమాధానాలపై సామాజిక మాధ్యమాల్లో కొన్ని రోజులుగా దుమారం రేగుతున్న సంగతి తెలిసిందే. వీరి వ్యాఖ్యలు భారత క్రికెట్ ప్రతిష్టనే దెబ్బ తీసేలా ఉండటంతో బీసీసీఐ కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇప్పటికే పాండ్య, రాహుల్‌లకు బోర్డు షోకాజ్ నోటీసులు ఇవ్వగా.. ఇద్దరూ క్షమాపణ చెబుతూ వివరణ కూడా ఇచ్చారు. కానీ అంతటితో వ్యవహారం సమసిపోలేదు. బీసీసీఐ న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకున్న అనంతరం పాలకుల కమిటీ (సీఓఏ) మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని నిర్ణయించింది. అది పూర్తయ్యే వరకు పాండ్య, రాహుల్‌లపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించింది. విచారణ పూర్తయి నివేదిక రావడానికి రెండు వారాల సమయం పట్టే అవకాశముండటంతో ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ మొత్తానికి వీళ్లిద్దరూ దూరమయ్యారు. పాండ్య, రాహుల్ వెంటనే స్వదేశానికి వచ్చేయాలని బీసీసీఐ ఆదేశించడంతో.. శనివారమే విమానం ఎక్కనున్నట్లు సమాచారం. ఆసీస్‌తో వన్డే సిరీస్ ఈ నెల 18న ముగియనుండగా.. తర్వాత భారత జట్టు న్యూజిలాండ్‌కు వెళ్లనుంది. ఈ నెల 23న కివీస్‌తో ఆరంభమయ్యే వన్డే సిరీస్‌లోనూ వీరు ఆడటం సందేహమే. మరోవైపు ఇంతటి వివాదానికి కారణమైన పాండ్య, రాహుల్‌ల టీవీ షో ఎపిసోడ్‌కు సంబంధించిన వీడియోను దాన్ని డిజిటల్ మాధ్యమాల నుంచి తొలగించారు.

ఈ నిర్ణయం వెనుక..: పాండ్య, రాహుల్‌లపై సస్పెన్షన్ పడటం బీసీసీఐ పాలకుల కమిటీ (సీఓఏ) సభ్యురాలు డయానా ఎడుల్జీ కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. వీళ్లిద్దరూ మైదానం అవతల, పైగా ఆటేతర విషయాలపై మాట్లాడిన నేపథ్యంలో బీసీసీఐ ప్రవర్తన నియమావళిని మీరినట్లు కాదని, దాని ప్రకారం వారిని శిక్షించడానికి వీల్లేదని బోర్డు న్యాయ నిపుణులు పేర్కొన్నట్లు తెలిసింది. ఐతే వీరిపై కఠిన చర్యలు చేపట్టాలని వారు సూచించినట్లు సమాచారం. కొంత కాలంగా ఎడుల్జీతో పలు విషయాల్లో విభేదిస్తున్న వినోద్ రాయ్.. ఈ విషయంలో మాత్రం ఆమెకు మద్దతు పలికాడు. సస్పెన్షన్ వల్ల వీళ్లిద్దరూ ఆస్ట్రేలియా సిరీస్‌కు దూరమైన నేపథ్యంలో శిక్షను ఈ మూడు వన్డేలకే సరిపెడతారా.. వారిని మరిన్ని మ్యాచ్‌లకు దూరం పెడతారా అన్నది తేలాల్సి ఉంది.

ప్రపంచకప్ అవకాశాలూ సంక్లిష్టం: టీవీ షోలో వ్యాఖ్యలకు సంబంధించిన వివాదం హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌ల కెరీర్లను దెబ్బ తీసేలా ఉంది. తాజా పరిణామాల నేపథ్యంలో వీళ్లిద్దరూ ప్రతిష్టాత్మక వన్డే ప్రపంచకప్‌లో ఆడటం సందేహంగా మారింది. కొంత కాలంగా వీరి ఫామ్ ఏమంత గొప్పగా లేదు. రాహుల్ వరుస వైఫల్యాలతో, నిలకడ లేమితో జట్టులో చోటును ప్రశ్నార్థకం చేసుకున్నాడు. ఆసీస్‌తో వన్డేలకు జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ.. తుది జట్టులో అవకాశం సందేహంగానే ఉంది. అవకాశం దక్కితే సత్తా చాటి ప్రపంచకప్ బెర్తు సాధించాలని రాహుల్ భావిస్తున్నాడు. ఇక పాండ్య ఫామ్ కూడా అంతంతమాత్రంగా ఉండగా.. ఫిట్‌నెస్ సమస్యలు కూడా తోడై కొన్ని నెలలుగా టీమ్‌ఇండియాకు దూరంగా ఉన్నాడు. రాబోయే రెండు వన్డే సిరీస్‌ల్లో ఫామ్, ఫిట్‌నెస్ చాటుకోవాలని ఆశిస్తున్నాడు. ప్రపంచకప్ ముంగిట కీలకమైన సిరీస్‌లకు దూరం కావడంతో ఆ మెగా టోర్నీకి వీరిద్దరి ఎంపిక సందేహంగానే మారింది.

"భారత జట్టు దృష్టి కోణంలో చూస్తే.. అలాంటి అభ్యంతరకర వ్యాఖ్యల్ని కచ్చితంగా సమర్థించం. ఇదే విషయాన్ని ఆ ఇద్దరు ఆటగాళ్లకు కూడా స్పష్టం చేశాం. వారివి వ్యక్తిగత అభిప్రాయాలు. తప్పు జరిగిందని వాళ్లిద్దరూ భావించారు. జరిగిన పరిణామాల్ని అర్థం చేసుకున్నారు"
– కోహ్లి



"అలాంటి మాటలు మనం స్నేహితులతో కూడా మాట్లాడం. అలాంటిది వాళ్లిద్దరూ టీవీలో కూర్చుని అలాంటి వ్యాఖ్యలు చేశారు. దీంతో ఇప్పుడు జనాలు హర్భజన్ కూడా ఇలాంటి వాడేనా.. కుంబ్లే, సచిన్ కూడా ఈ తరహానేనా అని మాట్లాడుకునే అవకాశముంది. బీసీసీఐ వీరిపై తీసుకున్న చర్యలు సరైనవే.
– హర్భజన్ సింగ్

"విచారణ పూర్తయ్యే వరకు పాండ్య, రాహుల్ సస్పెన్షన్‌లో ఉంటారు. బీసీసీఐ అంతర్గత కమిటీ లేదా అడ్‌హక్ అంబుడ్స్‌మన్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుంది. ఇంకా కమిటీని ఏర్పాటు చేయలేదు"
– వినోద్ రాయ్, బీసీసీఐ పాలకుల కమిటీ ఛైర్మన్

రిటైరయ్యాక బ్యాటు పట్టను: కోహ్లి

సిడ్నీ: తాను క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన రోజు నుంచి మళ్లీ బ్యాట్ పట్టబోనని టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. చాలామంది క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరయ్యాక టీ20 లీగ్‌ల్లో కొనసాగుతున్నారు. డివిలియర్స్, మెక్‌కలమ్ లాంటి ఆటగాళ్లు ఇందుకు ఉదాహరణ. మీరు కూడా ఈ జాబితాలో చేరతారా అని కోహ్లిని అడిగితే అందుకు అవకాశమే లేదన్నాడు. ''ఇప్పుడే చెబుతున్నా. భవిష్యత్తులో కూడా నా ఆలోచన మారదు. గత ఐదేళ్లలో నేను చాలా క్రికెట్ ఆడాను. నేను రిటైరవ్వాలని నిర్ణయించుకుంటే ఇక మళ్లీ బ్యాట పట్టను. నా కథ ముగిసిందంటే.. ముగిసినట్లే. తర్వాత తెరపై ఉండను'' అని చెప్పాడు.




ఆస్ట్రేలియన్ ఓపెనే ఆఖరు!

టెన్నిస్‌కు ముర్రే వీడ్కోలు

మెల్‌బోర్న్: నిత్యం గాయాలతో సహవాసం చేస్తున్న బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే టెన్నిస్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం నుంచి ఆరంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెనే 31 ఏళ్ల ముర్రేకు ఆఖరి టోర్నమెంట్. "నా పరిధుల మేరకే ఇన్నాళ్లూ ఆడుతూ వస్తున్నా. కానీ గాయాల నొప్పిని భరించలేకపోతున్నా. అందుకే శిక్షణలో కానీ టోర్నీల్లో కానీ పాల్గొనలేకపోతున్నా. చివరిగా వింబుల్డన్ టోర్నీలోనే ఆడా. ఆ టోర్నీతోనే కెరీర్ ముగిద్దామనుకున్నా. కానీ అక్కడ వరకు ఆటను కొనసాగించే పరిస్థితి లేదు. చాలా కాలంగా గాయాల నొప్పిని భరిస్తున్నా.. ఇక భరించలేను" అని ముర్రే ఉద్వేగంగా పేర్కొన్నాడు. పుష్కర కాలంగా ఫెదరర్, నాదల్, జకోవిచ్‌తో కలిసి బిగ్‌ఫోర్‌గా కొనసాగిన ముర్రే.. కెరీర్‌లో మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు కొట్టాడు. 2012లో యుఎస్ ఓపెన్ గెలిచిన ఈ బ్రిటన్ స్టార్.. 2016లో వింబుల్డన్‌తో పాటు ఫ్రెంచ్ ఓపెన్‌నూ కైవసం చేసుకున్నాడు. తర్వాత గాయాలతో కనుమరుగైన ముర్రే.. మళ్లీ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించలేకపోయాడు. 2018లో యుఎస్ ఓపెన్లో మాత్రమే పాల్గొన్న ముర్రే... రెండో రౌండ్లోనే ఇంటిముఖం పట్టాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్లో ఏకంగా ఐదుసార్లు ఫైనల్ చేరినా టైటిల్ గెలవలేకపోవడం ముర్రేకు తీవ్ర నిరాశ కలిగించే విషయం.

మెయిన్‌డ్రాకు ప్రజ్నేశ్



మెల్‌బోర్న్: భారత యువ ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ సింగిల్స్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. శుక్రవారం జరిగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్లో ప్రజ్నేశ్ 6-7 (5), 6-4, 6-4తో యొసుకె వాటాంకి (జపాన్)ను ఓడించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలి రౌండ్లో అన్‌సీడెడ్ టియాఫో (అమెరికా)తో ప్రజ్నేశ్ తలపడతాడు. గత ఐదేళ్లలో గ్రాండ్‌స్లామ్ టోర్నీ మెయిన్ డ్రాకు అర్హత సాధించిన మూడో భారత ఆటగాడు ప్రజ్నేశ్.

భారత్‌కు ఎదురుందా?

ఆస్ట్రేలియాతో తొలి వన్డే నేడు | **ఉదయం 7.50 నుంచి సోని నెట్‌వర్క్‌లో**

ప్రపంచకప్ సన్నాహంలో ఆఖరి దశ షురూ! టెస్టు సమరంలో కంగారూలను మట్టికరిపించిన టీమ్ ఇండియా రెట్టించిన ఉత్సాహంతో వన్డే సిరీస్‌కు సన్నద్ధమైంది. అన్ని విభాగాల్లో పటిష్టంగా ఉన్న కోహ్లీసేనను అడ్డుకోవడం ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన ఆతిథ్య జట్టుకు పెను సవాలే.



సిడ్నీ

అత్యుత్తమ ఫామ్‌తో ప్రపంచకప్‌లో అడుగు పెట్టాలనుకుంటున్న కోహ్లీసేన ఆ టోర్నీకి ముందు ఉన్న కొన్ని మ్యాచ్‌లను సద్వినియోగం చేసుకోవాలనుకుంటోంది. ఈ నేపథ్యంలో ఆసీస్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. శనివారమే తొలి వన్డే. ఐతే సస్పెన్షన్ కారణంగా హార్దిక్ పాండ్య, రాహుల్ పోటీకి దూరమయ్యారు. అందుబాటులో ఉంటే పాండ్య కచ్చితంగా తుది జట్టులో ఉండేవాడే. ఐతే పేలవ ఫామ్, స్థిరపడ్డ ఓపెనింగ్ జంట రోహిత్, ధావన్‌ల కారణంగా రాహుల్‌కు ఎలాగూ తుది జట్టులో స్థానం లభించేది కాదు. ఆల్‌రౌండర్‌గా జట్టుకు సమతూకాన్నిచ్చే పాండ్య లేకపోవడం భారత్‌కు ప్రతికూలాంశమే. పాండ్య దూరం కావడంతో బౌలింగ్ కూర్పులో మార్పులు అనివార్యమయ్యాయి. సెలక్టర్లు ఇప్పటికే బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతినిచ్చిన సంగతి తెలిసిందే. భారత్ ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశముంది. అప్పుడు భువనేశ్వర్‌తో పాటు ఖలీల్, షమి పేస్ బాధ్యతలు పంచుకుంటారు. పాండ్య గైర్హాజరీలో జడేజా ఆల్‌రౌండర్‌గా జట్టులోకి వస్తాడని కోహ్లి ఇప్పటికే చెప్పాడు. అతడు కుల్‌దీప్ యాదవ్‌తో కలిసి స్పిన్ విభాగాన్ని చూసుకుంటాడు. బౌలింగ్‌లో అవసరమైతే పార్ట్ టైమర్ కేదార్ జాదవ్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు. ఇక బ్యాటింగ్‌లో మూడో స్థానంలో కోహ్లి భారత్‌కు కొండంత అండ. రాయుడు, జాదవ్, ధోనీలతో మిడిల్ ఆర్డర్ కూడా బాగానే కనిపిస్తోంది. ఐతే ధోని ఫామ్‌ను అందుకోవాల్సి వుంది. అతడు తన గత 20 వన్డేల్లో కేవలం 25 సగటుతో 275 పరుగులు మాత్రమే చేశాడు. రాయుడు ఫామ్ మాత్రం భారత్‌కు సంతోషాన్నిచ్చే విషయమే. గత 11 వన్డేల్లో అతడు 56 సగటుతో 392 పరుగుల సాధించాడు. ఐతే ఇప్పుడు ఆస్ట్రేలియాలో భిన్న పరిస్థితుల్లో అతడెలా రాణిస్తాడన్నది ఆసక్తికరం. మొత్తం మిడిల్ ఆర్డర్ నుంచి టీమ్ ఇండియా మెరుగైన ప్రదర్శన ఆశిస్తోంది. మరోవైపు ఇటీవల కాలంలో బాగా బలహీనపడ్డ ఆస్ట్రేలియా.. తీవ్ర విమర్శల మధ్య సిరీస్‌లో అడుగుపెడుతోంది. స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్‌లకు సెలక్టర్లు విశ్రాంతి కల్పించడం ఆతిథ్య జట్టును మరింతగా పరీక్షించనుంది. ఆసీస్ ఇప్పటికే తొలి వన్డేకు తుది జట్టును ప్రకటించింది. పేస్ విభాగం అంత బలంగా లేదు. పీటర్ సిడిల్ 2010 తర్వాత తొలిసారి వన్డే మ్యాచ్ ఆడనున్నాడు. ఎడమచేతి వాటం పేసర్ జేసన్ బెహ్రెండార్ఫ్ అరంగేట్రం చేయనున్నాడు. ఆసీస్‌కు లోతైన బ్యాటింగ్ లైనప్ ఉంది. స్టాయినిస్, మాక్స్‌వెల్‌లు ఆరు, ఏడో స్థానాల్లో బ్యాటింగ్‌కు రానున్నారు. ఐతే బలంగా ఉన్న భారత బౌలింగ్ దళాన్ని వాళ్లెలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరం.

16
భారత్, ఆస్ట్రేలియా మధ్య సిడ్నీలో జరిగిన వన్డేలు. ఇందులో భారత్ రెండే గెలిచింది. 2016లో 331 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి నెగ్గింది.

వన్డే సిరీస్ 3-0తో గెలుస్తారు

డీన్ జోన్స్

కంగారూ గడ్డపై తొలి టెస్టు సిరీస్ నెగ్గి టీమ్‌ఇండియా చరిత్ర సృష్టించడంతో భారతీయులంతా గర్వపడ్డారు. భారత్ ఆటతీరును ఆస్ట్రేలియా అభిమానులూ ఆస్వాదించారు. వన్డే సిరీస్‌లో కూడా భారత్ 3-0తో మరోసారి ఆస్ట్రేలియాపై గెలుస్తుందనుకుంటున్నా. వన్డే జట్టు ఎంపిక విషయంలో ఆస్ట్రేలియా సెలక్టర్లు మూర్ఖంగా ప్రవర్తించారు. ప్రధాన బౌలర్లు స్టార్క్, హేజిల్‌వుడ్, కమిన్స్‌లకు ఎందుకు విశ్రాంతినిచ్చారో అర్థం కావట్లేదు? ముగ్గురిలో ఒక్కరినే పక్కనపెడతారనుకున్నా. షార్ట్, క్రిస్ లీన్‌ను తప్పించి ఖవాజా, హ్యాండ్స్‌కాంబ్‌లను జట్టులోకి తీసుకున్నారు. కోచ్‌లు, సెలక్టర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తూ ప్రపంచకప్ ప్రణాళికలను బయటపెడుతున్నారు. ఆస్ట్రేలియా ఒక్క విభాగంలో కూడా పటిష్ఠంగా కనిపించడం లేదు. భారత్, ఆస్ట్రేలియా ప్రపంచకప్ ఫేవరేట్లుగా కనిపిస్తున్నాయి. కానీ కప్పును నిలబెట్టుకోవాలంటే ఆస్ట్రేలియా తీవ్రంగా శ్రమించాల్సిందే.

అసలు పరీక్ష వాళ్లకే..

వీవీఎస్ లక్ష్మణ్

ప్రపంచకప్ ముందు టీమ్‌ఇండియా 13 వన్డేలు మాత్రమే ఆడనున్న నేపథ్యంలో ప్రతి మ్యాచ్ కీలకమైందే. దాంతో పాటు ఆటగాళ్లందరూ ఫిట్‌గా, ఫామ్‌లో ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉంది. శిఖర్, రోహిత్, కోహ్లి పైనే అందరి కళ్లున్నాయి. నాకు మాత్రం మిడిలార్డర్ బ్యాట్స్‌మన్‌కు అవకాశం వస్తే వాళ్లు ఎలాంటి ప్రదర్శన చేస్తారో చూడాలని ఉంది. స్వదేశంలో విండీస్‌తో సిరీస్‌లో రాణించి రాయుడు నాలుగో స్థానాన్ని సొంతం చేసుకున్నట్లే కనిపిస్తున్నాడు. మిగతా మిడిలార్డర్ బ్యాట్స్‌మన్‌కు ఈ సిరీస్ పరీక్షే. ఎందుకంటే వారు కేవలం పరుగులు చేయడమే కాదు మ్యాచ్‌లు గెలిపించేందుకు కృషి చేయాలి. మొదట బ్యాటింగ్‌లోనైనా, ఛేదనలోనైనా ఇన్నింగ్స్‌ను ఎలా ముగించాలి అనే విషయంపై దృష్టి పెట్టాలి. బుమ్రా గైర్హాజరీతో పేస్ విభాగం ఎలా రాణిస్తుందో చూడాలి. బౌలింగ్‌లో భారత్ ఎలాంటి కూర్పులను ప్రయత్నిస్తుందోనన్నది ఆసక్తికరం.

పీబీఎల్ ఫైనల్లో బెంగళూరు

సెమీస్‌లో అవధెపై విజయం

బెంగళూరు: కీలక మ్యాచ్‌లో బెంగళూరు రాప్టర్స్ అదరగొట్టింది. కెప్టెన్ కిదాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్ విజయాలు సాధించడంతో ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ నాలుగో సీజన్‌లో ఆ జట్టు టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. శుక్రవారం జరిగిన సెమీస్‌లో బెంగళూరు 4-2 తేడాతో అవధె వారియర్స్‌ను ఓడించి ఫైనల్లోకి ప్రవేశించింది. అవధె ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకొన్న మిక్స్‌డ్ డబుల్స్‌లో క్రిస్టియాన్సెన్- అశ్విని పొన్నప్ప జోడీ 15-7, 15-10తో ఎలీస్- స్మిత్ జంటపై నెగ్గి జట్టుకు శుభారంభాన్ని అందించింది. అయితే ఆ తర్వాత వరుసగా జరిగిన రెండు పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ల్లో ప్రణీత్ 15-9, 15-4తో లీ డాంగ్‌పై, శ్రీకాంత్ 15-7, 15-10తో సన్ వాన్‌పై గెలిచారు. దాంతో స్కోరు 2-2తో సమమైంది. బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌గా ఎన్నుకొన్న పురుషుల డబుల్స్‌లో మహమ్మద్- హెంద్రా జోడీ 15-14, 15-9తో క్రిస్టియాన్సెన్- లీ జంటపై నెగ్గడంతో ఆ జట్టు విజయం ఖరారైంది. శనివారం జరిగే మరో సెమీస్‌లో ముంబయి రాకెట్స్‌తో హైదరాబాద్ హంటర్స్ తలపడనుంది.



పీబీఎల్‌లో ఈనాడు (సెమీస్)
హైదరాబాద్ × ముంబయి (రాత్రి 7 నుంచి)

దక్షిణాఫ్రికా 132/1 నుంచి 262 ఆలౌట్

జోహానెస్‌బర్గ్: పాకిస్థాన్‌తో మూడో టెస్టులో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 262 పరుగులకే ఆలౌటైంది. శుక్రవారం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సఫారీ జట్టు..6 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. అయితే మార్‌క్రమ్ (90; 124 బంతుల్లో 16×4), ఆమ్లా (41; 98 బంతుల్లో 6×4) ఆదుకోవడంతో ఆ జట్టు 132/1తో మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే పాక్ బౌలర్లు విజృంభించడంతో క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన సఫారీ జట్టు.. మరో 130 పరుగులు మాత్రమే జోడించి మిగిలిన 9 వికెట్లు చేజార్చుకుంది. డిబ్రుయిన్ (49), హంజా (41) రాణించినా కీలక సమయంలో వెనుదిరగడంతో దక్షిణాఫ్రికా కోలుకోలేకపోయింది. పాక్ బౌలర్లలో అష్రాఫ్ మూడు వికెట్లు తీయగా.. ఆమిర్, అబ్బాస్, హసన్ అలీ తలో రెండు వికెట్లు కూల్చారు. అనంతరం పాక్ కూడా బ్యాటింగ్‌లో తడబడింది. తొలిరోజు ఆట ఆఖరుకు తొలి ఇన్నింగ్స్‌లో 17/2తో నిలిచింది. ఇమాముల్ హక్ (10), మహ్మద్ అబ్బాస్ (0) క్రీజులో ఉన్నారు.



మార్‌క్రమ్ (90)

చారిత్రక నిర్మాణాలను పరిరక్షించాలి: అర్వింద్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలను గుర్తించి, వాటి పునర్నిర్మాణానికి, పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన పురావస్తుశాఖ డైరెక్టర్ విశాలాచ్చి, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణాలకు కంచె వేయడంతోపాటు, ఆ ప్రాంతాలను పరిశుభ్రం చేసి విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. బోధన్‌లోని దేవల్ మసీదు, నిజామాబాద్‌లోని ఖిలారామాలయం, డిచ్‌పల్లిలో రామ్‌దేవాలయం, జగిత్యాల కోట, కొలనుపాక జైన్‌దేవాలయం వంటి కట్టడాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. త్వరలో తాను ఈ ప్రదేశాలను సందర్శించనున్నట్లు చెప్పారు.

ధరలు తగ్గిస్తున్న దళారులు

ఈనాడు, హైదరాబాద్: పంటలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర ఇవ్వకుండా క్వింటాలుకు రూ.200 నుంచి రూ.400వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్న మార్కెట్‌లోని దళారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం ప్రభుత్వాన్ని కోరింది. వరి, పత్తి, కందులు, మొక్కజొన్న పంటలు మార్కెట్‌కు వస్తున్న తరుణంలో రైతులు దోపిడికి గురవుతున్నారని సంఘం ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, కార్యదర్శి టి.సాగర్ ఒక ప్రకటనలో వివరించారు. అన్ని వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

పొట్టనొప్పి అంటోంది!

మా అమ్మకు 60 సంవత్సరాలు. ఈ మధ్య తరచూ పొట్ట నొప్పితో బాధపడుతోంది. దానికితోడు అప్పుడప్పుడూ రక్తస్రావం కూడా కనిపిస్తోందని చెబుతోంది. ఇలా ఎందుకు అవుతోంది. దీనికి ఏవయినా కారణాలు ఉన్నాయా. ఇప్పటి వరకూ అయితే వైద్యుల దగ్గరకు వెళ్లలేదు. ఏం చేయమంటారు?

– ఓ సోదరి

డియర్ వసుంధర



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

మీ అమ్మగారి వయసు 60 సంవత్సరాలు అంటున్నారు. అంటే ఇప్పటికే నెలసరి ఆగిపోయి ఉండొచ్చు. సాధారణంగా మెనోపాజ్ దాటిన తరువాత ఏడాదికోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలంటారు. మీరు ఇంకా చేయించినట్లు లేదు. నెలసరి ఆగిపోయిన ఏడాది, రెండేళ్ల తరువాత ఇలా కొద్దిగా రక్తస్రావం కనిపించినా, పొట్ట నొప్పి ఉన్నా నిర్లక్ష్యం చేయకూడదు. ఆవిడకి రెండు సమస్యలు ఉన్నాయి కాబట్టి డాక్టర్ దగ్గరకు వెళ్తే కొన్ని పరీక్షలు చేస్తారు. మొదట వ్యక్తిగత పరీక్షలు అయ్యాక పాప్‌స్మియర్ కూడా చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత అల్ట్రాసౌండ్ స్కాన్ నిర్వహిస్తారు. దీని ద్వారా గర్భాశయం లోపలి పొర ఎంత మందంగా ఉందనేది గమనించడంతోపాటు ఇతర సమస్యలు ఏవైనా ఉన్నాయా అనేది పరిగణిస్తారు. గర్భాశయంతోపాటు అండాశయాలు, ఫెల్లోపియన్ ట్యూబుల పనితీరు ఎలా ఉందనేదీ తెలుసుకుంటారు. అలాగే అవసరం అనుకుంటే హిస్టెరోస్కోపీ చేసి గర్భాశయం లోపలి పొరను, గర్భాశయ ముఖద్వారం నుంచి చిన్న భాగాలను సేకరించి బయాప్సీకి పంపిస్తారు. ఆ రిపోర్టులను బట్టి సమస్యను అంచనా వేస్తారు. ఆ తరువాతే చికిత్స ఉంటుంది. అవసరం అనుకుంటే చికిత్సలో భాగంగా గర్భాశయం, అండాశయం వంటివి తొలగిస్తారు. ఒకవేళ క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే దానికి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి నిర్లక్ష్యం చేయకపోవడమే మంచిది.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

సులువుగా మార్చేద్దాం

సౌందర్య ఉత్పత్తులు కొన్నిరోజులు వాడాక పొడి బారడం, విరిగిపోవడం వంటివి జరుగుతుంటాయి. అలాగని పారేయాల్సిన అవసరంలేదు. ఇలా చేసి చూడండి.



లిప్‌స్టిక్: ఇది కొన్నిసార్లు తేమ కోల్పోయి గట్టిగా అయిపోతుంది. రంగు మారిపోతుంది. అలాంటప్పుడు దీన్ని కొద్దిగా వేడిచేసి, అరగంట ఫ్రిజ్‌లో ఉంచితే చాలు. మృదువుగా మారడంతో పాటు మంచి రంగూ కనిపిస్తుంది.

ఐలైనర్- మస్కారా: సీసా నిండా మస్కారా ఉన్నా అది కొన్నిసార్లు వాడటానికి పనికిరాదు. కారణం పొడిబారిపోవడమే. ఇలాంటప్పుడు ఒక చుక్క బాదం నూనెను వేసి బాగా కలపాలి. ఆ తరవాత వాడుకోవచ్చు.

గోళ్లరంగు: ఇది ఎండిపోయినప్పుడు... మూడు నాలుగు చుక్కలు నెయిల్‌పాలిష్ రిమూవర్ కలిపి చూడండి. సులువుగా వేసుకోవచ్చు.

కాంపాక్ట్ పౌడర్: సగం వాడాక ఎండిపోయి విరిగిపోయినట్లు అవుతుంది. ఇలాంటప్పుడు దానికి కొద్దిగా రబ్బింగ్ ఆల్కహాల్ కలిపితే చాలు.

పిల్లలు - పెంపకం



పండగ వస్తోందంటే ఏం పిండి వంటలు చేద్దాం... ఎవరెవరిని పిలవాలి లేదా ఎక్కడికి వెళ్లాలి... ఎలా ఆనందించాలనే ఆలోచిస్తాం కదూ...! మరి పిల్లల సంగతీ? వాళ్లకు ఏవో ఒక కొత్త దుస్తులు వేసి, చక్కగా తయారుచేసి వండినవన్నీ పెడితే చాలదా అని అనకండి. చాలదు. పిల్లలకీ మన పండగలు, సంస్కృతీ సంప్రదాయాల గురించి తెలియాలి. అవి చెప్పడం మన బాధ్యతే! అందుకు మన వంతుగా ఏం చేయాలో చూద్దామా...

పండగే ఓ పాఠం!

బడినుంచి రాగానే పిల్లలకు ఓ షార్టు వేస్తాం. అమ్మాయిలకైతే లెగ్గింగ్, త్రీఫోర్త్ ప్యాంటు, ఓ టాప్ వేసి వదిలేస్తాం. ఇక, పిల్లలు రోజూ తినే ఆహారం కూడా చిప్స్, శాండ్‌విచ్, పప్పన్నం, బిర్యానీలతోనే గడుస్తుంది. చాలా ఇళ్లల్లో చిరుతిళ్లంటే బయట నుంచి కొనితెచ్చేవే. అందుకే సాధారణ రోజులకి, పండగలకీ గల తేడా వాళ్లకు ఇప్పుడైనా తెలియజేద్దాం. తినే ఆహారం నుంచి వేసుకునే దుస్తుల వరకూ మార్పు తెద్దాం. సాధారణ దినచర్యకు, టెక్నాలజీ ప్రపంచానికి దూరంగా ఉంచుదాం. వీటన్నింటితోపాటు పండగ పత్యేకత తెలియజేయడం కూడా తప్పనిసరే.

అచ్చంగా సంప్రదాయ దుస్తులే...

సాధారణంగా మనం పిల్లలకు సౌకర్యంగా ఉండే దుస్తులే ఎంచుకుంటాం. లెగ్గింగ్‌లు, జీన్స్‌లు, నైట్‌డ్రెస్‌లు, టాప్స్, టీషర్టుల్లాంటి వాటినే వేస్తాం. పండగలకి కూడా అలాంటివే ఎంచుకుంటారు కొందరు. కానీ వద్దు. వీలైనంతవరకూ సంప్రదాయ దుస్తులకే ప్రాధాన్యం ఇచ్చి చూడండి. అమ్మాయిలయితే పరికిణీలు, గాగ్రాలు, పొడవాటి గౌన్లు, చుడీదార్‌లాంటి వాటిని వేయండి. అప్పుడే వీటిమీదకు గాజులు, గొలుసులు, పాపిటబిళ్ల, జడకుప్పెలు... అంటూ ఎన్నో పెట్టొచ్చు. మన సరదాలు తీర్చుకోవచ్చు. అబ్బాయిలకు ప్యాంట్లే వేయాలని లేదు. వాళ్ల వయసుకు తగినట్లుగా ధోతీ, పంచెలు అందుబాటులోకి వచ్చాయి. రెడీమేడ్‌గానూ దొరుకుతున్నాయి. అవి కూడా ఎంత సౌకర్యంగా ఉంటున్నాయో చెబుతూనే, ఆ దుస్తుల వల్ల వచ్చే అదనపు అందాన్ని వివరిస్తే పిల్లలు అర్థం చేసుకుంటారు.



పిండివంటలు వండి...

స్త్రీ, పురుషులిద్దరూ ఉద్యోగాలు చేస్తోన్న రోజులివి. దాంతో దేనికీ సమయం ఉండదనేది వాస్తవమే. అయినప్పటికీ పండగల సమయంలో తీరిక చేసుకోండి. ముందే ఎంతోకొంత ఇల్లు సర్దుకుంటాం కాబట్టి... పిండివంటలు వీలైనంతవరకూ ఇంట్లోనే తయారు చేయండి. అరిసెలు, సకినాలు, మైసూర్ పాక్, బూందీలడ్డూల్లాంటివే అవసరంలేదు. సులువుగా, తక్కువ సమయంలో పూర్తయ్యే వంటకాలను ఎంచుకోండి. జంతికలు, మైదా బిస్కెట్లు, రవ్వలడ్లు, నువ్వుల లడ్లు... వంటివి చేయడం కూడా సులువే. వీటిని చేసి పెడితే సెలవుల్లో ఇంట్లో ఉండే పిల్లలు అడిగినప్పుడల్లా చేతికివ్వొచ్చు. పైగా ఈ సంప్రదాయ చిరుతిళ్ల నుంచి అందే పోషకాలు వాళ్ల ఆరోగ్యానికి మేలుచేస్తాయి. పండగ పూర్తయ్యేవరకూ బయటి చిరుతిళ్లు బంద్ అనే నియమాన్ని పెట్టి చూడండి. మొదట మొండికేసినా మాట వింటారు.

సంస్కృతి తెలిసేలా...

దీపావళి, వినాయక చవితి వంటివి పిల్లలకు ఇట్టే అర్థమైపోతాయి. మరి రాబోతున్న సంక్రాంతి గురించీ పిల్లలకు తెలియాలిగా... కొత్త పంట చేతికొచ్చే వేళ, రైతులు సంతోషంగా జరుపుకొనే ఈ పండగ గురించి కాస్త ప్రత్యేకంగా వివరించండి. పండగకు సంబంధించిన ప్రతి పనిలో పిల్లల్ని భాగస్వాముల్ని చేయండి. మీరు ముగ్గు వేస్తోంటే, మీ అమ్మాయిని అందులో రంగులు నింపమని చెప్పండి. వాళ్లచేత భోగిమంటలు వేయించడం, గొబ్బెమ్మలు పెట్టించడం, ఇంటి అలంకరణలో భాగం చేయడం... ఇలాగన్నమాట. అలాగే ఎవరైనా భోగిపళ్ల కార్యక్రమానికి ఆహ్వానిస్తే పిల్లల్ని కచ్చితంగా తీసుకెళ్లండి. ఆ వేడుక ప్రత్యేకత వివరించడం కూడా చాలా అవసరం. గాలిపటాలు ఎగరేయడం కూడా ముఖ్యమే కాబట్టి... పడిపోతారు వద్దు అనకుండా జాగ్రత్తలు చెబుతూనే ప్రోత్సహించడం మంచిది. వీలైనంతవరకూ ఎక్కువ మంది పిల్లలతో కలిసిమెలిసి ఆనందించేలా చూడండి. అది బంధువుల పిల్లలు కావచ్చు, ఇరుగుపొరుగు అయ్యుండొచ్చు. దీనివల్ల వారిమధ్య సత్సంబంధాలు పెరుగుతాయి. ఇలాంటి సమయాల్లో బంధువుల్ని ఇంటికి ఆహ్వానిస్తే... నలుగురిలో ఎలా వ్యవహరించాలనేదీ పిల్లలు అలవాటు చేసుకుంటారు.

డ్యాన్సులు చేయిస్తాం...

విదేశాల్లోని తెలుగువాళ్లకి మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్ని ఆచరించే తీరిక ఉండడంలేదు. ఇక, పిల్లలకు ఎలా తెలుస్తుంది? దీపావళి అంటే టపాసులు కాలుస్తారు. కానీ సంక్రాంతి అనేది చాలామంది చేసుకోరు. ముఖ్యంగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో అయితే పెద్దగా ఉండదు. అందుకే గత ఆరేళ్లుగా ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాం. తెలుగువాళ్లు ఎవరిళ్లల్లో వాళ్లు కాకుండా అంతా ఒక చోట చేరేలా సంక్రాంతిని నిర్వహిస్తాం. సంప్రదాయ వస్త్రధారణతోపాటు ఆటపాటలు, నాటికలు పిల్లలకు నేర్పించి ఆ రోజున వేయిస్తాం. ఆరేళ్లలో ఎంతో మార్పు వచ్చింది. తెలుగువాళ్లే కాదు, విదేశీయులు ఇందులో పాలుపంచుకుంటున్నారు. ముగ్గుల పోటీ, గాలిపటాలు ఎగరేయడం... వంటివాటిల్లోనూ ఆసక్తిగా పాల్గొంటున్నారు. అక్కడ ఉండే ప్రభుత్వ అధికారులు కూడా ఈ కార్యక్రమాన్ని చూసేందుకు వస్తున్నారు. ఈ సమయంలో స్థానికంగా ఉండే హోటళ్ల యాజమాన్యాలతో మాట్లాడి మన సంప్రదాయ తెలుగు వంటకాలు ప్రత్యేకంగా చేయిస్తాం. వాటిల్లో పులిహోర, గారెలు, పొంగలి, నువ్వుల లడ్లు, అరిసెల్లాంటివి ఎక్కువగా ఉంటాయి. వచ్చిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా భోజనం వడ్డిస్తాం. ఒకప్పుడు పిల్లలకు సంక్రాంతి అంటే తెలిసేది కాదు. ఇప్పుడు వాళ్లు కూడా ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటున్నారు కాబట్టి పండగకు సంబంధించి ఏ ప్రశ్న వేసినా సమాధానం చెబుతారు. సంప్రదాయ వస్త్రధారణ గురించి అందరికీ తెలిసేందుకు ఆ రోజున ర్యాంప్‌వాక్ చేస్తారు. ఇవన్నీ మేం 'తెలుగు లాంగ్వేజ్ అండ్ కల్చర్ ఫౌండేషన్ ఆఫ్ ఆస్ట్రేలియాలో భాగంగా చేస్తున్నాం...'

– వి. హైమారెడ్డి, మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా



వీళ్ల పని నవ్వించడమే!

వేదికపై ఆ నలుగురూ తమకెదురుగా ఉన్న ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నారు. ఫలానా సందర్భం అని చెప్పినా దానికి తగినట్లుగా జోకులు అల్లుతున్నారు. ఇదంతా హైదరాబాద్‌కు చెందిన 'ఇంప్రూవ్ కామెడీ హైదరాబాద్ (ఐసీహెచ్)' మిత్ర బృందం నిర్వహించే కార్యక్రమం. దీన్ని జయశ్రీ రాజ్, ప్రణవి పుల్లగుమ్మి, జై సోలంకి, అధిర కలిసి ప్రారంభించారు. దీని నిర్వాహకుల్లో ఒకరైన జయశ్రీరాజ్.. తమ గురించి చెబుతున్నారిలా.





అధిర
జయశ్రీ
జై సోలంకి
ప్రణవి

మా బృంద సభ్యులంతా ఉన్నత విద్యావంతులే. అయిదంకెల జీతం అందుకుంటున్న వారే. మా అందరి అభిరుచి హాస్యం. అదే మమ్మల్ని కలిపింది. మాకు ఉద్యోగం జీవనాధారమైతే, ఈ అభిరుచి ఇతరులను నవ్విస్తూ ఆరోగ్యంగా ఉంచడానికే. హాస్యంతోపాటు సామాజిక సేవ, మూగ జీవాల సంరక్షణ, నృత్యం, నాటకాలు, టీవీ షోలు చేయడం కూడా మా అభిరుచుల్లో ఓ భాగం. ఈ రోజుల్లో అందరివీ బిజీ జీవితాలే. కాస్తయినా హాస్యం లేకపోతే ఒత్తిడి తప్పదు. అందుకే దీన్ని ప్రారంభించాం. మేం మొదట్లో స్టాండప్ కామెడీ చేసేవాళ్లం. ఇప్పుడు ఇంప్రూవ్ కామెడీగా మార్చాం. ఎదుటి వాడిని ఏడిపించడం కన్నా నవ్వించడమే కష్టం. ఒక్కసారి హాస్యాన్ని పంచగలిగితే వాళ్లు సంతోషించడమే కాదు... జీవితాంతం మనల్ని గుర్తు పెట్టుకుంటారు. మేం అదే చేస్తున్నాం. నాది హైదరాబాదే. ఎంబీఏ చదివా. ఆల్ ఇండియా రేడియోలో ఆర్జేగా పనిచేస్తున్నా. థియేటర్ ఆర్టిస్ట్‌ని కూడా. ఇంట్లో అమ్మా, నాన్న, అన్నయ్య, నేను. నాన్న వ్యాపారి. అమ్మ ఇంట్లోనే ఉంటుంది. అల్లరి చేస్తూ, గారాబంగా పెరిగిన నాకు ఎప్పుడు నవ్వుతూ ఉండటం, చుట్టూ ఉన్నవారిని నవ్వించడం ఇష్టం. నాలుగేళ్లగా రెయిన్‌బో ఎఫ్‌ఎంలో 'నమస్తే...హలో... ఆదాబ్' పేరుతో వారానికో రోజు ఉదయం 9 గంటల నుంచి 12 వరకు ఆర్జేగా చేస్తున్నా. మీలో ఎవరు కోటీశ్వరుడు'లో పాల్గొని, మూడున్నర లక్షల రూపాయల వరకు గెలుచుకున్నా. అలాగే టీవీ సీరీస్, యూట్యూబ్ వీడియోలు చేశా. మూగజీవుల సంరక్షణలో సేవలందిస్తున్నా. చదువురీత్యా కొన్నాళ్లు న్యూయార్క్ వెళ్లా. అక్కడ ఉండే మనవాళ్లలో ఏదో కోల్పోయిన భావనని గుర్తించా. దాంతో అమెరికా రేడియోకి ఆర్జేగా చేస్తున్నా. ఇక్కడి ప్రత్యేకతల్ని వాళ్లకు చెబుతా. ఇలా మా బృంద సభ్యులమంతా రకరకాల పనుల్లో బిజీగా ఉన్నా ఆదివారం నాడు అంతా కలుసుకుంటాం. అయిదు గంటల పాటు రకరకాల సందర్భాలను మేళవిస్తూ ఎలా నవ్వించాలా అని ఆలోచించి సాధన చేసి షోకి సిద్ధం అవుతాం.

ఇంటి వాతావరణం ప్రతిబింబించేలా...


మా కార్యక్రమంలో ఎక్కువగా అత్తా కోడళ్లు, భార్యాభర్తలకు సంబంధించిన జోకులే ఉంటాయి. మేం మాత్రమే జోక్స్ చెప్పి నవ్వించడం కాదు, ప్రేక్షకులు అడిగిన వాటికీ అప్పటికప్పుడు స్పందిస్తాం. ఎక్కువగా అత్తా కోడళ్ల మధ్య జరిగే సమస్యలపై కామెడీ చేయమని అడుగుతారు. అలాగే టీవీ ఛానళ్ల విషయంలో భార్యాభర్తల మధ్య వచ్చే చిన్నపాటి సరదా గొడవలను ప్రస్తావిస్తుంటారు. ఎవరేం చెప్పినా వెంటనే చేస్తాం. అలాగని ఎవరినీ కించపరిచేలా మాట్లాడకూడదనేది మా నియమం. హైదరాబాద్‌తోపాటు, బెంగళూరులోనూ పలు ప్రదర్శనలు ఇచ్చాం. గంటన్నర సేపు చేసే ఈ షో కి వచ్చేవారు హాయిగా నవ్వుకుని వెళ్లడం చూసినప్పుడు చాలా ఆనందంగా అనిపిస్తుంది. ఇంతకన్నా కావల్సిందేముంటుంది. నామమాత్రపు రుసుముతో దీన్ని నిర్వహిస్తున్నాం' అని చెబుతుంది జయశ్రీ.

ఈ బృందంలో మరో సభ్యురాలు ప్రణవి. ఆమెదీ హైదరాబాదే. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. హాస్యంపై ఇష్టంతో స్టాండప్ కమెడియన్‌గా మారింది. ఆ తరువాతే ఈ ఐసీహెచ్ బృందంలో చేరింది. అలాగే కేరళకు చెందిన అధిర కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగినే. హైదరాబాద్‌లోనే పనిచేస్తోంది. అమెరికన్ టీవీషోలు కూడా చేస్తోంది. హైదరాబాద్‌కు చెందిన జై సోలంకి కూడా జీఎస్టీ ప్రాక్టీషనర్.

బంగారం వెండి

11న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,072	3,076
వెండి (గ్రా)	42.70	42.80



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	33,230	33,340	32,800	32,900	32,700	32,800	33,230	33,190	32,980	33,060
ఆర్నమెంట్	31,040	31,140	30,400	30,500	30,310	30,320	30,810	30,760	30,680	30,750
వెండి(కిలో)	40,360	40,460	40,400	40,800	40,300	40,500	40,400	40,400	40,500	40,500

రంగవల్లిక

15 చుక్కలు,
5 వరుసలు.
5 వచ్చేవరకు.






-ప్రియాంక,
కోదాడ

ఈటీవీ తెలంగాణ జనవరి 10, 2019 విజేతలు

1. హెచ్.స్వప్న, వికారాబాద్ 2. కె.ప్రసన్న, తిమ్మాపేట్-వరంగల్ 3. పి.మంజుల, గోసంపల్లి-నిర్మల్ 4. కె.మాధవి, మంచిర్యాల 5. ఏ.భావన, సారపాక-భద్రాచలం 6. వి.మాధవి, చేర్యాల-జనగామ 7. ఏ.సత్యవతి, ఇల్లందు-భద్రాద్రి-కొత్తగూడెం 8. ఎం.లావణ్య, నర్సంపేట-వరంగల్ 9. వి.సువర్ణ, సూర్యాపేట 10. పి.లక్ష్మి ప్రవల్లిక, నంద్యాల



జి.వసుంధర
హైదరాబాద్



15 చుక్కలు,
5 వరుసలు.
5 వచ్చేవరకు.

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
అబ్దుల్లాపూర్‌మెట్
మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
email: vasundhara@eenadu.net

ఈనాడు సినిమా



చిరంజీవి



మహేష్‌బాబు



బాలకృష్ణ

మార్చి 1న



కల్యాణ్‌రామ్

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం '118'. నివేదా థామస్, షాలినిపాండే కథానాయికలు. ప్రముఖ ఛాయాగ్రాహకుడు కె.వి.గుహన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహేష్ కోనేరు నిర్మాత. మార్చి 1న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు నిర్మాత తెలిపారు. "థ్రిల్లర్ కథతో రూపొందించిన చిత్రమిది. కల్యాణ్‌రామ్ ఇప్పటిదాకా ఈ జోనర్‌లో సినిమా చేయలేదు. ఇందులో ఆయన లుక్, పాత్ర కొత్తగా ఉంటాయి. కె.వి.గుహన్ ఒక విభిన్నమైన కథతో ఈ చిత్రం రూపొందించారు. వెంకట్, అన్బరివు, రియల్ సతీష్ రూపొందించిన పోరాట ఘట్టాలు చిత్రానికే కీలకం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇటీవల విడుదలైన ప్రచార చిత్రాలకి మంచి స్పందన లభించింద"న్నారు మహేష్ కోనేరు. ఈ చిత్రానికి మాటలు: మిర్చి కిరణ్, సంగీతం: శేఖర్‌చంద్ర.

సరికొత్త వినోదానికి సిద్ధమా!



సమంత

తెలుగు సినిమా సరళిలో మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇదివరకు 'అవే కథలు... అవే సినిమాల'నే విమర్శలు బలంగా వినిపించేవి. నాలుగేళ్లుగా భిన్నమైన కథలు వెలుగు చూస్తున్నాయి. విజయం అందుతుందనే నమ్మకం ఉన్నా సరే... ఫార్ములా కథలతో ప్రయాణం చేయడంపై దర్శకనిర్మాతలు ఆసక్తి చూపడం లేదు. కథానాయకులూ అలా మూస పద్ధతుల్లో సినిమాలు చేయడానికి ఇష్టపడటం లేదు. కొత్త కథే చెబుదామనే ధోరణిలో అడుగులు వేస్తున్నారు. దాంతో ప్రేక్షకుడికి ప్రతి టికెట్టుపైనా కొత్త వినోదాల్ని ఆస్వాదించే అవకాశం లభిస్తోంది. ఈ ఏడాది రాబోయే సినిమాల్ని పరిశీలిస్తే... మన వెండితెర సరికొత్త రుచుల్నే పంచబోతోందనే విషయం స్పష్టమవుతోంది.



ప్రభాస్

ఈ సంక్రాంతికి నాలుగు సినిమాలు విడుదలయ్యాయి. వీటిలో ఒకొక్కటి ఒక్కో రకమైన కథతో రూపుదిద్దుకొన్నదే. 'ఎన్టీఆర్ కథానాయకుడు' ఎన్టీఆర్ జీవిత చరిత్రతో రూపుదిద్దుకోగా... 'వినయ విధేయ రామ' కమర్షియల్ అంశాలతో ముస్తాబై ప్రేక్షకుల ముందుకొచ్చింది. కుటుంబ అంశాలతో మేళవించిన పక్కా వినోదాత్మక చిత్రంగా 'ఎఫ్2' అలరించేందుకు సిద్ధమైంది. ఇక 'పేట'రజనీ ఇమేజ్‌నీ, ఆయన అభిమానుల్ని దృష్టిలో ఉంచుకొని తెరకెక్కింది. ఇలా ఒకొక్క సినిమాదీ ఒక్కో పంథా. దేని దారిలో అది పండగ రుచుల్ని ఆస్వాదించినంత కమ్మగా వినోదాల్ని పంచుతోంది. రాబోయే సినిమాలు కూడా ఇదే తరహాలోనే సరికొత్త కథలు, వినోదంతో సందడి చేసేలా కనిపిస్తున్నాయి. ఆ చిత్రాల కోసం దర్శకులు ఎంచుకొన్న కథలు అదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

☆ చరిత్ర పేజీల నుంచి...

ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకొస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో ఒకటి... 'సైరా నరసింహారెడ్డి'. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రతో రూ.200 కోట్ల పైచిలుకు వ్యయంతో రూపొందుతున్న చిత్రమిది. ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఎన్టీఆర్ జీవితం ఆధారంగా 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'ఎన్టీఆర్ మహానాయకుడు' చిత్రాలు రూపొందాయి. తొలి చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల మెప్పు పొందింది. ఇక రెండో భాగం గురించి అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి చేసిన పాదయాత్ర నేపథ్యంలో 'యాత్ర' తెరకెక్కింది. మమ్ముట్టి ప్రధాన పాత్ర పోషించారు. ఇవన్నీ జీవిత కథలతో తెరకెక్కిన చిత్రాలే అయినా అవి సాగే కాలం, వాటి నేపథ్యం కొత్తగా ఉండబోతున్నాయి. రాజశేఖర్ ఒక పీరియాడిక్ కథతో 'కల్కి' చేస్తున్నారు. 1983 నేపథ్యంలో సాగే చిత్రమది.

☆ బాండ్‌ని గుర్తు చేస్తాడా?



నాని

'బాహుబలి 2' తర్వాత ప్రభాస్ చేస్తోన్న చిత్రం 'సాహో'. ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. విడుదలకి ముహూర్తం కుదిరిపోయింది. రూ.250 కోట్ల వ్యయంతో తెరకెక్కిన ఈ చిత్రంతో ప్రభాస్ జేమ్స్‌బాండ్ సినిమాల్ని గుర్తు చేయబోతున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని చిత్రబృందం చెబుతోంది. మహేష్‌బాబు ఈ ఏడాది 'మహర్షి' చిత్రంతో ప్రేక్షకులకు వినోదాలు పంచబోతున్నారు. కొంతకాలంగా మహేష్ సామాజికాంశాలతో కూడిన కథల్ని ఎంచుకొంటున్నారు. ఈ చిత్రంలోనూ అలాంటి అంశాల్నే స్పృశించినట్టు తెలుస్తోంది. మహేష్ స్టైల్‌కి తోడు ఆయన చెప్పే కథ ఎలా ఉంటుందా అనే ఆసక్తి అందరిలోనూ కనిపిస్తోంది. వేసవికి ఈ చిత్రం రాబోతోంది. కొంతకాలం పాటు సీరియస్ కథలతోనే ప్రయాణం చేసిన వెంకీ మళ్లీ తన దైన దారిలోకి వచ్చారు. 'ఎఫ్2'తో తన మార్క్ వినోదం పండించిన ఆయన తదుపరి చేయబోయే 'వెంకీమామ'లోనూ తన నుంచి ఆశించే అంశాలు పుష్కలంగా ఉంటాయని వెంకటేష్ చెబుతున్నారు.



వెంకటేష్

☆ వీళ్లూ కొత్తగానే



అఖిల్

కథల విషయంలో యువతరం కథానాయకులు మరింత పక్కాగా ఉంటున్నారు. థియేటర్‌కి వెళ్లే యువతరం అభిరుచులకి తగ్గట్టుగా ఆలోచిస్తూ కథల్ని ఎంపిక చేసుకొంటున్నారు. నాని ఈసారి క్రికెట్ నేపథ్యంలో సాగే కథతో 'జెర్సీ' చేశారు. ప్రేక్షకులకి కొత్తదనాన్ని పంచడమే కాదు నటుడిగా నాకూ గౌరవాన్ని పెంచే చిత్రమవుతుందని చెబుతున్నారాయన. అఖిల్ అక్కినేని 'మిస్టర్ మజ్ను'గా మారి ప్రేమకథ చెప్పబోతున్నారు. ఆయన సోదరుడు నాగ చైతన్య 'మజిలీ' పేరుతో ఓ చిత్రం చేస్తున్నారు. నాగచైతన్య, ఆయన భార్య సమంత నాయకానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రం పెళ్లయిన ఓ జంట నేపథ్యంలో సాగుతుందని సమాచారం. సమంత కథానాయిక ప్రాధాన్యంతో కూడిన మరో చిత్రం చేస్తున్నారు. ఒక యువతి, ఆమె బామ్మ నేపథ్యంలో సాగే కథతో 'ఓ బేబీ... ఎంత సక్కగున్నావే' పేరుతో ఆ చిత్రం రూపొందుతోంది. కీర్తిసురేష్, అనుష్క తదితరులు కూడా ఈ ఏడాది కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలతో సందడి చేయబోతున్నారు. విజయ్ దేవరకొండ ఎంచుకొనే కథలు కూడా ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయి. ఆయన ఈసారి 'డియర్ కామ్రేడ్' అంటూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. కల్యాణ్‌రామ్ ఓ థ్రిల్లర్ కథతో '118' చేశారు. అల్లు అర్జున్ - త్రివిక్రమ్‌ల కాంబినేషన్ సెట్ అయ్యింది. ఈసారి ఈ కలయికలో ఎలాంటి సినిమా రాబోతుందన్నది త్వరలోనే తెలుస్తుంది. గతేడాది కూడా జీవిత కథలతో పాటు... రాజకీయం, గ్రామీణ, ప్రేమ, ఫ్యాక్షన్, థ్రిల్లర్ తదితర నేపథ్యాలతో కూడిన కథలు తెరపైకొచ్చి విజయాల్ని అందుకొన్నాయి. అదే స్ఫూర్తి ఈ ఏడాది కూడా కనిపిస్తోంది. అరుదుగా తెరకెక్కే క్రీడా నేపథ్య చిత్రాలు కూడా ఈసారి ప్రేక్షకుల ముందుకు రానుండడం మంచి పరిణామం.



రాజశేఖర్

జీవితాన్ని చూస్తున్నట్టు అనిపించింది

పాండిత్యం కన్నా జ్ఞానమే ముఖ్యం.

చిత్రం: మాయాబజార్,

– పంపినవారు: బి.పార్థసారధి, అనంతపురం



కృష్ణ, విజయనిర్మల

"ఎన్టీఆర్ జీవిత కథతో తెరకెక్కిన 'ఎన్టీఆర్ కథానాయకుడు' చూశాను. ఒక సినిమాల్లా కాకుండా, జీవితాన్ని చూస్తున్నట్టు అనిపించింద"న్నారు ప్రముఖ నటుడు కృష్ణ. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణ మాట్లాడుతూ "బాలకృష్ణ వందశాతం ఎన్టీఆర్‌లాగే కనిపించారు. ఆయన వేసిన అన్ని గెటప్పులోనూ బాగున్నారు. సినిమా పెద్ద విజయాన్ని అందుకుంటుంది" అన్నారు. విజయనిర్మల మాట్లాడుతూ "పన్నెండేళ్ల వయసున్నప్పుడు ఎన్టీఆర్‌తో కలిసి 'పాండురంగ మహత్యం' చేశాను. అందులో నేను కృష్ణుడిగా నటించా. చిత్రంలో ఎన్టీఆర్‌నే చూస్తున్నామా అనేలా బాలకృష్ణ నటించార"న్నారు. నరేష్ విజయకృష్ణ మాట్లాడుతూ "మా అమ్మగారి తొలి సినిమా ఎన్టీఆర్‌తోనే చేశా. 'ఎన్టీఆర్ కథానాయకుడు'లో నాకు నటించే అవకాశం వస్తుందా అని ఎదురు చూశా. బి.ఎ.సుబ్బారావు పాత్రలో నటించే అవకాశం వచ్చింది. ఆ పాత్రలో నటిస్తున్నప్పుడు థ్రిల్‌కి గురయ్యాన"న్నారు.

ప్రేమ కోసం



సుబాంగి

నెమలి అనిల్, సుబాంగి పంథ్ జంటగా నటిస్తున్న చిత్రం 'రావే నా చెలియా'. ఎన్.మహేశ్వరరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. నెమలి అనిల్, నెమలి శ్రవణ్ నిర్మాతలు. ఈ సినిమా లోగోని హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నిర్మాత రాజ్ కందుకూరి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఈ సినిమా పేరు ఆకర్షణీయంగా ఉంది. కథ అలాగే ఉంటుందని భావిస్తున్నా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "విభిన్నమైన ప్రేమకథతో రూపొందిస్తున్న చిత్రమిది" అన్నారు. "ఇదే నా మొదటి సినిమా. ప్రేమకథల్లో కొత్త కోణాన్ని ఆవిష్కరించే కథ, కథనాలే ఈ చిత్రానికి ప్రధాన బలం" అన్నారు కథానాయకుడు. రవి.ఎన్.విరాజ్, విజయ్ దగ్గుబాటి, ఎమ్.ఎమ్.కుమార్, కృష్ణమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లక్ష్మీపార్వతిగా యజ్ఞశెట్టి



ఎన్టీఆర్ జీవితం ఆధారంగా రామ్‌గోపాల్ వర్మ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ జీవితంలోకి లక్ష్మీపార్వతి ప్రవేశించిన తర్వాత చోటు చేసుకొన్న సంఘటనల నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో లక్ష్మీపార్వతి పాత్ర కోసం కన్నడ నటి యజ్ఞశెట్టిని ఎంపిక చేశారు. ఆ విషయాన్ని ప్రకటిస్తూ... ట్విట్టర్ ద్వారా ఆమె లుక్‌ని విడుదల చేశారు వర్మ. యజ్ఞ శెట్టి ఇదివరకు రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కించిన 'కిల్లింగ్ వీరప్పన్' చిత్రంలో వీరప్పన్ భార్య ముత్తులక్ష్మి పాత్రలో నటించారు.

ఫెదరర్, నాదల్, జకోవిచ్.. 2008లో టాప్-3 స్టార్లు!
ఓ దశాబ్దం గడిచిపోయింది. తక్కువ సమయమేమీ కాదు. ఈ కాలంలో ప్రపంచం ఎంత మారింది. ఎన్ని వందల మంది టెన్నిస్‌లోకి వచ్చి వెళ్లారు. ఎంత మంది తలరాతలు మారాయి. ఏదీ స్థిరంగా లేదు!
కానీ పెరుగుతున్న వయసుతోపాటు వాడినీ పెంచుకుంటూ ఆ దిగ్గజాలు అలాగే ఉన్నారు.. చెక్కు చెదరకుండా, చేవ తగ్గకుండా! ఓ ఐఫిల్ టవర్‌లా... ఓ చైనా గోడలా.. ఓ తాజ్‌మహల్‌లా!
పురుషుల టెన్నిస్‌ను శాసిస్తూ.. అగ్రస్థానాల్లో ఇప్పటికీ వాళ్లే! వరుస మారినా 2019లోనూ ఆ త్రయానివి అవే నంబర్లు 1, 2, 3!



కదలం వదలం..!

మార్పు మాత్రమే శాశ్వతం అంటారు. నిజమే.. పాత నీరు పోయి కొత్త నీరు రావడం సహజం. ఈ పోటీ ప్రపంచంలో యథాతథ స్థితిని కొనసాగించడం, స్థానాలను నిలబెట్టుకోవడం చాలా కష్టం. కానీ ఫెదరర్, నాదల్, జకోవిచ్ త్రయానికి ఈ సూత్రం వర్తించనట్లుంది. మొత్తంగా 51 గ్రాండ్‌స్లామ్‌లు కొట్టినా అలుపు లేదు. .విసుగూ లేదు. ఆటు పోట్లను తట్టుకుంటూ..మార్పునకు ఏస్ కొడుతూ... వయసును కేవలం ఓ నంబర్‌గా మార్చేస్తూ దూసుకుపోతూనే ఉన్నారు. సెరెనా విలియమ్స్ కూడా ఈ కోవలోనిదే! తల్లిగా మారినా అదే జోరు. తన వయసులో సగమున్న అమ్మాయిలను సైతం మట్టికరిపిస్తూ.. రికార్డులను ఛేదిస్తూ మహిళల టెన్నిస్‌లో యువ తరాన్ని ఎదిరిస్తోంది.

రిటైర్మెంట్ యోచనైనా లేకుండా మరో ఏడాదిని కొల్లగొట్టేందుకు సిద్ధమవుతున్న ఈ నలుగురి ప్రస్థానం స్ఫూర్తిదాయకం. 2019లో మొట్టమొదటి గ్రాండ్‌స్లామ్‌కు సిద్ధమవుతున్న ఈ తారల ప్రయాణంలోకి మనమూ వెళ్దామా!

అదే వాడి | ఫెదరర్

సాధారణంగా పురుషుల టెన్నిస్‌లో 30 దాటాయంటే ఆటగాడు దాదాపుగా కెరీర్ చరమాంకంలో పడ్డట్లే. ఫెదరర్‌తో పాటే కెరీర్‌ను ఆరంభించిన సఫిన్ ఎప్పుడో పదేళ్ల కిందే రిటైరయ్యాడు. ఫెదరర్ మాత్రం అదే ఫిట్‌నెస్‌తో, అదే ఉత్సాహంతో కొనసాగుతూనే ఉన్నాడు. తనకన్నా ఐదారేళ్లు చిన్నవాళ్లయిన జకోవిచ్, నాదల్ వంటి స్టార్ల దూకుడును, జెర్వెవ్ లాంటి కుర్రాళ్ల జోరును తట్టుకుంటూ ఇప్పటికీ నిలవడం గొప్ప విషయమే. అతడు ఇప్పటికీ స్టారే. ఇప్పటికీ ఫేవరెట్టే. నిలకడగా క్వార్టర్స్, సెమీఫైనల్స్ చేరినా 2011 నుంచి 2016 వరకు ఒక్క గ్రాండ్‌స్లామ్ కొట్టకపోవడం, టాప్-10 నుంచి కూడా పోవడంతో ఫెదరర్ పనైపోయినట్లేనని తీర్మానించారు చాలా మంది పండితులు. కానీ అద్భుతంగా పుంజుకుని వాళ్ల నోళ్లు మూయించాడు ఫెదరర్. ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గి 2017లో ఘనంగా బోణీ కొట్టిన అతడు.. అదే ఏడాది వింబుల్డన్‌నూ చేజిక్కించుకున్నాడు. ఆ టైటిల్ గెలిచిన అత్యంత పెద్ద వయస్కుడిగా కూడా ఫెదరర్ రికార్డు సృష్టించాడు. 2018లోనూ ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన ఫెదరర్.. ప్రపంచ నంబర్-3గా ఏడాదిని ముగించాడు. 20 ఏళ్ల కుర్రాళ్లను కూడా అలవోకగా ఓడిస్తూ నిరుడు మరో 4 ఏటీపీ టైటిళ్లు ఖాతాలో వేసుకున్నాడు. నంబర్‌వన్ ర్యాంకునూ చేజిక్కించుకున్నాడు. వయసు 37 దాటినా సరే.. ఇప్పుడు ఏ పండితుడూ ఫెదరర్‌ను తక్కువ అంచనా వేసే సాహసం చేయలేడు.

సెంచరీ కొడతాడా..

వంద ఏటీపీ టైటిళ్లకు కేవలం ఒక్క టైటిల్ దూరంలో ఉన్నాడు. ఈ ఏడాది అతడు ఆ మైలురాయిని అందుకోవడం ఖాయం. పురుషుల టెన్నిస్‌లో ఇప్పటివరకు ఒక్క జిమ్మీ కానర్స్ (108 ఏటీపీ టైటిళ్లు) మాత్రమే టైటిళ్లలో సెంచరీ కొట్టాడు.

వయసు	అరంగేట్రం
37	1998
గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు 20	కెరీర్ టైటిళ్లు 99
గెలుపు ఓటములు 1180–260	

పడిలేచిన కెరటం | జకోవిచ్

పురుషుల టెన్నిస్ చరిత్రలో అత్యంత విజయవంతమైన క్రీడాకారుడిగా నిలిచేందుకు ఫెదరర్, నాదల్‌లతో జకోవిచ్ గట్టిగా పోటీపడుతున్నాడు. అరంగేట్రం చేసిన 15 ఏళ్ల తర్వాత కూడా అతడు అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. ప్రపంచ నంబర్‌వన్‌గా కొత్త సంవత్సరంలో అడుగుపెట్టాడు. మేటి ఆటగాళ్లున్న తరంలో ఉన్నా అద్భుతమైన విజయాలతో తనకంటూ ఓ స్థానాన్ని సృష్టించుకున్న జకోవిచ్ కెరీర్ ఆసాంతం నిలకడైన ప్రదర్శన చేశాడు. కానీ 2017లో అతడి కెరీర్‌కు పెద్ద ఉపద్రవమే వచ్చింది. గాయాలు, వ్యక్తిగత సమస్యలతో అతడు ఉన్నట్లే తెలియలేదు. పూర్తిగా నీరుగారిపోయి అనామకుల చేతుల్లో సైతం ఓడిపోయాడు. సరదాగా నవ్విస్తూ, నవ్వుతూ ఉంటే జకో.. ఎందుకో సీరియస్‌గా మారిపోయాడు. ఆ ఏడాది ఒక్క గ్రాండ్‌స్లామూ గెలవని అతడు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 22వ ర్యాంకుకు పడిపోయాడు. కానీ 2018లో తిరిగి రెండో ఇన్నింగ్స్ మొదలెట్టాడు. పాత జకోవిచ్‌ను గుర్తు తెస్తూ రెట్టించిన ఉత్సాహంతో రెచ్చిపోయాడు. వింబుల్డన్, యుఎస్ ఓపెన్ టైటిళ్లతో రెండేళ్ల విరామం తర్వాత తిరిగి నంబర్ వన్ స్థానాన్ని అందుకున్నాడు. బిగ్-3లో ఇప్పుడు అత్యంత జోరుమీదున్నది అతడే. మంచి ఫామ్, ఫిట్‌నెస్‌తో ఉన్న జకోవిచ్‌కు ఇంకా చాలా కెరీరే ఉంది.

సంప్రాస్‌ను అధిగమిస్తాడా..

ప్రస్తుతం 14 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో ఉన్న జకోవిచ్ మరోటి సాధిస్తే తన ఆరాధ్య ఆటగాడు సంప్రాస్‌ను అధిగమిస్తాడు. ఆ కల జనవరిలోనే నెరవేరినా ఆశ్చర్యం లేదు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జకోవిచ్ టైటిల్ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

వయసు	అరంగేట్రం
31	2003
గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు 14	కెరీర్ టైటిళ్లు 72
గెలుపు ఓటములు 839–176	

రంకెలేస్తున్న బుల్ | నాదల్

గాయాలు.. గాయాలు.. గాయాలు. కెరీర్ ఆరంభం నుంచి గాయపడకుండా, ఫిట్‌నెస్ సమస్యలు లేకుండా నాదల్ ఒక్క టోర్నీకి కూడా దూరం కాని సంవత్సరాలు ఒకటో రెండో! గాయాలతో రఫెల్ సహవాసం అలాంటిది. కానీ అవేమీ అతడి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయలేకపోయాయి. అతడి పట్టుదల, పోరాటం అసమానం. గాయాలు, పేలవ ఫామ్‌తో ఎన్నిసార్లు వెనుకబడ్డా అద్భుతంగా పుంజుకున్నాడు. మోకాలి గాయమైతే నాదల్ కెరీర్‌ను ముగించినంత పని చేసింది. 17వ ఏటే ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌తో తన రాకను ఘనంగా చాటిచెప్పిన నాదల్.. రొలాండ్ గారోస్‌ను తన అడ్డాగా మార్చుకున్నాడు. ఎలాంటి స్థితిలో నుంచైనా కోలుకుని ఫ్రెంచ్ ఓపెన్ కొట్టడం ఓ అలవాటుగా మార్చుకున్నాడు. కానీ వరుసగా రెండేళ్లు (2015, 2016) ఒక్క గ్రాండ్‌స్లామ్ కూడా నెగ్గకపోవడంతో అతడి కెరీర్ ప్రశ్నార్థకమైంది. కానీ తిరిగి జోరందుకున్నాడు. అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన ఆటగాడిగా ఫెదరర్ రికార్డును బద్దలు కొట్టే దిశగా తన ప్రయత్నాలను ముమ్మరం చేశాడు. 2017లో రెండు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన నాదల్.. నిరుడు మరో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ సాధించి ఫెదరర్ వెనకే సాగుతున్నాడు. ప్రపంచ నంబర్-2గా కొత్త సంవత్సరంలో అడుగుపెట్టాడు. ఇప్పుడు ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముందు కూడా అతడు గాయపడ్డాడు. బ్రిస్బేన్ ఓపెన్‌కు దూరమయ్యాడు. అయినా ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్‌లో ఫేవరెట్టే. టైటిల్ కొడితే ఆశ్చర్యమేమీ లేదు.

మళ్లీ ఫ్రెంచ్ సాధిస్తే..

ఈ ఏడాది ఓ గొప్ప రికార్డు నాదల్‌ను ఊరిస్తోంది. మరోసారి రొలాండ్ గారోస్‌లో నెగ్గితే ఒక గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అత్యధిక సార్లు (12) గెలిచిన ఆటగాడిగా చరిత్ర సృష్టిస్తాడు.

వయసు	అరంగేట్రం
32	2001
గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు 17	కెరీర్ టైటిళ్లు 80
గెలుపు ఓటములు 918–189	

ఇంకొకటి సాధిస్తే.. | సెరెనా

సెరెనా నిజంగా టెన్నిస్ అద్భుతమే! రెండు దశాబ్దాలుగా ఆడుతున్నా అలుపు లేదు. గట్టి పోటీని తట్టుకుంటూ.. టాప్ ఫామ్‌లోనే ఉంది. దాదాపు తనతోనే కెరీర్‌ను ఆరంభించిన హెనిన్, క్లియ్‌స్టర్స్ వంటి వాళ్లు ఎప్పుడో రిటైరైనా.. తనకన్నా చిన్నవాళ్లయిన అజరెంక, వోజ్నియాకి వంటి వాళ్లు ఆటలో కొనసాగడానికి అగచాట్లు పడుతున్నా ఆమె మాత్రం సాగిపోతూనే ఉంది. ప్రాణాంతక వ్యాధి బారిన పడినా, కోర్టులో సైర్యాన్ని దెబ్బతీసే ఘటనలు జరిగినా ఆమె కుంగిపోలేదు. ఎప్పుడో 1999లో తొలి గ్రాండ్‌స్లామ్ నెగ్గిన సెరెనా.. 20 ఏళ్ల తర్వాత కూడా ఫేవరెట్‌గానే బరిలోకి దిగుతుందంటే ఆమె ఆధిపత్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కెరీర్‌లో 23 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన సెరెనా.. 2017లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో స్టెఫీగ్రాఫ్‌ను అధిగమించి ఓపెన్ శకంలో అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లు సాధించిన మహిళగా రికార్డు సృష్టించింది. 33 ఏళ్లు నిండిన తర్వాత ఆమె 5 గ్రాండ్‌స్లామ్‌లను నెగ్గడం విశేషం. బిడ్డకు జన్మనిచ్చిన కారణంగా ఆటకు ఏడాది దూరం కాకుంటే ఆమె ఖాతాలో మరిన్ని టైటిళ్లు చేరేవే.

వయసు	అరంగేట్రం
37	1995
గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు 23	కెరీర్ టైటిళ్లు 72
గెలుపు ఓటములు 801–136	

చరిత్రకు చేరువలో..

ఇంకో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిస్తే టెన్నిస్ చరిత్రలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన ప్లేయర్‌గా మార్గరెట్ కోర్ట్ (24)ను ఆమె సమం చేస్తుంది.



50 ఫెదరర్ తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ (వింబుల్డన్)ను 2003లో గెలిచాడు. ఆ తర్వాత మొత్తం 60 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు జరగగా అందులో 50.. ఫెదరర్ (19), నాదల్ (17), జకోవిచ్ (14) ఖాతాలో చేరాయి.

ప్రస్తుతం ఫుట్‌బాల్‌లో కొనసాగుతున్న స్టార్లలో అత్యధిక అంతర్జాతీయ గోల్స్ సాధించిన ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో. అతను 85 గోల్స్ కొట్టాడు. మరి రెండో స్థానంలో ఎవరుంటారో ఊహించండి?
మెస్సి..? నెయ్‌మార్..? సురెజ్..? వీళ్లెవ్వరూ కాదు.. సునీల్ ఛెత్రి..!
మన ఫుట్‌బాలర్ రొనాల్డో తర్వాతి స్థానంలో ఉన్నాడంటే నమ్మకం కలగడం లేదు కదూ! కానీ ఇది నిజం. తాజాగా ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీ తొలి మ్యాచ్‌లో రెండు గోల్స్ కొట్టిన ఛెత్రి.. మొత్తంగా 67 గోల్స్‌తో మెస్సి (65) లాంటి సూపర్ స్టార్‌ను వెనక్కి నెట్టేశాడు. ప్రపంచ స్థాయి ఫుట్‌బాల్ ప్రమాణాలకు భారత్ చాలా దూరంలో ఉండొచ్చు. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ స్థానం (97) వందకు చేరువగా ఉండొచ్చు. భారత ఫుట్‌బాల్ జట్టుకు అభిమానుల ఆదరణ అంతగా లేకపోవచ్చు. కానీ ఇవేవీ పట్టించుకోకుండా అవకాశం వచ్చిన ప్రతిసారీ సత్తా చాటుతూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు మన సాకర్ హీరో.



రొనాల్డో, మెస్సి.. మధ్యలో ఛెత్రి..!


భారత ఫుట్‌బాల్‌లో తిరుగులేని స్థాయిని అందుకున్న ఆటగాడు బైచుంగ్ భుటియా. అతడికి ముందు ఎందరో భారత జట్టుకు ఆడారు. కానీ భుటియా అంత పేరు ఎవ్వరికీ రాలేదు. భుటియా తర్వాత అతడిలా ప్రపంచ స్థాయిని ఇంకెవ్వరూ అందుకోలేరని అంతా అనుకున్నారు. కానీ సునీల్ ఛెత్రి వచ్చాడు. భుటియాను మించిపోయాడు. ఎన్నో ఘనతలు సాధించాడు. భారత ఫుట్‌బాల్ అనగానే తన పేరే గుర్తుకొచ్చేలా చేశాడు. ప్రపంచ ఫుట్‌బాల్‌లో ప్రస్తుతం భారత్ స్థానమేంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. భారత దేశ జనాభాలో పదో వంతు కూడా లేని దేశాలు మన కన్నా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాయి. ఐతే జట్టు ప్రదర్శన ఎలా ఉన్నా.. ఛెత్రి మాత్రం నిలకడగా రాణిస్తున్నాడు. చాలా ఏళ్లుగా భారత జట్టు ఛెత్రి మీదే ఆధారపడుతోంది. అతను బాగా ఆడితే గెలుస్తోంది. అతను విఫలమైతే దెబ్బ తింటోంది. భారత్ పది మ్యాచ్‌ల్లో గెలిస్తే.. అందులో ఏడెనిమిది విజయాల్లో ఛెత్రి పాత్ర కీలకంగా ఉంటోంది. నిరుడు భారత్ ఇంటర్ కాంటినెంటల్ కప్ గెలిచిందంటే అందుకతనే కారణం. టోర్నీ మొత్తంలో భారత్ 11 గోల్స్ కొడితే అతనొక్కడే 8 సాధించడం విశేషం. ప్రస్తుత ఆసియాకప్‌లోనూ ఛెత్రి సత్తాచాటుతున్నాడు. 34 ఏళ్ల ఛెత్రి పేరు తొలిసారి మార్మోగింది 2007 నెహ్రూ కప్‌లో. ఆ ఏడాది భారత్ టైటిల్ గెలిచింది అతడి వల్లే. ఆపై జట్టుకు ఇంకో రెండు నెహ్రూ కప్‌లు (2009, 2012) అందించాడు. 2008 ఏఎఫ్‌సీ ఛాలెంజ్ కప్‌లో భారత్ నెగ్గి.. 27 ఏళ్ల తర్వాత ఏఎఫ్‌సీ ఆసియా కప్‌కు అర్హత సాధించిందన్నా ఛెత్రీనే కారణం. భారత్ నుంచి విదేశీ లీగ్‌లకు ఎంపికైన అతి కొద్దిమంది ఆటగాళ్లలో ఛెత్రి ఒకడు.

అతను పిలిస్తే స్టేడియాలు నిండాయ్

"మమ్మల్ని తిట్టండి. విమర్శలు చేయండి. కానీ దయచేసి స్టేడియాలకు రండి".. గత ఏడాది ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ సందర్భంగా సునీల్ ఛెత్రి భారత అభిమానుల్ని ఉద్దేశించి ఇచ్చిన పిలుపు ఇది. సొంతగడ్డపై ఓ పెద్ద టోర్నీ జరుగుతుంటే.. భారత్ ఆడే మ్యాచ్‌లకు కూడా జనాలు రాకపోవడం, స్టేడియాలు వెలవెలబోతుండటంతో ఛెత్రి ఆవేదనతో ఈ వ్యాఖ్యలు చేశాడు. ఒక జాతీయ జట్టు కెప్టెన్ ఇలా అడగాల్సి రావడం బాధాకరమే కానీ.. ఛెత్రి పిలుపు బాగానే పని చేసింది. తర్వాతి మ్యాచ్ నుంచి స్టేడియాలు నిండిపోయాయి. టోర్నీలో మిగతా మ్యాచ్‌లన్నీ అభిమానులతో కళకళలాడిపోయాయి. ఐతే అభిమానుల్ని స్టేడియాలకు పిలిచేసి వాళ్లనేమీ నిరాశ పరచలేదు ఛెత్రి. టోర్నీ ఆద్యంతం రాణించాడు. ఫైనల్లోనూ సత్తా చాటి భారత్‌కు కప్పు అందించాడు. ఛెత్రి వందో అంతర్జాతీయ మ్యాచ్ రికార్డును అందుకోవడంతో పాటు.. ప్రస్తుతం అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో కొనసాగుతున్న ఆటగాళ్లలో రొనాల్డో తర్వాత అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాడిగా మెస్సిని సమం చేసింది కూడా ఆ టోర్నీలోనే. ఇప్పుడు ఆసియా కప్‌లో తొలి మ్యాచ్‌లోనే సత్తా చాటి మెస్సిని అధిగమించాడు.

వివేక భారత్

నేడు వివేకానంద జయంతి



గాలికి... హోరు గాలికి తేడా ఏంటి?
దేన్నైనా చుట్టిపడేసే హోరు.

వానకు... జోరు వానకు భేదం ఏంటి?
ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించే జోరు.

తీగకు.. విద్యుత్తు తీగకు వైరుధ్యం ఏంటి?
చిమ్మచీకట్లను సైతం వెలుగులుగా మార్చే విద్యుత్తు.

సమస్యలను చుట్టి పక్కన
పడేయగల ఆ హోరు...
ఈ యువత.

కష్టాలను ఇష్టంగా అధిగమించే
ఆ జోరు... ఈ యువత.

ఎలాంటి ఎదురుదెబ్బలైనా తట్టుకొని
పదిమంది జీవితాల్లో వెలుగులు
నింపగల ఆ విద్యుత్తు...
ఈ యువత.

'పది మంది యువకులనివ్వండి
దేశ భవిష్యత్తును తిరగరాస్తానన్న'
ఓ వివేకానందుడా... ఇదిగో శక్తులు
నిండిన యువకులు...
సమాజ హితం కోసం
పాటుపడుతున్న ధీరులు.

జాతీయ యువజన దినోత్సవం
సందర్భంగా స్ఫూర్తిదాయకమైన
'ఈతరం' కథనాలివి...

అక్షర చైతన్యం

చదువు విలువ తెలిసిన కుర్రాడు చదువుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. ఎంతోమంది యువత ఉన్నతికి ఉపయోపడుతున్నాడు. సొంతంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగంచేస్తూ... సొంతూరిలో గ్రంథాలయం నెలకొల్పి అక్షర చైతన్యం తీసుకొస్తున్నాడు. ఉపాధి వెలుగులు పండిస్తున్నాడు సిరిసిల్లకు చెందిన **నాగుల పూర్ణచందర్.**



పూర్ణచందర్ టెక్ మహేంద్రలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఉద్యోగ నిమిత్తం మూడు సంవత్సరాలు అమెరికాకు వెళ్లవలసి వచ్చింది. అక్కడ ఏదో తెలియని వెలితి. చదువుకునే రోజుల్లో తాను ఎదుర్కొన్న సమస్యలు గుర్తొచ్చేవి. తనలా ఎవ్వరూ కష్టపడకుండా చేయాలని సంకల్పించాడు. అమెరికా నుండి మధ్యలోనే తిరిగి వచ్చేశాడు. తన దగ్గరున్న చిన్నమొత్తంతో, స్నేహితుల సహకారంతో గ్రంథాలయాన్ని స్థాపించాడు. నడిపించాడు. నడిపిస్తున్నాడు. 1200 పుస్తకాలతో మొదలైన ఈ గ్రంథాలయంలో ప్రస్తుతం 4000కి పైగా పుస్తకాలు యువతకు మార్గనిర్దేశం చేస్తున్నాయి. మొదట 4గంటలే తెరిచి ఉంచే పుస్తక భాండాగారం ప్రస్తుతం 24 గంటలూ నిరుద్యోగులకు సేవలందిస్తోంది. గ్రంథాలయంలో ఒక గదిని సాంకేతిక శిక్షణకు కేటాయించారు. 12 అడుగుల ప్రొజెక్టర్ స్క్రీన్, తదితర ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. టీ-సాట్‌లాంటి ప్రభుత్వ ఛానళ్లలో టెలికాస్ట్ అయ్యే వివిధ పోటీ పరీక్షలకు తరగతులను ప్రదర్శిస్తున్నారు.



సిద్దిపేట జిల్లాకు చెందిన శేఖర్ గ్రంథాలయంలో చదువుకుని టెట్‌లో 16వ ర్యాంకు సాధించాడు. కరుణాకర్, మమతలు ఇటీవల విడుదలైన పంచాయతీ కార్యదర్శి పరీక్ష ఫలితాలలో ఎంపికయ్యారు. కరుణాకర్ గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షలో పాసయ్యారు. ఇలా అనేకమంది ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ఈ గ్రంథాలయం సోపానాలు పరుస్తోంది. 'గ్రంథాలయాన్ని స్థాపించిన అయిదు సంవత్సరాల్లో మూడు వేలకు పైగా విద్యార్థులు సేవలు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. అక్షర చైతన్యం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా యువతకు కెరీర్ గైడెన్స్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామ'ని ఆనందంగా చెప్పాడు పూర్ణచందర్.

- తవుటు సౌమ్య, సిరిసిల్ల

వివేకా సూక్తి: నీ వెనుక ఏముంది? ముందేముంది? అన్నది కాదు ముఖ్యం. నీలో ఏముంది అనేది ముఖ్యం. అదే నీతో పాటు పదిమందిని నడిపిస్తుంది.

జైజవాన్.. మోహన్



సైన్యంలో చేరాలంటే... సవాలక్ష పరీక్షలు. ఫిట్‌నెస్, మెడికల్ టెస్టులు. ఇన్నీ చేసి ఎంపికైతే కఠోర శిక్షణ... సైనికుడిగా ఉండాలంటేనే ఇన్ని చేయాలి. అదే లెఫ్టినెంట్ కావాలంటే.. ఇంతకు మించిన కఠోర శ్రమ అవసరం. వీటన్నింటినీ అధిగమించి లెఫ్టినెంట్ అయ్యాడు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన 22 ఏళ్ల యువకుడు **మోహన్.**

జ్వలించే తపన, అకుంఠిత దీక్ష... ఎంతటి లక్ష్యాన్నైనా సాధించేలా చేస్తాయని నిరూపించాడు పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన ముళ్లపూడి మోహన్. ముళ్లపూడి రామసుబ్రహ్మణ్య వరప్రసాద్, అచ్చమాంబ దంపతుల కుమారుడు మోహన్‌కు చిన్ననాటి నుంచి సైన్యంలో చేరాలనేది ఆశయం. ఆలోచనలను ఎటూ మళ్లించలేదు. 2014లో ఇంటర్మీడియట్ పూర్తైన వెంటనే ఇండియన్ ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేశాడు. యూపీఎస్సీ నిర్వహించిన ఈ పరీక్షలకు 6 లక్షల మంది హాజరైతే 500 మంది ఉత్తీర్ణత పొందారు. తర్వాత సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్.ఎస్.బి.) ఆధ్వర్యంలో 5 రోజుల పాటు నిర్వహించిన ముఖాముఖీలకు 90 మందే అర్హత సాధించారు. వైద్య పరీక్షల అనంతరం 50 మందిని తుదిగా ఎంపిక చేశారు. వీరిలో ఒకడు మోహన్. వీరికి నాలుగు సంవత్సరాలు బీటెక్ కోర్సుతో పాటు ప్రపంచంలోని వివిధ రకాల ఆయుధాలను వినియోగించడం, గుర్రపు స్వారీ, స్విమ్మింగ్ వంటి విభిన్న అంశాల్లో ఒక సంవత్సరం పాటు శిక్షణ ఇచ్చారు.

105 పరీక్షలు

ప్రతి సెమిస్టర్‌కి 105 పరీక్షలు ఉండేవి. దీనిలో ఏ పరీక్ష ఉత్తీర్ణత సాధించకపోయినా కోర్సులో ఆరు నెలలు వెనక్కి పంపిస్తారు. గుర్రపు స్వారీ తదితర శిక్షణలో కింద పడి కేరళ, రాజస్థాన్‌లకు చెందిన ఇద్దరికి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. అలాంటి భయాలేవి మోహన్ దరిచేరలేదు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేశాడు. రాష్ట్రపతి రాతపూర్వకంగా ఇచ్చిన లేఖతో ఇండియన్ కమిషన్‌లోకి ప్రవేశించాడు. నవంబరు 8న గయా ఆర్మీ లెఫ్టినెంట్‌గా బాధ్యతలు స్వీకరించి తన చిన్ననాటి కలను సాకారం చేసుకున్నాడు. 'లక్ష్యం నిర్దేశించుకున్నాక... పక్కచూపులు చూడకుండా ముందుకు సాగాను. ఫలితం సాధించాను. భారత సైన్యానికి మెరుగైన సేవలు అందించడమే ప్రస్తుతం నా ముందున్న కర్తవ్యమ'ని గుండెమీద చెయ్యేసి మరీ చెబుతాడు ముళ్లపూడి మోహన్.

- కందుల శ్రీనివాసరావు

వివేకా సూక్తి: ఫలితం గురించి ఎంత శ్రద్ధ చూపిస్తారో... ఆ ఫలితం పొందేందుకు ఉపయోగించే పద్ధతులపై అంతే శ్రద్ధ చూపు.

యువ 'రక్తం'

'రా' అంటే రక్త దానం, 'జీ' జీవ కారుణ్యం, 'వ' అంటే వన సంరక్షణ... ఈ మూడు లక్ష్యాలతో రాజీవ సంస్థ నడుపుతున్నారు కొందరు యువకులు. సేవ చేస్తూ... మనసున్న వారితో చేయిస్తున్నారు. ఎన్నో ప్రాణాలకు కొత్త ఊపిరిలూదుతున్నారు. అనంతపురం జిల్లా ధర్మవరం కేంద్రంగా సంస్థను హరీష్ స్థాపిస్తే... సోదరుడు మహేశ్, స్నేహితులు దుర్గేశ్, శివ, అజయ్, రమేశ్, వరప్రసాద్, మధుకర్ తదితరుల సహకారంతో నడుపుతున్నారు.



సకాలంలో రక్తం దొరకక ఎవరి ప్రాణాలు పోకూడదని ఈ యువత కృషి చేస్తోంది. రక్తదానం చేస్తోంది. చేయిస్తోంది. జిల్లాలో రక్తనిధికి పేరెన్నికగన్న బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి నిర్వాహకులు సైతం రక్తం అవసరమైతే వీరిని సంప్రదిస్తారు. ఎవరికి రక్తం అవసరమున్నా 90004 19604, 94904 38618కు ఫోన్, వాట్సాప్ మెసేజ్, ఫేస్‌బుక్‌లో పోస్టు చేయమని వారు సూచిస్తున్నారంటే యువత సేవ ఎంత మెరుగ్గా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎక్కడైనా మనుషులు, మూగజీవాలు అచేతనంగా పడిఉంటే వీరి హృదయాలు స్పందిస్తాయి. జంతువులను చేరదీసి, సంరక్షిస్తారు. అవసరమైన మనుషులకు ప్రాథమిక చికిత్స అందించి అనాథాశ్రమంలో చేర్పిస్తారు. మొక్కల పెంపకంపై పట్టణంలోని పలుపాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి వన సంరక్షణకు నడుం బిగించారు. ఊరిలో కన్నా ఊరిబయట చెట్లను కాపాడుకోవడమే లక్ష్యంగా భావించి వాటి సంరక్షణకు ట్యాంకులతో నీరు పోసి పెంచుతున్నారు. "నాన్న సుబ్బరాయుడును ఒప్పించి అమ్మ సేపూరి రజని పేరిట ధర్మవరం మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న ఆరు సెంట్ల స్థలాన్ని రాజీవ సంస్థకు ఇచ్చాం. అక్కడ అనాథ వృద్ధులకు ఆశ్రమ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భవనం పూర్తి అయితే దిక్కులేని ఎంతో మందికి నీడ లభిస్తుంద'ని ఆనందంగా చెప్పాడు హరీష్.

- అబ్దుల్ ఖాదర్‌పాషా, అనంతపురం

వివేకానంద: మీరెలా ఆలోచిస్తే అలాగే తయారవుతారు. బలహీనులమని భావిస్తే బలహీనులే అవుతారు. శక్తిని స్మరిస్తే శక్తిమంతులే అవుతారు. శక్తితో ఎంతో మందికి ఉపయోగపడతారు.

సినిమా తరంగం

రూ.5500తో స్పేస్ షార్ట్ ఫిల్మ్



ఓ చిన్న షార్ట్‌ఫిల్మ్ తీయటమంటే.. అందులోని విజువల్స్ అంత అందంగా ఉండదు ఆ జర్నీ. ఆ దారిలో కష్టాలుంటాయి. బాధలు, వెతలూ ఉంటాయి. వీటన్నింటినీ అధిగమించి 'ది కౌంట్‌డౌన్' అనే ఓ తొమ్మిది నిమిషాల సైన్స్‌ఫిక్షన్ షార్ట్‌ఫిల్మ్‌ను కార్తీక్ మాజేటి అనే కుర్రోడు తీసేశాడు. అయితే అందులో వింతేముందీ.. అంటారా. అవును వింతే ఉంది. తెలంగాణలోని కోల్‌మైన్‌లో ఈ సినిమాని కార్తీక్ షూట్ చేశాడు. ఇద్దరు స్నేహితులతో కలిసి అన్నీ తానై.. ఆస్ట్రోనాట్ దుస్తులు సైతం తానే కుట్టుకున్న సినిమా ప్రేమికుడతడు. 5500 రూపాయలతో 'ద కౌంట్‌డౌన్' లఘుచిత్రం తీసి మంచి సందేశంతోపాటు... స్ఫూర్తినీ చాటాడు **కార్తీక్ మాజేటి.**



- కార్తీక్‌ది హైదరాబాదే. ఇక్కడే ఈ షార్ట్‌ఫిల్మ్ స్క్రీనింగ్ జరిగింది. 'ద కౌంట్‌డౌన్' నిర్మాణానికి ఎంత ఖర్చై ఉంటుందో ఊహించండని చిత్రం చేసిన పది మందిని అడిగితే.. 'యాభై వేలు.. లక్ష.. రెండు లక్షలు..' ఇలా చెప్పుకొచ్చారంతా. అయితే 5500 రూపాయలతో ఈ సినిమా తీశానని కార్తీక్ చెప్పటంతో అక్కడి వారంతా ఆశ్చర్యపోయారు. స్పేస్‌షూట్, హెల్మెట్‌కి రూ.2400, లొకేషన్‌కి ప్రయాణం, వసతికి రూ.2500, సెట్ డిజైన్‌తో పాటు టైప్‌రైటర్ ఖర్చు రూ.600. తనతో పాటు పనిచేసిన ఇద్దరూ ఉచితంగా పనిచేశారు. ఇంట్లోనే వీఎఫ్‌ఎక్స్, ఎడిటింగ్ జరిగింది. ఇలా మొత్తం 'కౌంట్‌డౌన్' ఫిల్మ్ విలువ 5500 రూపాయలని కార్తీక్ చెప్పటంతో సభికులంతా చప్పట్లతో అభినందించారు. ఆక్సిజన్ దొరకనంతగా ఈ భూమిని మనం కాలుష్యం చేస్తున్నామని సైన్స్‌ఫిక్షన్ తరహాలో చెప్పి యువతను ఆకట్టుకుంటున్నాడు కార్తీక్.
- ఐఐటీలో చదివే సమయంలో సినిమా పిచ్చి పట్టుకుంది కార్తీక్‌కి. ఒక సంవత్సరం పాటు యూట్యూబ్ చూసి పాఠాలు నేర్చుకున్నాడు. దీంతో పాటు ఇతనికి ట్రావెలింగ్ ప్యాషన్. ఐఐటీ ఇంటెర్న్‌షిప్ ఆస్ట్రియాలో చేశాడు. ఆ సమయంలోనే ప్రతీ వారాంతం యూరప్‌లో పది దేశాలు చుట్టేశాడు. యూట్యూబ్‌లో 'అద్వైత' అనే ఛానెల్‌ను క్రియేట్ చేసి.. తన అభిరుచిపై దృష్టిపెట్టాడు. బుద్ధగయ ట్రావెల్ ఫిల్మ్ చేశాడు. ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. ఆ తర్వాత రాజస్థాన్, సిక్కిం, ఉత్తర్‌ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, అండమాన్, కర్ణాటక.. ఇలా కొన్ని ప్రదేశాలు తిరిగి షూట్ చేశాడు. 'మై గ్రేట్ ఎస్కేప్' పేరుతో ట్రావెల్ సిరీస్ చేసి కొన్ని యూట్యూబ్‌లో ఉంచాడు. ప్రస్తుతం సినిమానే తన లోకమంటున్న ఈ యువకుడు భవిష్యత్తులో ఎలాంటి అద్భుతాలు చేస్తాడో మరి!

- రాళ్లపల్లి రాజావలి

వివేకా సూక్తి: గమ్యం స్థిరంగా ఉండాలి. మార్గం కచ్చితంగా నిర్ణయించుకోవాలి. ప్రయత్నంలో రాజీ పడకూడదు. అప్పుడే విజయం మనదవుతుంది.

సంగీత కెరటం

రిక్కీ కెజ్. పుట్టింది బెంగళూరు. చదివింది దంత వైద్యవిద్య. అయితే ఏంటి? అంటారా? ఆ యువకుడు చేస్తున్న సంగీత కచేరీల్లోనే ఉంది విశేషం. సామాజిక రుగ్మతలపై చైతన్యం తెచ్చేందుకు సంగీతాన్ని సాధనంగా చేసుకున్న రిక్కీ ఈ మార్గంలో ఇప్పటికే ఎన్నో విజయాలు సాధించాడు. ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయంపై మక్కువతో ఇప్పుడు రైతుల్లో చైతన్య గీతికలు ఆలపిస్తున్నాడు.




రిక్కీకి బాల్యం నుంచి సంగీతమంటే ఇష్టం. తల్లిదండ్రులేమో చదువుకోమని చెప్పేవారు. వారి కోరిక మేరకు బాగా చదువుకుంటూనే కీబోర్డ్, గిటార్ నేర్చుకున్నాడు. 2003లో మొదటి ఆల్బమ్ విడుదల చేశాడు. తర్వాత అంచెలంచెలుగా ఎదిగాడు. 2015లో 'విండ్స్ ఆఫ్ సంసారా'కు గ్రామీ అవార్డు సొంతం చేసుకున్నాడు. ఈ సమయంలో ప్రధాని మోదీ ఇచ్చిన సూచన మేరకు పర్యావరణ కాలుష్యంపై దృష్టిపెట్టాడు. 2015 నవంబరులో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పారిస్‌లో జరిగిన సదస్సులో అనేక మంది దేశాధినేతల ఎదుట పర్యావరణ హితంపై 'శాంతి సంసారా' ఆల్బమ్‌ను ఆలపించాడు. రిక్కీ సేవలను గుర్తించిన యునిసెఫ్ అతన్ని ప్రచారకర్తగా నియమించింది. పర్యావరణం, ప్లాస్టిక్‌పై అనేక రచనల చేసి తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని పిల్లల్లో చైతన్యం తీసుకొస్తున్నాడు. 27పిల్లల గీతాలను స్వరపరిస్తే... వీటిలో కొన్నింటిని ఐసీఎస్ఈ, సీబీఎస్ఈలో సిలబస్‌లో చేర్చారు. 'సంగీతాన్ని మనం డబ్బుకోసం సృష్టించకూడదు. అది మన గుండెలోతుల్లోంచి రావాలి. అప్పుడే దాన్ని విజయం కోరి వరిస్తుంద'ంటూ యువ సంగీత కెరటమై ఎదుగుతున్నాడు రిక్కీ.

- సురేశ్ రావివలస, విశాఖపట్నం

వివేకా సూక్తి: మందలో ఒకరిగా ఉండకు... వందలో ఒకరిగా ఉండటానికి ప్రయత్నించు.

చిరుపుస్తకం.. ప్రాణప్రదం

జీవితంలో తీవ్ర కలతలతో కుంగిపోయిన ఓ యువకుడు ఇక మరణమే శరణ్యమని నిర్ణయించుకున్నాడు. నిర్వేదంతో దిల్లీ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. స్టేషన్‌లో సుదీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్న ఆ యువకుడికి అల్లంత దూరాన బుక్‌స్టాల్‌లో ఓ చిన్న పుస్తకం కనిపించింది. జేబులో మిగిలిన పావలాతో ఆ పుస్తకాన్ని కొన్నాడు.. ఒక్క పేజీ తిరిగేయగానే ఆయనలో ఎక్కడలేని ఉత్తేజం నిండిపోయింది. ఏదో మంత్రశక్తి ఆవహించినట్టు ఆ పుస్తకంలోని ఒక్కో సూక్తి ఆయనకు ఎంతో ప్రేరణను ఇచ్చాయి. చావు తప్ప మరోమార్గం లేదనుకున్న ఆయనను పల్లె వైపు పరుగులు పెట్టించింది ఆ పుస్తకం. మరణం అంచువరకూ వెళ్లిన ఆ వ్యక్తిని కార్యశీలిగా, ఉద్యమ నాయకుడిగా తీర్చిదిద్దిన చిరుపొత్తమే 'వివేకానంద.. హిజ్ కాల్ టు ది నేషన్' (భారతజాతికి నా హితవు). ఆ యువకుడే ప్రముఖ సామాజికవేత్త అన్నా హజారే..! ఈ పుస్తకంలోని అద్భుతమైన సూక్తుల్లో ..



"20 వేల టన్నుల వ్యర్థమైన మాటలకన్నా.. ఇసుమంత ఆచరణ మిన్న"

(ఈ అరుదైన చిన్న పుస్తకం హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠంలో రూ.9 (ఆంగ్లం), రూ.10 (తెలుగు) అందుబాటులో ఉంది)


"స్వామీజీ గ్రంథాల్ని క్షుణ్ణంగా పఠించాను. అవి చదివిన తర్వాత మాతృదేశం పట్ల నాకున్న ప్రేమ వెయ్యి రెట్లు అధికమైంది"
– *గాంధీజీ*



"భారతదేశం గురించి తెలుసుకోవాలంటే వివేకానందుణ్ణి అధ్యయనం చేయండి. ఆయనలో అంతా పురోగామిత్వమే ప్రకటితమవుతుంది. తిరోగమనానికి, నైరాశ్యానికి తావుండదు"
– *రవీంద్రనాథ్ ఠాగూర్*



'వివేకానందుని ధైర్యసాహసాలు అసమానం. ఆయన పురుష సింహంగా వెలుగొందారు. ఆ మహనీయుడి దివ్యశక్తి ప్రభావం ఇప్పటికీ అత్యున్నత స్థాయిలో మనపై ప్రసరిస్తూనే ఉంది"
– శ్రీఅరవిందులు



""దేశప్రజలు ప్రగతిని సాధించడానికి ఉపకరించే పద్ధతిలో స్వామీజీ వేదాంతాన్ని ఆచరణ యోగ్యమైన శాస్త్రంగా విశదీకరించారు. ఆయన వ్యక్తిత్వం చాలా ఉత్కృష్టమైనది. స్వామీజీ గురించి రాసినప్పుడల్లా నేను ఆనందసాగరంలో మునిగితేలుతాను" – నేతాజీ సుభాష్ చంద్రబోస్



నా దేశమే దివ్యక్షేత్రం..

వివేకానందుడు లండన్ నగరం వదిలి వెళ్లే ముందు ఆంగ్లేయ మిత్రుడొకరు ఆయన్ని కలిసి.. 'స్వామీజీ.. సర్వహంగులు, సకల సౌకర్యాలు గల పాశ్చాత్య దేశాల పర్యటనలో పొందిన అనుభవాల నేపథ్యంలో మీ మాతృదేశాన్ని ఎలా అంచనా వేస్తారు' అని ప్రశ్నించగా.. దానికి స్వామీజీ సమాధానమిస్తూ.. 'భారతదేశం నుంచి వచ్చేప్పుడు నా దేశాన్ని ప్రేమించాను. ఇప్పుడూ నా దేశపు దుమ్ము, ధూళీ, గాలి, సర్వస్వం నాకు పవిత్రమైనవే. ఎల్లప్పుడూ నా దేశాన్ని పునీతమైనదిగా, ఓ యాత్రాస్థలంగా, దివ్యక్షేత్రంగా భావిస్తూనే ఉంటాను' అని సమాధానం ఇచ్చారు.

